డిసెంబర్ 1979

సృజన

98

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక



సంవత్సర చందా 15 రూపాయలు ఈ సంచిక రు. 1-50 పైసలు

ఎలచ్చన్లు

'శ్రామిక'

మళ్లొచ్చినాయిరో
మాయదారి ఎలచ్చన్లు ॥మళ్లొ॥

రాబందులు రంగేసుకు
రాసిలకల మంటున్నయి
పులులేమొ ముసుగేసుకు
మేకలమే నంటున్నయి
మొన్న గెద్ద నిన్న సిలక
నిన్నటి పులి నేడు మేక
గెద్దలేవొ సిలకలేవొ
తెలవక మేం సత్తుంటే
మళ్లొచ్చె మళ్లొచ్చె ॥మళ్లొ॥

నిన్న వారే అన్నవాడె
నేడు దొర అంటున్నడు
మొన్న సితక బాదినోడె
కాల్లు వదలనంటున్నడు
నీవె రచ్చ నీవె దిక్కు
నీవె తప్ప నాకెవ్వరు
నీ సేవే నాధేయం
నీ కొరకే నా సాయం
మల్లమల్ల అదే పాట
మల్లమల్ల గదే పాట
ఏది నిజమొ ఏది కల్లొ
తెలవక మేం సత్తుంటే ॥మళ్లొ॥

మొన్న మొన్న కాంగ్రెసోడు
నిన్న జనత అంటున్నడు
నిన్న జనతలున్న వోడు
నేడు కాంగ్రెసంటున్నడు
కమ్మునిష్టు నంటున్నడు
కాంగ్రెసెనక వుంటున్నడు
ఇప్లవాలు తెత్తనంటు
జనత కొమ్ము కాత్తన్నడు
కమ్మునిష్టు లెవ్వరొ
సోసలిష్టు లెవ్వరొ
కాంగ్రెసోల్లు ఎవ్వరొ
జనతవాల్లు ఎవ్వరొ
తెలవక మేం సత్తుంటే
మల్లిమల్లి ఎలచ్చన్లు ॥మళ్లొ॥

ఎమర్జెన్సి ఎట్టింది
పేదోల్లబాగుకంట
నక్సలైట్లనంపింది
సోసలిజం కోసమంట
తానెత్తిన అవతారం
బీదదిక్కు రచ్చనకట
అబయఅస్త మెట్టుకొని
అమ్మెదో సెపుతుంది
మరి గన్నేళ్ళపాలనలో
మాకేటి వొరిగిందో
తెలవక మేం సత్తుంటే
ఎలచ్చన్లు ఎలచ్చన్లు ॥మళ్లొ॥

మాలోడుగ బుట్టింది
మాలోల్ల కోసమంట
మంత్రిగ పనిసేసింది
మాలోల్ల బాగుకంట

— (చివరి కవర్ లోపలి పేజీలో

సృజన

ఆధునిక సాహిత్య వేదిక
మాస పత్రిక

98

డిసెంబర్ 1979

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Warangal Printing Press, J.P.N. Road, Warangal - 506 002
for Venkataramana Mudranalayam, Warangal
Working Editor: Varavararao

ఏ కత్తి మెత్తగా తెగుతుంది!

మెదక్ నియోజకవర్గం నుంచి నామినేషన్ పత్రం వేసి తెలుగుదేశం నాలుగు చెరగులా మళ్ళా వీచిపోయిన ఇందిరా ప్రభంజనం ఆంధ్రప్రదేశ్‌లో జనతా పరిపాలన లేనందున, ఇందిరా కాంగ్రెస్ పాలన వున్నందున ప్రజలు కష్టాలు కన్నీళ్ళు లేకుండా హాయిగా వున్నారని ఒకటికి రెండుచోట్ల ఉద్ఘాటించింది.

ఇదే మెదక్ జిల్లాలో గిరాయిపల్లి అడవుల్లో ఎమర్జెన్సీలో నలుగురు విప్లవ వీరులను కాల్చి చంపింది ఇందిరా-వెంగళరావు ప్రభుత్వం. ఆ ఎమర్జెన్సీలో ప్రకటించిన ఇరవై సూత్రాల్లో ప్రముఖమైన వెట్టిచాకిరీ రద్దు చట్టాన్ని అమలుచేయడానికి ప్రయత్నించిన ఒకఉన్నతాధికారిని రాష్ట్రం నుంచి బదిలీచేసింది ఇదే ఇందిరా-చెన్నారెడ్డి ప్రభుత్వం.

హరిజన, గిరిజన, బలహీన వర్గాలకు ప్రతినిధి ఇందిరాగాంధీ– అనుచరుడు చెన్నారెడ్డి హయాంలో పోలీసుల చేతుల్లో చచ్చిన దాసయ్యా హరిజనుడు, అంజయ్యా హమాలీ, అహ్మద్ హుస్సేన్ పేదముస్లిం. లొత్తునూరులో పోలీసు కాల్పుల్లో మరణించిన పోచయ్యా నీరేటికాడు. పండితాపురంలో పోలీసు కాల్పుల్లో మరణించిన వృద్ధ స్త్రీ నాగలక్ష్మి, యువకుడు లాలయ్యా వెనుకబడిన కులాలవాళ్ళే. గూండాల చేతుల్లో చచ్చిన జన్ను చిన్నాలు హరిజనుడు. పోలీసుల రాక్షస రతికి ఎరయైన రమీజాబీ, బలియైన షకీలా పేద ముస్లిం స్త్రీలు. పండితాపురం సుశీల బలహీనవర్గానికి చెందిన వితంతువు. భూస్వాముల గూండాలచే చెరచబడిన కుదురుపాక రాజవ్వ హరిజన స్త్రీ. కుదురుపాకలో, రామయ్యాపల్లిలో, రాగినీడు, పాల్తెంలలో భూస్వాముల, పోలీసుల దౌష్ట్యానికి, దౌర్జన్యానికి గురియైన కుటుంబాలు హరిజనులవి, బలహీన వర్గాలవి. ఇవ్వాళ కరీంనగర్ అదిలాబాదు రైతాంగ పోరాటానికి చోదకశక్తి హరిజన గిరిజన బలహీనవర్గాలు. జగిత్యాల, సిరిసిల్లాలను 'కల్లోలితప్రాంతాలు'గా ప్రకటించి మిగిలిన ప్రాంతాల్లో కూడ పోలీసు క్యాంపులుపెట్టి, రైతాంగాన్ని కేసుల్లో ఇరికించి, జైళ్ళకు పంపించి వాళ్ళమీద ఏరుచుక పడుతున్నది ఈ 'అధోజగత్సహోదరుల' ప్రతినిధినని చెప్పుకుంటున్న ఇందిరా ప్రభుత్వమే.

ఈ ఇందిరా పార్టీ పరిపాలన చలవయే ఇటీవల హైదరాబాదులో మత కలహాల పేరిట గూండాల, ఉన్మాదుల స్వైరవిహారం, లూటీలు, దహనకాండ. అలవాటు నుంచి వ్యసనంగా, వ్యసనం నుంచి దాహంగా పరిణమించిన లంచగొండితనం, అవినీతి, ఆశ్రిత పక్షపాతం – మంత్రి పదవులకు, అధికారానికి అర్హతలు.

ఇవి ఇంత సజావుగా చెలామణికావడానికి ఎదుటి పార్లమెంటరీ పార్టీల చేతులు కూడా శుభ్రంగా లేకపోవడం కూడ కారణం.

చీరాల కేపాల్ కంపెనీలో కార్మికులపై చెన్నారెడ్డి పోలీసులేకాదు, కలకత్తా ఓడరేవు కార్మికులపై జ్యోతిబసు పోలీసులు కూడ కాల్పులు జరిపారు. ఇక్కడ ఒకడు చస్తే అక్కడ నలుగురు చచ్చారు. కాగా సంఘటనపై ఊహించని చోట 'మత కలహాల' పేరుతో విధ్వంసం జరిగింది కలకత్తా మహానగరంలో. ఇవ్వాళ 'ఇందిరా నియంతృత్వాన్ని', ఆంధ్రప్రదేశ్‌లో మార్క్సిస్టు పార్టీతోసహా అన్ని 'వామపక్ష' పార్టీలు వెంగళరావు నాయకత్వంలో, వీలయితే 'జనతా మతోన్మాదుల'తో కూడ కలిసి ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్నాయి. ఇందిరా నియంతృత్వం గురించి ఎవరు చెప్తున్నారు? ఎమర్జెన్సీలో సైతం ఆమెలో ఫాసిస్టువ్యతిరేక అభ్యుదయాంశను చూసిన సిపిఐ. ఆమెనూ ఆమె సెక్రెటరీ జనరల్ బహుగుణను బహిరంగంగా అభినందించిన శ్రీపాదడాంగేపై ఈనాటికీ ఏ చర్య తీసుకోని సిపిఐ. ఇంకా ఎవరు చెప్తున్నారు? 1967లో ఆమె మద్దతుతోనే ఆమెకు నమ్మకమైన, సమర్థుడైన ఏజంటుగా వ్యవహరించి నక్సల్బరీ ఉద్యమాన్ని రక్తపు చేరుల్లో ముంచిన సిపిఐఎం. 1969లో ఆమె నిలబెట్టిన అధ్యక్ష అభ్యర్థి వివిగిరిలో అభ్యుదయాంశ చూసిన సిపిఐఎం. 1971లో బంగ్లాదేశ్ దురాక్రమణను సమర్థించిన సిపిఐఎం. అంత పాతకాలానికి ఎందుకు? 1979లో ఇందిరా ఆశీర్వాదాలతో గద్దెనెక్కిన చరణ్ చరణాల చెంత చేరిన సిపిఐఎం. నెహ్రూ - ఇందిరా ఇరవై ఎనిమిదేళ్ళ పరిపాలనలో బేరీజు వేసుకుంటే ఈ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు స్థిరంగా, దృఢంగా, సూనృతంగా ప్రజల పక్షం నిలిచి నియంతృత్వాన్ని ఎదిరించింది ఎప్పుడు? నిన్న 'ప్రజాస్వామ్య శక్తుల' పేరుతో జనతా పార్టీతో పొత్తు పెట్టుకున్నపుడుగానీ సి.పి.ఐ.ఎం.కు ఇందిరలో నియంత కనిపించలేదు. ఇవ్వాళ అదే జనతా పార్టీలో మతోన్మాదం ఆ ప్రభుత్వం కూలగానే కనిపించింది. అందులోంచి విరిగిన తుంట వెంటపడి ఇవ్వాళ నియంతృత్వ, మతతత్వ శక్తుల వ్యతిరేక పోరాటం ప్రకటిస్తున్నవి.

ఇంక ప్రజాస్వామ్యాన్ని ఉద్ధరించి దేశానికి రెండవ స్వాతంత్ర్యాన్ని తెచ్చానని ప్రగల్భాలు పలికిన జనతాపార్టీ బెల్చి, కాన్పూర్, జంషెడ్‌పూర్, అలీఘడ్, ఫరీదాబాదులలో. హరిజనులపై, ముస్లింలపై, కార్మికులపై తూటాలు ప్రయోగించి తన స్వభావాన్ని ప్రకటించింది. రాజ్యాంగంలోనే సాయుధ తిరుగుబాటును అణచడానికి పరిమిత ప్రాంతాల్లో ఎమర్జెన్సీకి అవకాశం కల్పించింది. నాగాలాండ్, మిజోరాంలలో భయంకరమైన మిలటరీ హింసాకాండను కొనసాగించింది. పిడి చట్టం తేవాలన్న 'ప్రజాస్వామ్య కర్తవ్యం' పరిపూర్తి చేయకుండానే పరాజయం పొందినా ఆ పవిత్ర కర్తవ్యాన్ని చరణ్‌సింగ్ పూర్తిచేసాడు. 77 లోకసభ స్థానాలతో ప్రధానియై 200 స్థానాల జనతాకు అవకాశం ఇవ్వకుండాచేసి తన పదవిని పార్లమెంటును రద్దుచేయ

డానికీ, తానే ఎన్నికల దాకా ప్రధానిగా కొనసాగడానికి 'సద్వినియోగం' చేసుకున్న 'ప్రజాస్వామ్యవాది' ఆయన. కరువు, అధికధరలు వంటి అశేష ప్రజానీకం నిత్యజీవిత సమస్యలను ఎన్నికల ఇంద్రజాలంతో మైమరపించి మాగన్ను ఏలుబడి సజావుగా సాగిస్తున్నాడు. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లతో కవ్వింపుల పేరుతో ఎన్నికలకన్నా ఉన్మాదమైన యుద్ధాన్ని రుద్దడనే హామీలేదు సరికదా అనుమానాల పొగలు కూడ పొడసూపుతూనే వున్నాయి.

అయితే ఏదీ ఏ ఒక్కరూ అనుకున్నట్టుగా సాగే రోజులుగా లేవివి. దేశంలోని భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాల విషయంలోనే కాదు ఉభయ సామ్రాజ్యవాదాలు కూడ ఎన్నికల దగ్గర గుంట నక్కలుగా కాచుకొనివున్నాయి. ఇందిరా బహుగుణ డాంగేలయినా, చరణ్ లిమయే నంబూద్రిలయినా రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదానికి రాస్తాసుగమమే. జగ్జీవన్‌రాం, చంద్రశేఖర్‌లను వామపక్ష, అభ్యుదయ నినాదాలతో ఎన్నికల తర్వాతనైనా ఆకర్షించగలనన్న భరోసా లేక పోలేదు. అథవా వాజపేయి అయినా ఇరవై సంవత్సరాల రక్షణ ఒడంబడికను రష్యాతో కొనసాగించినవాడే కదా. అట్లాగే అమెరికన్ సామ్రాజ్యవాదానికీ ఒక సంజయ్‌గాంధీయో, ఒక సుబ్రహ్మణ్యస్వామో, ఒక సుబ్రహ్మణ్యమో అన్ని పార్టీల్లోనూ ప్రతి నిధులున్నారు.

ఒక కెజిబి (రష్యన్ గూఢచారి) ఏంజెటుగానో, ఒక సిఐఎ (అమెరికన్ గూఢచారి) ఏజెంటుగానో దశాబ్దాలుగా ఏ ప్రభుత్వంలోనైనా సరే మంత్రులుగా కొనసాగుతున్న 'దేశభక్తులు' పరిపాలిస్తున్న ప్రభుత్వం మనది. ప్రపంచ బ్యాంకు మాట వినక పోతేనో, కంపూచియా ప్రభుత్వాన్ని గుర్తించకపోతేనో సామ్రాజ్యవాద దేశాల అలుకకు గురియై కూలిపోయే 'స్వతంత్ర' ప్రభుత్వాలు మనవి. ఏ గూఢచారి ముఠాకు ఓటువేసి దేశ సంపదను, దేశ ప్రజల కష్టాన్ని ఏ భూస్వామ్య, పెట్టుబడిదారీ దళారీల ద్వారా సామ్రాజ్యవాదాలకు తాకట్టు పెడదామని తేల్చుకోవడానికి ప్రజలను ఎన్నికల కబేలాకు మరోసారి తీసుకపోజూస్తున్నాయి ఎన్నికల పార్టీలు. ఏ తలారీ అయితే మెత్తగా మెడకోస్తాడో ఎంచుకోవాలి. కాని ప్రజలు గొర్రెలు, మేకలు కారు.

పార్లమెంటరీ పంథాకు ప్రత్యామ్నాయమైన ప్రజా పంథాను ఎజెండా మీదికి తెచ్చిన నక్సల్బరీ పోరాట ప్రభావం భారతదేశమంతటా వుంది. ఆదిలాబాదు, కరీంనగర్, భోజ్‌పూర్ రైతాంగ పోరాటాలు నూతన ప్రజాస్వామిక విప్లవానికి బాటలు వేస్తున్నాయి. చైతన్యవంతులైన ప్రజలు ఈ బాటను పటిష్ఠం చేసే వ్యావసాయిక విప్లవంలో పాల్గొని ఎన్నికలను బహిష్కరిస్తారు.

12-12-79.

— సంపాదకుడు

నవల - సీరియల్

చౌ లి-పో

ఇంగ్లీషు నుంచి తెలుగు

నళిని



ఉప్పెన

రెండవ భాగం

(గత సంచిక తరువాయి)

7

ఈ దెబ్బతో యువాన్ మావో వూళ్ళోవాళ్ళకి మంచి వూపొచ్చింది. కువో అంతా బాగా చక్కబెడతాడన్న ధైర్యంతో సియావో 'వాన్'తో కలిసి సాంచియా బయల్దేరేడు. అది కొండపక్క ఊరు. అక్కడ ఇంకా కార్యకర్తలు కావలసి వీళ్ళిద్దరు బయల్దేరేరు. కువో, మరికొందరు అక్టివిస్టులు వాళ్ళని దక్షిణపు గేటు వరకు సాగనంపేరు. వెళ్ళిపోతూ సియావో కువో వీపుతట్టి,

"నువ్వు రైతుసంఘం గదిలో చేరిపో. జాగర్త, మనం స్వాధీనపరచుకున్న వాటికి శతృవులు నిప్పెట్టగలరు" అన్నాడు.

ఆ చలిలో హోరుగాలిలో సియావో స్లెడ్జి ఎక్కి గంటకి ఆరుమైళ్ళ వేగంతో సాంచియావైపు సాగిపోయేడు.

లోగడ సియావో ఉన్నగదిలో చేరేడు కువో.

రేయింబవళ్ళు పనిచేస్తూ యువాన్ మావో వూరివాళ్ళు విద్రమరిచిపోయేరు, అయినా వాళ్ళ ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. ఎనిమిదోరోజురాత్రి తీన్‌తాత రైతు సంఘంలోకి రొప్పుకుంటూవచ్చి కువో కో వార్త అందించేడు,

"పాతరోజుల్లో వీహోజిల్లాలో 'తు' ఒకముఠా నాయకుడు. ఆడికాడ శానా ఎండి అచ్చులుండాల" అని.

"నాకూ తెలుసుగాని అడు నోరిప్పడే!" అన్నాడు కువో.

"అయితే ఆడిపెద్ద పెల్లాం కొడుకు నడుగు. ఆడికి యీడి కాడ బాగా జరక్క ఏరుపడిపోనాడు. ఏ పుట్టలో ఏ పాంవుందో, ఎందుకైనా మంచిది ఆడినోసుట్టుఅడిగి సూడు."

'తు' పెద్దకొడుకు సారా దాసుడని గుర్తొచ్చింది కువోకి. కోపరేటివ్‌స్టోరులో రెండుసీసాల్లో సారానింపి, చిక్కుడు గింజలకూరచేసి వాడిని భోజనానికి పిలిచేడు.

కువో చాలా తక్కువ తాగుతూ పెగ్గుమీదపెగ్గు బిగిస్తున్న 'తు' కొడుకుని గమనిస్తూ పైపుకాలుస్తున్నాడు. వాడికి తాగుతున్నకొద్దీ వాగుడెక్కువయింది. రెండు సీసాలు అయిపోగానే మరో సీసాతెచ్చేడు కువో. బాలసంఘసభ్యులు కొందరిదిచూసి మహిళా సంఘంలో రిపోర్టిచ్చేరు.

"అతన్నొగ్గిండి. మొగోల్ల గొడవలు మనకేల?" అంది పాయిభార్య కాని లీకీ-లాన్ ఒప్పుకోలేదు.

"సియావో బాబు ఇట్టెల్లినాడో లేదో అప్పుడే కువో బరి తెగించేసినాడు. ఇగిలాగా ఒగ్గిడ(వే? అతన్నే కడిగేద్దాం రాండి" అని రైతు సంఘం ఆఫీసువేపు దౌడుతీసింది. ఆమె వెనకే మరో పదిమంది ఆడపిల్లలు. ఆ వెనకే మరో పది మంది మగపిల్లలతో పందులకాపరి 'వూ'. ఈ గుంపును చూసి 'తు' కొడుకు తడబడి తన కోసమే వచ్చేరనుకుని చేతిలో గ్లాసు వదిలేసేడు. కాంగ్ మీదున్న చాప తడిసి పోయింది. కొందరు పిల్లల చేతిలోని ఈటెలు చూసి మరీ ఒణికిపోయేడు.

"సైర్మన్ కువో! ఓ సుట్టిలా వస్తావేటి?" అని పిలిచింది లీకీలాన్.

వాళ్ళ తీరుని బట్టి విషయం గ్రహించిన కువో నవ్వుతూ పక్కగదిలోకి వాళ్ళ ననుసరించేడు. లీకీ-లాన్ కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి. కోపంతో వగరుస్తుంటే ఆమె గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి. తలెగరేసి వళ్ళు బిగించిందే తప్ప ఆవేశంతో నోరు పెగలందే! చివరికి,

"ఇదంతా ఏటి సెయిర్మన్ కువో? బందాలు తెంచుకోను జనం పొద్దోలు పని జేత్తన్నారు. నువ్వేమో యీ పనికిమాలినోడితో మజా జేత్తుండావ్. నువ్వూ చాంగ్‌పూ-యింగ్ నాగే బుగతలతో రాజీ పడతావేటి, సెప్పు" అని నిప్పులు కురిసింది.

కువో నవ్వి లీకీ-లాన్ చెవిలో ఏదో వూదేడు. అప్పటికి పరిస్థితి అర్థ మయిందామెకి. కోపమంతా కరిగిపోయి, "పోదాం రాండి. మొగోల్ల గొడవలు మనకేల. అతను సేసిన్దానికి అతనే జవాబుదారీ" అంటూ పైకి దారితీసింది. అందరూ ఆమె వెనకే వెళ్ళిపోయేరు.

అంతవరకు పక్కగదిలో వజవజ వణుకుతున్నాడు 'తు' కొడుకు. కువో వచ్చేక ఇద్దరూ మళ్ళీ గ్లాసుల ముందు కూర్చున్నారు. మరో రెండు పెగ్గులు వేసేక 'తు' కొడుకు భోరున ఏడ్చేడు. అతనికిదో అలవాటు. ఓ చేత్తో సీసా పట్టుకుని ఏడుస్తూ తన గోడు వెళ్ళబోసుకున్నాడు. సవతి తల్లి తనని బాగా చూసేది కాదు.

రోజంతా పనిచేయించి గంజిలో నాలుగు మెతుకులు పెట్టేది. తౌడుక్కూడు అతుకుల బొంతలే యిచ్చేది.

"మంచుకో ప్రభుత్వం పడిపోయేక చలికాలంలో నాకు కాళ్ళ జోళ్ళు లేవు. మంచు కురుస్తుంటే పందులు కాసేందుకు నన్ను పంపింది. ఆ చలి నా కాలి వేలిని తినేసింది. నా సవతి తమ్ముడు మాత్రం కాంగు మీద వెచ్చగా తొంగున్నాడు. గుర్రాల మేతకి చిక్కుడు అచ్చు తేడానికి నేను గదిలోకి వెళ్ళేను. ఆ దొంగముండ "ఏరా ఇక్కడేం చేస్తున్నావ్? బుజ్జిగాడు నిద్రోతుంటే ఆగలేవా? వాడిని లేపాలనా?" అని కసిరేసింది.

నా పెళ్ళాం ఎప్పుడో చచ్చిపోయినా నాకు మళ్ళీ పెళ్ళి చెయ్యరు ఎంతకీ. వాళ్ళ ఆస్తిలో నాకు వాటా లేదు. మీరు వాళ్ళని తుడిచిపెట్టండి. నాకేం విచారం లేదు" అని చెప్పేడు.

"నీ సవతి తల్లికి సొంత సొమ్ముకున్నాదా?" అని అడిగేడు కువో.

"ఆఁ. మరిదానికి లేపోతే ఎవరికుంటుంది?"

"అదెవరికిస్తాది?"

"మరెవరికి, నా సవతితమ్ముడికి."

"నీకు వాటానేదా?"

"లేదు, చచ్చినా ఇవ్వదు"

కువో ముందుకి వంగి, నెమ్మదిగా

"అల్ల ఎండి, బంగారం ఎక్కడుంటాది?" అని అడిగేడు.

"నాకు బంగారం సంగతి తెలీదు"

"మరి ఎండి?"

"ఆ దొంగముండ ఓ రోజు మానాన్నతో సిన్నమాట సెప్పింది. ఆ *బేరి సెట్టుకింద ఓమారు చూసిరండి. ఏ ఆడవిపందో దాన్ని తవ్వెయ్యగలదు."

"ఆ బేరిసెట్టెక్కడున్నాది?"

"నిజంగా నాకు తెలీదు."

మూడోసీసా ఖాళీఅవగానే కువో 'తు' కొడుకుని పంపేసి తన చిన్నగ్రూపుని పిలిపించేడు. కువో, ఓల్డ్‌సన్‌కల్సి 'తు' దగ్గరకు, పాయిభార్య, లీకిలాన్ ఆడవాళ్ళ దగ్గరకు వెళ్ళేలా నిర్ణయించేరు.

---

*Pear Tree

'తు' మళ్ళీ పాత పాటే పాడేడు.

"నాదగ్గరేఁవుంది? ఉన్నదంతా ఇచ్చేసేను"

మరీగట్టిగా అడిగితే

"అబద్ధఁవాడితే నాకళ్ళుపేలిపోతాయి" అన్నాడు.

వాడి అబద్ధాలకు ఓల్డ్‌సన్ నవ్వేడు.

"మల్ల అదే కూతా? నీరగళ్ళం మాకు తెల్సిపోనాది. నీ పెద్దకొడుకు కువో బాబుకి అన్నీ సెప్పేసేడు" అని ఓచురక అంటించేడు.

'తు' బెదిరిపోయేడు. ముఖం మీదినించి చెఁవట ధారకారింది. చాలా సేపటి దాకా తేరుకోలేక పోయేడు. కువో, ఓల్డ్‌సన్ గుసగుసలాడుకున్నారు.

"బేరీసెట్టుకిందేటున్నాది? అంతా మాకుతెల్సులే" అని ఓల్డ్‌సన్ బెదిరించేడు.

"ఏఁవన్నావ్?" అన్నాడు 'తు', గుడ్లుమిటకరిస్తూ.

"బేరీసెట్టుకింద ఏటి పాతెట్టీసినావ్?"

తన రహస్యం వీళ్ళకి నిజంగా తెలుసోలేదో తేల్చుకునేందుకు కువోని ఓల్డ్‌సన్‌ని పట్టి పట్టి చూసేడు 'తు'.

"పద, సెట్టు కాడికెల్దాం. సెప్పనంతావా, మాదారి మాఁవే సూసుకుంతాం. కాని నీ సిన్నతప్పు ఇంతింతై పోతాది" అని,

"ఓల్డుసన్, ఈడేటీ సెప్పడుగాని ఈడ్నితీసుకుపోయి యీడి పెద్దకొడుకునిపిలు" అన్నాడు కువో.

'తు' తలుపుదాకా నడిచి, వెనక్కితిరిగి

"వాడు మీకేం చెప్పేడు? అదంతా అబద్ధం" అన్నాడు.

" 'వాడు' అంటే ఎవరు?" అన్నాడు ఓల్డుసన్.

"వాడే నా పెద్దకొడుకు"

"ఏటన్నాడంటే.... ఆఁ" కువోకన్ను కొట్టడంతో ఆగిపోయేడు ఓల్డుసన్.

"ఏటన్నాడంటే, ఆ బేరీసెట్టు...." కువోమళ్ళీ 'తు'కి కనిపించేలా కన్ను కొట్టేసరికి ఓల్డుసన్ మళ్ళీ ఆగేడు.

"ఆడేటీ పొక్కనేదు కదా ఓల్డుసన్?" అన్నాడు కువో.

"ఏటీ సెప్పనేదులే" అన్నాడు ఓల్డుసన్, పళ్ళికిలిస్తూ. ఇదంతా చూసేసరికి 'తు'కి అనుమానంపెరిగింది. కువో కన్ను కొట్టడం, ఓల్డుసన్ నర్మగర్భంగా

మాట్లాడడం, బేరిచెట్టు గురించి చెప్పడం– ఇదంతా 'తు'ని భయపెట్టింది. తటపటాయిస్తూ ముందుక అడుగేసేడు. గడపమీద కాలేసి, మళ్ళీ ఆగి, వెనక్కితిరిగి,

"సరే, బేరిచెట్టు దగ్గరకు వెళదాం. కాని ఇవాళ అలసటగా వుంది. రేపు తప్పకుండా వెళదాం" అన్నాడు.

ఇందులో ఏదో కిటుకు వుందని గ్రహించి కువో

"ఎల్తే యియాలే ఎల్లాల" అని పట్టుబట్టేడు.

'తు' కాంగు మీద చతికిలబడి "ఇవేళ కదిలితే చచ్చిపోయేటంత అలుపుగా వుంది నాకు. రేపెళదాం" అన్నాడు.

"పాపం! కదల్లేవా? నా స్లెడ్జి బండున్నాదిలే" అని లేచి, కాసేపట్లో మూడు గుర్రాల స్లెడ్జితో తిరిగొచ్చేడు ఓల్డ్‌సన్.

"కుబేర మహరాజా, స్లెడ్జి లడీగున్నాది. బేగిరా" అని అరిచేడు.

'తు' అయిష్టంగా స్లెడ్జి ఎక్కేడు. కువో ఒక సైనికుడితో పాటు పార, గునపం తీసుకొని కూర్చున్నాడు. 'తు' దారి చూపుతూంటే స్లెడ్జి దక్షిణానికి సాగిపోయింది. చలికి వాళ్ళ ముక్కులు మంటపెట్టేయి. దక్షిణపు గేటు బయట రోడ్డు సాఫీగా వుంది. మంచు కురుస్తుంటే నేలంతా తెల్లదుప్పటి పరిచినట్లుంది. రోడ్డు, మిట్టపల్లాలు, పొలాలు అన్నీ తెల్లగా మెరిసిపోతున్నాయి. గుర్రాలు గోతిలో అడుగేయడంతో స్లెడ్జి పక్కకొరిగింది. బండి మీద మనుషులు కింద పడిపోయేరు. కాని స్లెడ్జి నేల మట్టంగా వుండడంవల్ల, నేల మంచుతో మెత్తగా వుండడంవల్ల ఏంవీ దెబ్బలు తగల్లేదు. వాళ్ళు లేచి దులుపుకుని మళ్ళీ స్లెడ్జి ఎక్కేరు.

ఊరికి రెండుమైళ్ళ దూరంలో దుబ్బులు, తుప్పలు బాగా పెరిగిన చోట ఆగింది బండి. 'తు' కిందికి దిగి అటూ యిటూ చూసి కొంత బెరడు చెక్కేసిన బేరిచెట్టుని చూసి,

"దీని కింద తవ్వండి" అన్నాడు, సర్వం కోల్పోతున్న ముఖంతో. వెనక్కి పోయి స్లెడ్జి మీద ఏడుపు మొహంతో గడ్డం కింద చెయ్యి పెట్టుకూచున్నాడు.

సైనికుడు పారతో మంచు లాగేస్తుంటే కువో పలుగుతో తవ్వేడు. కువో దస్సిపోతే సైనికుడే తవ్వసాగేడు. వాళ్ళ భుజాలను, వీపులను టోపీలను మంచు కప్పేసింది. వాళ్ళని ఐస్‌క్రీంలోంచి తీసినట్టున్నారు. ఇంతలో నల్లమట్టిలోంచి ఏదో బూడిదరంగు వస్తువు బైట పడింది.

"ఆఁ, అద్గదీ! ఎండి అచ్చు ఎలుగు సూసింది" అన్నాడు ఓల్డ్‌సన్. వరసనే నాలుగచ్చులు దొరికేయి. ఎన్నడూ ఎరగని ఆ అచ్చులను రైతులు కళ్ళప్పగించి చూస్తున్నారు. అవి పాతసీసపు ముక్కల్లా వున్నాయి.

"ఇది నాకు రోడ్డు మీద గాని అవుపిస్తే ఒగ్గీసుండీవోన్ని"

"సీసం ముక్కనాగే వుంది"

ఓల్డ్‌సన్ ఓ అచ్చు పైకి తీసి నిపుణుడిలా దాన్ని కొట్టి చూసేడు—

"సీసం ఈ చప్పుడవుతాదేటి? ఇది ఏభై రెండు సిన్నా వుంటాది. పంచు వంశంలో నాను శానా ఎండి అచ్చులూసేను కాని నా సొంతం కాదులే." అన్నాడు.

8

పేదరైతులు, కంబార్లు మరోసారి సమావేశమయేరు. రైతుసంఘం ఆఫీసు కిటికీలు, తలుపులు మూసి నేలమీద పెద్దమంట వేసేరు. ఆ పొగకి అందరూ దగ్గుతూ కళ్ళు నులుముకుంటున్నారు. వెండి అచ్చుల గురించి చిలవలు పలవలుగా చెప్తున్నాడు ఓల్డ్‌సన్. ఇంతలో పందులకాపరి 'వూ' అందరినీ తోసుకుంటూ ఒచ్చి కువో చెవివో ఏదో వూదేడు.

"ఇంకా యివరంగా తెలుసుకోనిరా" అని పంపేసేడు కువో. పాయిభార్యని, లీకీ-లాన్‌ని కూడా సంగతంతా తెల్సుకురమ్మని పంపేడు.

ఇద్దరాడ వాళ్ళు 'తు' ఇంటి కొచ్చేసరికే ఇరుగు పొరుగు జనం అక్కడ మూగేరు. 'తు' కోడళ్ళిద్దరు తగువాడుకుంటున్నారు. వూ, పాయిభార్య, లీకీ-లాన్, వెనకనించే అంతా గమనిస్తున్నారు. గడకర్రలా వున్న కోడలు కాంగ్ మీద కూర్చుంది. కాలుమీద కాలేసుకుని నోట్లో పైపు పెట్టుకుని కోపంగా చూస్తోంది. అంతమంది చూస్తున్నారనైనా లేకుండా పైపు తీసి తుపుక్కున వుమ్మేసి

"ఛీ నోర్మూయ్, ఎవర్నే కూకలేస్తున్నావ్?" అంది.

దుక్క ముక్కలా వున్న కోడలు కోటుగుండీలు విప్పి గుక్కపట్టి ఏడుస్తున్న కొడుక్కి పాలు కుడిపింది.

"నా పిల్లడు, నా ఇష్టం. మధ్యలో సవతి పోరునాగ నీగోలేటే?"

"అత్త మీద కోపం దుత్త మీద తీరుసుకున్నట్టున్నాది" అంది 'గడకర్ర' పైపుమళ్ళీ నింపుకుంటూ.

'దుక్కముక్క' కస్సున లేచింది. "అవును. నిన్నే అన్నాన్నేను. అంటే ఏం?" అంది పిల్లడికి పాలు కుడపడం మానేసి. వాడు మళ్ళీ రాగమందుకున్నాడు.

'గడకర్ర' కొంగు దిగి 'దుక్కముక్క'కి ఎదురుగా నిలబడి "నన్నెందుకు తిడతావ్? నువ్వొత్త పాపిష్టిదానివి. అస్తమాను ఎవరో ఒకరిని ఆడిపోసుకుంటావ్. నిరుడు నేను పురిటి మంచంలో వుండగా నీ మొగుడితో పెద్ద తగువెట్టుకున్నావ్. దాంతో నేను జడుసుకుని మంచాన పడ్డాను." అని బొరలు చాస్తూ తిట్టిపోసింది.

'దుక్కముక్క' కూడా ఏడుస్తున్న బిడ్డని చంకనేసుకుని ముందుకొచ్చి "నువ్వ పత్తిత్తువా? నీ మొగుడోసారి నీ కాళ్ళ మీద పడలేదా? రాణిగారికి అప్పటికీగాని అలక తీరలేదు. నువ్వ నందంటే నంది పదంటే పందేనాయె. మొగుడిని కొంగున ముడేసుకుని బొమ్మలా ఆడిస్తున్నావ్" అని చెప్పింది.

"అవునే, నా మొగుడు నా కాళ్ళ మీద పడ్డాడు. అయినా అదంతా నీ మూలానే. నేను పురిట్లో జడిసేను కాబట్టె అలాపడ్డాడు. అబ్బబ్బ, ఎంత గోల చేసేవు!"

"నీ నోట పురుగులుపడ, నే గోల చేసేనా? నీ గదిలో అరిచేనా? నీ మాయ రోగం నువ్వ తెచ్చుకున్నదే కదే?"

"నా రోగం వదలకుండానే నాచేత చాకిరి చేయించిందెవరు?" అంది గడకర్ర.

"మొగుణ్ణి కాళ్ళ మీద పడమందెవరు?" అంది దుక్కముక్క.

"అది నీ తప్పేనే సెక్‌కారీ"

"కాదు నీ తప్పేనే దగుల్బాజీ"

"సంవత్సరాది పండక్కి నువ్వ కొంగు తుడవకపోవడం నా తప్పేనా?"

"నేను తుడవలేదూ? తుడవలేదూ? చెప్పవే నంగనాచీ" అంది దుక్కముక్క. జనం వింటున్న సంగతి కూడా మర్చిపోయి.

ఇది విన్న పాయిభార్యకి అనుమానమొచ్చి లీకీ-లాన్‌కి కన్ను కొట్టింది. ఇద్దరూ జనాన్ని తప్పించుకుంటూ బయటకొచ్చేరు.

"కువోతో చెప్దాం. నలుగురు కూడ బలుక్కుంటే ఇసయం తేలిపోతాది" ఇద్దరూ రైతుసంఘం ఆఫీసుకేసి నడిచేరు.

'తు' కోడళ్ళ తగువు యింకా తీరలేదు. చూసేవాళ్ళు కొందరు ఆనందిస్తున్నారు, కొందరు తగువు తీర్చాలని చూస్తున్నారు, మరి కొందరు ఇద్దర్నీ తైపారు వేస్తున్నారు.

"ఈళ్లేటి కుక్కల్లా కొట్లాడుకుంతన్నారు ?"

"ఒకల్లేనా మంచోల్లయితే యింతవరకు రాకపోను"

"రెండు సేతులు కలిత్తేనే మా౯వా, సప్పట్లు"

"ఈ ఆడోల్లు మా కానోల్లు"

"ఇంక ఆగండమ్మా తల్లీ"

"మహిళా సంగంలో తగువు తీర్సుకోండి"

"బుగతల ఆడంగులు ఆక్కడికెల్లొచ్చా ?"

ఆతగవు మధ్యాహ్నంనించీ సాయంత్రం వరకు సాగింది. ఇంతలో పాయి భార్య కువోకి సంగతంతా చెప్పింది. "సలికాలంలో కాంగు ఎవరు తుడుత్తారు ?" అన్నాడు నోట్లోపైపుతోసే.

"ఆ పలండి "నాను తుడవనేదా, తుడవనేదా ?" అన్నాది. దాన్ని తుడిసే వుండాలమరి" అంది లీకీ-లాన్.

"అసలు సలికాలంలో కాంగెందుకు తుడవాల ?" తనలోనే అనుకున్నాడు కువో.

అందులో కిటుకు గ్రహించేందుకు ఆలోచించేడు చాలాసేపు, చివరికి "ఆ కాంగ్‌లో ఏటో వుండివుండాల. ఎల్లిసూద్దాంరాండి" అన్నాడు.

"నాను సూసేను" అన్నాడు ఓల్డుసన్.

"తవ్వి సూసేవా ?"

"నేదు"

"అయితే తవ్వుదాం పదండి. 'తు' మనుసుల్ని పక్కగదిలోకి పంపించేద్దాం."

కువో తోపాటు అందరూ 'తు' యింటికెళ్ళేరు, పలుగులు పారలతో సహా. వాళ్ళు వెళ్ళేసరికి ఇల్లు నిశ్శబ్దంగావుంది. కోడళ్ళ తగవు తీరిపోయినట్టుంది. జనం కూడా లేరు. 'గడకర్ర' లోపల గదిలో కాంగుమీద పండుకుంది. 'దుక్కముక్క' బైటగదిలో బిడ్డని జోకొడుతోంది. కువో 'దుక్కముక్క'ని పక్కగదిలోకి పంపేడు. తర్వాత ఓ ఇనపవూచతో కాంగ్ మీదకొట్టేడు. ఓ చోట ఇటిక దగ్గర బోలచప్పుడు వినిపించింది. ఆ ఇటికలాగితే లోపల చిన్న రేకుపెట్టె కనిపించింది. అందులో రెండు బంగారు వుంగరాలు, బంగారురేకు, ఓ బంగారు తలపిన్ను వున్నాయి. వాటి కింద చిన్నచిన్న అక్షరాలతో రాసిన రెండు కాగితాలు, మంచుకో ప్రభుత్వం భూ౯ి కోసం ఇచ్చిన ఓ పత్రింవున్నాయి.

కువో వైద్యుడిని పిలిపించేడు. అతనుష.శ్కీ ఏ లెక్కలకోసమో పిలిపించే రనుకుని లెక్కల బల్లతో ఒచ్చేడు.

"నల్లమూ(వా! కొంగు మీదకొచ్చి యీ కాయితాలు సదువుమీ." అన్నాడు కువో. వైద్యుడు కళ్ళజోడు పెట్టుకుని ఓ కాయితం చదవసాగేడు.

"1946లో సియావో సియాంగ్ అనే ఎర్రబందిపోటు, అతని ముఠాకలిసి నా వంద ఎకరాలు బలవంతంగా లాక్కున్నారు. దాన్ని చాలామంది పంచుకున్నారు. వాళ్ళపేర్లు- లీచాంగ్-యు, చూవూ - లిన్ (చూ), తీన్ వాన్ - షున్ (తీన్ తాత), చాంగ్ చింగ్ - సియాంగ్, సన్ యంగ్ - వు (ఓల్డుసన్)......."

ఆనకట్ట తెంచుకున్న వరదలా జనం ఒక్కసారి అరిచేరు. ఓల్డుసన్ మరీ గట్టిగా అరిచేడు;

"అది నల్లలిస్టు. ఓరి దొంగనాయాల, నాపేరెట్టేసినావురా? నీకెన్ని దమ్ము(లా!"

కువో కోపంతో కుతకుతవుడికి పోటున్నాడు. అతనికి మాటపెగలడంలేదు. అతని ముఖం ఎరుపెక్కింది, మెడనరాలు వుబ్బేయి.

"సియావో బాబుని ఎ(రబందిపోటంతాడా?" అని గొణిగేడు తీన్ తాత.

"అలాకాక యింకెలాగంతాడా దొంగనాయాల! ఒపానోల్లతో మంతనాలాడి గెరిల్లాల కెతిరేకంగా కమాండరయేడు. ఆడెప్పుడూ ఓ ఎ(రబందిపోటు గురించి సెప్పేవోడు. అదేటో నాకు తెలిసేదికాదు. నిరుడు సియావో బాబే సెప్పినాడు, గెరిల్లా నాయకుడు చావోషాంగ్-చీని అలా అంటారని" అన్నాడు ఓల్డుసన్.

ఇంతలో 'చూ' లోపలికొస్తే ఓల్డుసన్ అతని కంతాచెప్పేడు. "పదండి, ఆడిమక్కెలిరిగదన్నాల" అన్నాడు చూ.

"ఆడిప్పుదేడున్నా" అనడిగేడు కువో

"కట్టెల కోసరం కొండమీద కెల్లేడు"

"ఆడినిప్పుడు అరెస్టు సెయ్యంగాని. తిరగనివ్వం. ఆడు మనకే ఎసరెట్టాలని సూత్తన్నాడు" అన్నాడు కువో.

"ఆడిని అవసరెస్టు కిందెట్టేయాల" అన్నాడు ఓల్డ్ సన్

"ఓల్డుసన్ సరిగే సెప్పేడు. బుగతలందరికీ ఓ గిరిగీసి, అది దాటకుండా సూడాల"

కొందరు అప్పుడే 'తు' కోసం బయల్దేరేరు. కాని కువో వాళ్ళని ఆపేడు. "ఆగండి, ఇంకో కాగితం వున్నాది. నల్లమాఁవా, ఇందులో ఏటున్నాది?"

వైద్యుడు చదివేడు:

"ఈ కిందరాసిన పేర్లు రైతుసంఘం ఆఫీసర్లవి. వీళ్ళని కమ్యూనిస్టులు నియమించేరు: చావో యూ-లీన్, కువో చువాన్-హై, లీ చాంగ్-యు, పాయి యు-షాన్, చాంగ్ చింగ్-సియాంగ్...." వరసనే చాలా పేర్లున్నాయి. గ్రూపు లీడర్ల పేర్లుకూడా వున్నాయి. తర్వాత 'తు' సొమ్ము పంచుకున్న రైతులపేర్లు, వాళ్ళు పంచుకున్న వస్తువుల వివరాలు కూడా వున్నాయి.

ఆడవాళ్ళు రెచ్చిపోయి 'తు'ని తిట్టేరు.

"కాఁవందు యిలాంటోడవా?"

"అది నవ్వుమొగం ఎనకాల ఎంత ఇసం!"

"ఈడు కందిరీగ!"

"కాదు, తిరగలి! అడుగెట్టిన సోట మనుసుల్ని కరకర నలిపేత్తాడు"

"సెంట్రల్ ఆర్మీఒచ్చి మన పీకలు తెగ్గొయ్యాలని ఈ లిస్టురాసేడు"

"ఆ సెంట్రల్ ఆర్మీ మరిరాదు. మన కామ్రేడ్స్ తుపాకు లొట్టుకోని చాంగ్ చన్ కాడ దాన్ని దుంపనాసినం సేత్తండారు"

వైద్యుడు లిస్టంతా చదివేక ఓల్డ్ సన్ నెమ్మదిగా అతని పక్కనచేరి గుసగుసలాడేడు.

"బాబూ, రైతుసంగం ఆపీసర్ల లిస్టులో నాపేరు కూడా వున్నాదేటో ఓ సుట్టు సూడుమీ"

"లేదుగాని, నీకు, మరోముగ్గురికి కలిపి ఓ గుర్రం యిచ్చేరటకదా, అది రాసున్నాది"

"అవును, నాకాగుర్రం పంచేరు. కానీ నాను ఆపీసర్ల లిస్టులో లేకపోటఁవేవి! నానే కదా సియావో బాబుని ఈ వూరు తోలుకొచ్చేను. ఆ బాబు ఈ వూరొచ్చేకే నాను మనిసినయేను"

వైద్యుడు కళ్ళజోడుతీసి, "సరే, 'తు' నిన్ను మర్సిపోనాడు నాను నీ పేరు రాసేద్దునా?" అన్నాడు.

కువో చాంగ్ చింగ్-షీని పక్కకి పిలిచి ఓ సైడ్జిలో పత్రాలు, రెండు లిస్టులు తీసుకుని సొంచియా వెళ్ళమన్నాడు. వెళ్ళి 'తు'ని ఏంచెయ్యమంటాడో సియావోని అడగమన్నాడు.

కొద్దిగంటల్లోనే సియావో ఇచ్చిన ఆదేశాలతో తిరిగొచ్చేడు చాంగ్- పేద రైతుల్ని, కండార్లని, మధ్యతరగతి రైతుల్ని పిలిచి మీటింగుపెట్టి, లిస్టులు చదివి వినిపించి వాళ్ళెలా చెప్తే అలా చెయ్యమన్నాడు. సంఘం ఆఫీసర్లు మాత్రం 'తు'ని ఎవరూ కొట్టకుండా చూడాలి. బుగతలు 'నల్లలిస్టులు' రాసిపెట్టేరంటే వాళ్ళ తుపాకులు కూడా దాచివుండాలి. వాటిని స్వాధీనం చేసుకొమ్మని చెప్పిపంపేడు సియావో.

మీటింగు అర్ధరాత్రివరకు సాగింది. అందరికీ కసిరేగింది. ఆరోనంబరు హాన్ మీదవున్నంత కోపం 'తు' మీద కూడా రేగింది. 'తు'ని ఇంట్లోంచి తోలేసి గుర్రిపుసాలలో వుంచాలన్నాడు చూ. "అక్కడ కూడ లిస్టు తయారుసేత్తాడేఁవో సూడాల."

"బుగతలందరినీ తరిఁవెయ్యాల" అన్నాడు చాంగ్ చింగ్-షీ.

"అంతా ఒప్పుకుంతారా?" లేచి నించుంటూ అడిగేడు కువో.

అందరూ ఒప్పుకుంటున్నట్టు చప్పట్లు కొట్టేరు. 'తు'ని తరిమెయ్యడానికి కొందరు బయల్దేరేరు కూడా. కువో వాళ్ళనాపి "'తు' మనమీద లిస్టులు రాసేడు. అలాగే తుపాకులు కూడా దాసిపెట్టుండాల. ఆడు ముటానాయకుడుగా వుండగా బందిపోటు దొంగలతో లాలూసీ పడీవోడు. మన సైన్యానికి* ఎతిరేక సైన్యంతో ఆడు సెయ్యి కలిపేడు. ఆడికాడ తుపాకులున్నాయానేదా? మీరేటంతారు?" అనడిగేడు.

"తుపాకులుండీవి" అన్నారందరూ.

"ఉండబట్టేకదా తుపాకి బురుజులు కట్టించేడింటికి"

"ఆడు ఇవ్వకపోతే ఏటిసేద్దాం?"

"ఏటిసేద్దాఁవాఁ? బాదీడఁవేఁ"

"ఆడి గుడ్లు పీకండి. అప్పుడు గురిసూడ్నేదు."

కువో నవ్వుతూ నోట్లోంచి పైపుతీసి "నేదు. కొట్టడం సైర్మన్ మావో పద్ధతికాదు. 'తు' కాడ నిజంగా తుపాకులున్నాయా నేదా?" అనడిగేడు.

"జపానోల్లు లొంగిపోయేక లీ సో-ఫీ బందిపోటు, హాన్ పెద్దకొడుకు, 'తు' సిన్నకొడుకు ఇక్కడికొచ్చేరు. 'తు' ఇంట్లో నా సెవులార తుపాకి మోత యిన్నా" నన్నాడు ఓల్డ్‌సన్.

"సరే, అయితే మనం అంతా సమంగా కనుక్కోని మీటింగెట్టి అడిసేతే అంతా సెప్పించాల" అన్నాడు కువో.

*Anti-Japanese Amalgamated Armies.

(ఇంకా వున్నది)

కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కరణోద్యమం - స్త్రీ సమస్యలు - ఒక పరిశీలన

డా॥ వి. రామకృష్ణ

పంధొమ్మిదో శతాబ్దపు రెండో భాగంలో భారతదేశమంతటా సంస్కరణోద్యమాలు కొనసాగాయి. ప్రధానంగా ఈ ఉద్యమాలు మత, సంఘ సంస్కరణలకు ఉద్దేశించబడ్డాయి. బ్రిటిషువారి పరిపాలనలో ప్రవేశపెట్టిన అనేక ఆర్థిక సంస్కరణలవల్ల, భారతీయ సమాజంలో మౌలికమైన మార్పులు రాసాగాయి. భూమి శిస్తు విధానాలవల్ల - శాశ్వత, రైత్వారీ వగైరా. భూమిపై సొంతహక్కు ఏర్పడ్డం, ఇంగ్లండ్‌లో ప్రారంభించబడి, పెంపొందిన పారిశ్రామిక విప్లవ ప్రభావం మూలంగా, భారతదేశంలోని గ్రామీణ పరిశ్రమలు దెబ్బతిని, ఈ దేశం కేవలం ముడిసరుకులు అందించే వలసగా మారడం, రైల్వేలు, తంతితపాలా సౌకర్యాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజల వలస, ప్రభుత్వపాలనానిర్వహణకోసం ఏర్పడ్డ అనేక కార్యాలయాలు - వీటివల్ల చిన్నచిన్న పట్టణాలు, నగరాలు ఏర్పడ్డాయి. దేశమంతా ఒకే మార్కెట్‌గా రూపొందింది, అన్ని ప్రాంతాల మధ్య రాకపోకలు, వర్తకవ్యాపారాలు ప్రారంభమయ్యాయి. దీనికి తోడు బ్రిటిషు పరిపాలకులు వారి స్వప్రయోజనాల కొరకు ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టారు. విస్తరిస్తున్న వారి సామ్రాజ్యానికి సరిపడగా దొరికే ప్రభుత్వ యంత్రాంగం కావల్సివచ్చింది. అంతే కాక 'వెనుకబడిన', 'అనాగరికమైన' భారతీయ సమాజాన్ని ఆంగ్ల విద్య ద్వారా సంస్కరించి, పెంపొందిస్తే, అలాంటి సమాజం తమ పారిశ్రామిక సరుకుల వినిమయానికి అనువుగా ఉంటుందన్న ఆలోచన కూడ వీరికుంది. ఈ నాగరికతా వ్యాప్తి విధానంలో భాగంగానే క్రైస్తవ మిషనరీలు కూడ భారతదేశంలోకి స్వేచ్ఛగా వచ్చేట్టు 1813లో అనుమతి లభించింది. ఏమయితేనేం, వీటన్నిటి మూలంగా, భారతీయ సమాజ చట్రంలో కొన్ని మౌలికమైన మార్పులు రావడం, కారల్ మార్క్స్ తన పరిశీలన ద్వారా నిగ్గు తేల్చి చెప్పిన "సాంఘిక విప్లవం" భారతదేశంలో 19వ శతాబ్దంలో బ్రిటిషువారి ద్వారా సాధించబడింది. ఇది కారల్ మార్క్స్ దృష్టిలో నిస్సందేహంగా బ్రిటిషువారు నిర్వర్తించిన అభ్యుదయకరమైన పాత్ర. నూతన సమాజం - భూస్వామ్య విధానం నుండి పెట్టుబడిదారీ సమాజం వైపు - ఏర్పడ్డాకనే మార్పులు వచ్చి, భారతీయ సమాజంలో ఉంటూ వచ్చిన స్తబ్దత తొలగిపోయి మరో ముఖ్యమైన చారిత్రిక దశలోకి సమాజం అడుగు పెడ్తుందని కారల్ మార్క్స్ ఆశించాడు.

పై మార్పులు, భారతదేశంలోని సంస్కరణోద్యమాలకు కావల్సిన భౌతిక పునాదిని ఏర్పరిచాయి. భావపునాది ఆంగ్ల విద్యా ప్రభావం వల్ల కలిగిన పాశ్చాత్య సిద్ధాంతాల వల్ల కొంతవరకు వచ్చిందని చెప్పవచ్చు. ఈ నూతన భావావేశాన్ని, ఆంగ్ల విద్య, లేక పాశ్చాత్య భావ ప్రభావం వల్ల మన సమాజంలో అప్పుడే తలెత్తుతున్న మధ్యతరగతి విద్యాధిక వర్గం తమ సొంతం చేసుకొని సంస్కరణలకు నాంది పలికారని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఇది కొంతవరకు మాత్రమే నిజం. ఆంగ్ల విద్యా ప్రభావమే లేకుంటే సమాజం మారి ఉండేది కాదన్న ఒక ప్రమాదకరమైన సిద్ధాంతానికి ఇది దారితీస్తుంది. ఎందుకంటే భారతీయ సమాజంలో అనేక శతాబ్దాలుగా మతంపేరిట, ఆచారంపేరిట ఎన్నో మూఢాచారాలు, కులకట్టుబాట్లు, సాంఘిక దుస్సాంప్రదాయాలు ప్రవేశించాయి. వీటిని ఎప్పటి కప్పుడు, పరిమితంగానైనా కొన్ని సంస్కరణభావాలు, ధోరణులు, ఉద్యమాలు ఎదుర్కొంటూ వచ్చాయి. మధ్య యుగాల కాలంలో దేశంలో అనేక ప్రాంతాలలో ఈ ఉద్యమాలు– కబీర్, రామదాస్, నానక్, తుకారాం, ఆంధ్రలో వేమన– వచ్చాయి. అయితే ఇవి హిందూ మతపు పట్టును సడలించలేకపోయాయి. అయినా మన జాతిజీవనంలో తిరుగుబాటు ధోరణికి, సంస్కరణా సాంప్రదాయానికి ఇవి చిహ్నాలు. వీటిని దృష్టిలో ఉంచుకొన్నపుడు, 19వ శతాబ్దంలో సాగిన సంస్కరణోద్యమాలు నూతన పరిస్థితుల వల్ల వచ్చినా, పూర్తిగా కొత్తవికాదు అన్నవిషయం స్పష్టమవుతుంది.

మతం, సమాజం– ఈ రెండూ మన జాతి జీవితంలో విడదీయరానంతగా పెనవేసుకపోయాయి. అందుకనే పందొమ్మిదో శతాబ్దపు సంస్కర్తలు సంఘ సంస్కరణకు అనువుగా, నాందిగా, మత సంస్కరణను తలపెట్టారు. ఇది సరియైన పద్ధతి కూడ. మతంపేరిట చలామణి అవుతున్న అనేక సాంఘిక చెడుగుల్ని నిర్మూలిస్తే తప్ప సమాజ పురోగతి సాగదన్నది వీరి విశ్వాసం. సమాజంలో రావల్సిన మార్పులు ఆర్థిక పునాదిపై ప్రధానంగా ఆధారపడి ఉంటాయన్న స్పృహ వీరికి లేశమాత్రంగానైనా ఉంది. అయితే ఈ దృష్టి వారిని ప్రధానంగా ఆకర్షించలేదు. ఈ ఉద్యమాల బలహీనతలలో ఇదొకటి. అందుకనే వీరు సాగించిన ఉద్యమాలు భావరీత్యా ఎంతో ప్రాధాన్యాన్ని వహించినా, అనేక పరిమితులకు లోబడ్డాయి. ప్రస్తుతం మత సంస్కరణోద్యమాల జోలికి పోకుండా, అన్ని సంఘ సంస్కరణల గూర్చి కూడ విచారించకుండా కేవలం స్త్రీ సమస్యల ఎడల వీరు సాగించిన ఉద్యమాన్ని మౌలికంగా పరిశీలిద్దాం.

దేశం మొత్తం మీద సంస్కర్తలను, ఈ కాలంలో ఎక్కువగా వేధించిన సమస్య, స్త్రీ సమస్య. వారి కార్యక్రమంలో ఇది అగ్రగామిగా నిలిచింది. యుగాలుగా భారతదేశంలో స్త్రీ దయనీయమైన పరిస్థితికి దిగజారిపోయింది. అన్ని విధాల అన్యాయాలకు బలిఐంది. సాంఘికంగా ముఖ్యంగా సంపన్న మధ్యతరగతి వర్గాలకు చెందిన స్త్రీలు, సతి, బహుభార్యాత్వం, వివాహానికి సంబంధించి, బాల్య, కన్యాశుల్క వివాహాలు, వితంతు వివాహ నిషేధం ఇలాగా ఎన్నో అక్రమాలకు గురయ్యారు. శ్రామిక వర్గాలకు చెందిన స్త్రీలకు ఈ సమస్యలు అంతగా వర్తించకపోయినా, మొత్తం మీద స్త్రీ పరాధీనత సమాజంలో అందరికీ వర్తించింది. ఆర్థిక స్వాతంత్ర్య ప్రసక్తే లేదు. ఆస్తి హక్కు, సంపన్న వర్గాలలో లేకపోగా, అందులోని స్త్రీలు, శ్రామిక వర్గాలలోని స్త్రీలు అనుభవించే స్వాతంత్ర్యం గూడలేక 'బానిసలు'గా ఉండిపోయారు. ఈ సమస్యలన్నిటిపై వేర్వేరు ఉద్యమాలను సంస్కర్తలు సాగించినా వారి దృష్టి ముఖ్యంగా ముందు స్త్రీ విద్యపై నిలిచింది. ఈ విభిన్న ఉద్యమాలకు చెందిన వివరాల ప్రసక్తి ఈ వ్యాస ఉద్దేశంకాదు. వాటిని వివరించడం కూడ ప్రస్తుతం సాధ్యం కాదుకూడ. అయితే వీటి పూర్వరంగమైన భావప్రేరణ ఉత్తేజాలను పరిశీలించాలి.

ఏ సమాజం అభివృద్ధి చెందడానికైనా విద్య, విద్యతో పాటు విజ్ఞానం అవసర మన్నది వీరి సిద్ధాంతం. ఈ విద్యావ్యాప్తి సమాజంలో సగభాగమైన స్త్రీ లోకానికి చెందకపోతే ఆ సమాజం మారదు, విద్యావ్యాప్తి అన్నిరకాల సాంఘిక లోటుపాట్లకు విరుగుడన్నది వీరిమతం కాగా, స్త్రీవిద్య స్త్రీ సమస్యల పరిష్కారానికి అతిముఖ్య మన్నది వీరిధ్యేయం. మనిషిలోని అజ్ఞానాన్ని తొలగించి, మంచి చెడుల విచక్షణా జ్ఞానాన్ని కలిగించి, ఆలోచింపచేసి విద్య సంపూర్ణ మానవుణ్ణి సృష్టిస్తుందని వీరు విశ్వసించారు. ఆంధ్రదేశంలో, కందుకూరి వీరేశలింగానికి పూర్వమే ఈ గుర్తింపు కొందరిలో ఉండింది. ప్రధానంగా, సామినేని ముద్దునరసింహ నాయుడు, ఏనుగుల వీరాస్వామయ్య, వేదాంతాచారి మొదలగువారి రచనలలో స్త్రీ విద్యతో పాటు, వాటికి సంబంధించిన అనేక ఇతర సమస్యల ప్రస్తావనగూడ ఉంది. ఈ భావాలు కేవలం వీరిలో చాలవరకు వ్యక్తి పరంగానే ఉండిపోయాయి. వీటిని వీరేశలింగం పెంపొం దించి, అనేక కొత్తవిషయాలతో, సిద్ధాంతాలతో జోడించి, ప్రచారంచేసి, వేదికల నేర్పాటుచేసి, ఉద్యమాలు నిర్మించి, ఆచరణలో పెట్టడానికి ప్రయత్నంచేశాడు. ఇదే ఆయనలోని ప్రత్యేకత, ఘనత.

కేవలం భావాలు, వాటివ్యాప్తి సమాజంలో మార్పులు కొనిరాలేవు, వాటిని జీవప్రదంచేసి ఉద్యమ రూపంలో పెట్టాలి. అప్పుడే వాటి సార్థకత. ఈ విషయాన్ని వీరేశలింగం గుర్తించినంతగా ఆకాలంలో మరెవరూ గుర్తించలేదు. తన ఉద్యమాలకు పూర్వరంగంగా భావప్రచారాన్ని సాగించాడు. సాంఘిక సమస్యలపై, ప్రత్యేకించి స్త్రీ సమస్యపై ప్రజాదృష్టి దాదాపు లేదనే చెప్పాలి. సాంఘిక సంస్కరణోద్యమాలలో ఈలోటు ప్రస్ఫుటంగా మనకు కన్పిస్తుంది. ప్రచారంచేసి, ప్రజల దృష్టిని వీటిపై ప్రసరింపచేసి, ఒక సిద్ధాంత పునాదిని ఏర్పరచి అప్పుడు ఉద్యమాలు నిర్మించాలన్న ధ్యేయం ఒక మలబారీ (పార్శీ సంస్కర్త, బొంబాయి)కి మినహా మరెవరికీ ఉన్నట్టు కన్పించదు. వీరేశలింగం దక్షిణాది సంస్కర్తలలో ఈ విషయంలో అగ్రగామిగా నిలిచాడు. తన ఉద్యమాలకు సిద్ధాంతపునాదిని ఏర్పరచడానికి, ఆరోగ్యవంతమైన, పటిష్ఠమైన అనుకూలవాతావరణాన్ని ప్రజల్లో కలిగించడానికి ప్రయత్నం చేశాడు. స్త్రీకి సంబంధించి అనేక సమస్యలపై ఆనాటి హేమా హేమీలనదగ్గ కొక్కొండ వెంకటరత్నం పంతులు వంటి వారిలో తలపడ్డాడు. సమాజంలో పేరుకుపోయిన లొసుగుల్ని తొలగించాలనుకోడం, వాటికోసం ప్రయత్నం చేయడం- వీటి ఎడల సానుభూతి, సహాయం లభించని రోజులు అవి. తన భావాలను ప్రచారం చేసుకోడానికి సాధనం కావాలి. 'పురుషార్థ ప్రదాయిని'లో కొన్ని ప్రకటిత మవుతున్నా, అది చాలదు. అందుకే, శక్తివంతమైన ప్రచారంకోసం "వివేకవర్ధని" ఆరంభించాడు. పత్రికా నిర్వహణ భారం యావత్తూ తనదే! అన్ని పనులు తనే చేసుకోవాలి. ఒక వైపు ఈ పూర్వరంగాన్ని ఏర్పచుకొంటూ, భావప్రచారం గావిస్తూ, 'బ్రాహ్మ వివాహం' లాంటి ప్రహసనాలు రచిస్తూ, ఈ భావవ్యాప్తిని మరింత ముందుకు తీసుకెళ్ళాడు. స్థానికంగా ఉన్న విద్యార్థులను తన ఉద్యమాలకు ఆసరాగా ఉండేట్లు వారిని ఉత్తేజపరిచాడు. బెంగాల్‌లో 'యువ బెంగాల్' (Young Bengal) ఉద్యమం ఒక్కటే ఇంత గొప్పగా విద్యార్థులను ప్రభావితం చేసి ఉద్యమాల్లోకి తీసుకవచ్చింది. యువతరం ప్రాముఖ్యాన్ని గుర్తించి, ఆదర్శాల పట్ల వారికున్న ఆసక్తిని ఇనుమడింపచేసి తన ఉద్యమాలకు వారి విశేష సహాయ సహకారాలను వీరేశలింగం పొందాడు. ఆయన ఉద్యమాలకు అనుభవంలేని విద్యార్థులే అండ అనే విమర్శకు సూటిగా సమాధానం చెపుతూ, భవిష్యత్తు వారిదేనని, పాతభావాలకు కొత్తభావాలకు ఘర్షణఉన్నట్లే, కాలం చెల్లిపోయిన వృద్ధతరానికి యువతరానికి జరిగే పోటీలో యువకులు, వారి భావజాలం విజయం సాధిస్తుందని ప్రకటించాడు. బాలికలకు ప్రత్యేక పాఠశాలను తానుగా ప్రారంభించడం అటుంచి, వారి విద్యాబుద్ధులకు అనువైన పాఠ్యగ్రంథాలను

తయారుచేయాలన్న సంకల్పంతో, ఈ మార్గంలో మొదటిసారిగా రచనలు చేశాడు. స్త్రీ జీవితంలో అనేక సమస్యలగూర్చి సంస్కరణ గ్రంథాలు తయారుచేశాడు. స్త్రీల కోసం ప్రత్యేక పత్రిక నొకదానిని, 'సతీహితబోధిని' ప్రారంభించాడు.

వీరేశలింగం ఆరంభించిన ఈ విద్యా వ్యాప్తి ఉద్యమం వెంటనే వ్యాప్తి చెందడం జరిగింది. అనేక మంది స్త్రీలు ఈ ఉద్యమం ద్వారా ఉత్తేజితమై స్త్రీల కోసం ప్రత్యేక రచనలు చేశారు. స్త్రీల కోసం ప్రత్యేకించి దాదాపు పదికిపైగా పత్రికలు వెలువడ్డాయి. బాల్యవివాహాలు, కన్యాశుల్క వివాహాలు, వితంతు వివాహ సమస్య, వేశ్యా సమస్య - వీటి గూర్చి వివరిస్తూ ఎన్నోచిన్నచిన్న గ్రంథాలు ప్రకటించారు. పట్టణాలలోనే గాక, మారుమూల గ్రామాల్లో సైతం - ముఖ్యంగా గోదావరి, కృష్ణా, విశాఖపట్నం జిల్లాల్లో - స్త్రీ సమాజాలు మొదలయ్యాయి. వీటికి అనుబంధంగా గ్రంథాలయాలు, సభలు, స్త్రీ సమస్యలపై చర్చలు జరపడం వీటి కార్యక్రమాల్లో భాగంగా తయారయింది. సంఘ సంస్కరణ సభలతోపాటు జిల్లా స్థాయిలో, తర్వాత అఖిలాంధ్ర మహిళా సభలు జరిగాయి. విస్తృతమైన ఈ సభల్లో స్త్రీలు మొదటిసారిగా పాల్గొనడం జరిగింది. ఉపన్యాసాలు, చర్చలు, సేవా కార్యక్రమాలు, వితంతు వివాహాల్లో చురుకుగా చొరవచేసుకోవడం జరిగింది. ఈ చైతన్యం, సంరంభం గూర్చి ఆనాటి 'హిందూ' పత్రిక, 'కృష్ణా పత్రిక' 'ఆంధ్రపత్రిక' వార్తలు ప్రచురించి, ఆంధ్రదేశంలో 'సాంఘిక విప్లవం' లాంటిది ఒకటి వస్తోందని ప్రకటించాయి. ఈ ఉద్యమకాలంలో వచ్చిన ముఖ్య పత్రికలు ఉదాహరణకు 'సావిత్రి', 'హిందూ సుందరి', 'జనానా', 'కామేశ్వరి', 'చింతామణి' మొదలగునవి. చురుగ్గా పాల్గొని ఈ కార్యక్రమాలను సాగించిన స్త్రీలలో పేర్కొన దగ్గవారు పులుగుర్త లక్ష్మీనరసమాంబ, కొటికలపూడి సీతమ్మ, భండారు అచ్చమాంబ మొదలగువారు. వీరు సాగించిన కార్యక్రమాల్లో స్త్రీలచే నడపబడే బాలికా పాఠశాలలే గాక, స్త్రీలకు ఉపయోగపడే అనేక వృత్తి విద్యలను కూడ నేర్పడం ప్రారంభమైంది. ఈ సమాజాలు నిర్వర్తించిన పాత్రలో గమనించదగింది, స్త్రీలలో శాస్త్రీయ తార్కిక దృష్టిని పెంపొందించడం; ఉపన్యాసాలు, గ్రంథాలు ఈ ధ్యేయానికి అనుగుణంగా ఉండేట్లు చూడడం. స్త్రీ విద్యా వ్యాప్తి సంఖ్యాపరంగా చూస్తే 1881లో బాలికా పాఠశాలలు 67, చదువుకునే బాలికల సంఖ్య 2,569 ఉంటే, 1908లో ఇది 329 పాఠశాలలకు 17,091 బాలికలకు పెరిగింది.

ఆనాటి సామాజిక పరిస్థితుల్లో ఎన్నో కష్టాలను అధిగమించి అనేక వితంతు వివాహాలను జరిపించడం అటుంచి (సంఖ్యలో బెంగాల్‌లో ఈశ్వరచంద్ర

విద్యాసాగర్ కంటె ఎక్కువ వివాహాలు జరిపించాడు) వివాహాలు చేసుకున్న వారి జీవనం కొరకు నెలసరి ఆదాయాలు, వారికి ఇండ్లు, వీలున్నచోట ఉద్యోగ వసతి కల్పించాడు. వితంతు శరణాలయాన్ని ఏర్పరచి అందులో వారికి అవసరమైన విద్యాబుద్ధులు గరిపాడు. పతితలైన స్త్రీల కోసం ప్రత్యేకంగా ఒక శరణాలయాన్ని ఏర్పరచడం వీరేశలింగం కార్యక్రమాలో ప్రత్యేకించి చెప్పుకోదగింది. ఉపాధ్యాయ వృత్తి కూడ మానేసి తన గ్రంథాల ద్వారా వచ్చే ఆదాయంతో, ఉదారులైన దాతల విరాళాల ద్వారా తాను ఒక్కడుగా ఈ కార్యక్రమాలను నిర్వహించడంలో ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కోవలసివచ్చింది. రాజమండ్రిలో 'హితకారిణీ సమాజం' స్థాపించి, ఒక 'ట్రస్టు' ఏర్పాటుచేసి ఆయన ఏర్పాటుచేసిన శరణాలయాలు, పాఠశాలలు, ఉద్యమాల నిర్వహణకు గాను తన ఆస్తి (41 వేలు) సంతా ధారవోశాడు. ఈ ఉద్యమకాలంలోనే ఉన్నవదంపతులు గుంటూరులో వితంతు శరణాలయాన్ని ఒకదానిని ఏర్పాటుచేశారు. ఇదే తర్వాత 'శారదా నికేతన్' గా ప్రాముఖ్యం పొంది బాలికల ఉన్నత పాఠశాల కూడా జతపరచబడింది.

వీరేశలింగం నడిపిన ఉద్యమాలకు చేయూతనిచ్చి అన్ని విధాల సహకరించిన ఆయన సతీమణి రాజ్యలక్ష్మమ్మ స్త్రీలోకానికి గొప్ప ఉదాహరణ. సాంప్రదాయిక కుటుంబంలో పుట్టి, పెరిగినా వీరేశలింగం ఆమెకు కావల్సిన విద్యాబుద్ధులు నేర్పి తాను చేపట్టిన సాంఘిక కార్యక్రమాల సిద్ధాంతాలను ఆమెకు బోధించి ఒప్పించి తనతో పాటు అన్ని ఉద్యమాల్లో పాల్గొనేట్లు చేశాడు. వితంతు వివాహాల నిర్వహణలో శరణాలయం నడపడం, అందులోని స్త్రీల బాగోగులు చూడడం, పాఠశాలా నిర్వహణలో ఆమె తన కాలాన్నంతా వినియోగించింది.

వీరేశలింగం నడిపిన సంస్కరణోద్యమాలు ఇరవయ్యో శతాబ్దం మొదటి రెండు దశాబ్దాలు అంతమయేసరికి బలహీనపడ్డాయి. ప్రధాన కారణం జాతీయోద్యమం విజృంభించి ఇతర అనేకానేక ఉద్యమాలను తనలో ఇముడ్చుకోడం. జాతి స్వాతంత్ర్యం ముందు ముఖ్యం. తర్వాత అన్ని సమస్యలను పరిష్కరించుకోడానికి దోహద పడ్తుంది అన్నది ప్రధానాంశమైంది.

స్త్రీ సమస్యలపై జరిగిన ఈ ఉద్యమాలు పరిమిత పరిధిలో సాగాయి. ప్రధానంగా మధ్యతరగతి, అంతకంటె కొద్ది తక్కువ వర్గాలకే ఇవి చెందాయి. ఎందుకంటె వారుచేపట్టిన సమస్యలు ఈ వర్గాలకే సంబంధించినవి. అందువల్ల సమాజం యావత్తూ ఈ ఉద్యమాల్లో ప్రతిఫలించలేదు. ఆనాటి పరిస్థితుల్లో ఇది సహజంకూడ.

ఎందుకంటే ఈ సంస్కర్తలు ఆ వర్గాలనుండి వచ్చినవారు. వారి సామాజిక స్పృహ అంతవరకే పరిమితమైంది. సమాజంలోని ప్రాథమిక సమస్యలజోలికి వీరు పోలేదు. ఉదాహరణకు, స్త్రీ సమస్యల కోసం ఇంతగా పోరాడిన వీరు స్త్రీకి ఆస్తిహక్కు ఉండాలని కోరనేలేదు. ఆర్థిక స్వాతంత్య్రం ఉండాలని గుర్తించినా, అది సాధింపబడే మార్గాన్ని సంకుచితంగా పరిశీలించారు. అలాగే, వేశ్యా సమస్యను సరిగ్గా విశ్లేషించి, దాని నిర్మూలనకు ఉద్యమాలు నిర్మించినా, సరియైన పరిష్కార మార్గాలు చూపడంలో (వేశ్యా వృత్తిమానేసిన తర్వాత వారి భవిష్యత్తు ఏమిటి అన్న సమస్యపై) విఫలమైనారు. విద్యావ్యాప్తిజరిగి, స్త్రీలు చైతన్యవంతులైతే వారి సకల సమస్యలు పరిష్కారం అవుతాయాన్న 'భ్రమ'లో ఉండిపోయారు. ఇలాంటి 'పొరబాటు అవగాహన' ఆనాటి భారతదేశ చారిత్రక దశలో తప్పనిసరి ఐంది. భారతీయ సమాజం భూస్వామ్య వ్యవస్థ నుండి పెట్టుబడీదారీ దశకు మారుతున్న సంధి కాలమది. పెట్టుబడీదారీ సమాజం పూర్తిగా ఏర్పడకుండా మధ్యంతరంలో ఆగిపోవడంతో, ఈ ఉద్యమాలకు కావల్సిన ఊతం లభించలేదు. అందువల్ల సమాజ ఆధునికీకరణ (modernization) ఫలశ్రుతి పొందలేదు. వలసాధిపత్యంలో ఉన్న సమాజానికి ఇది సాధ్యంకాదు.

ఉదాహరణకు, మన జాతీయోద్యమంలో ముందు వచ్చిన 'మితవాదులు' వారి సిద్ధాంతాలు ఈ సందర్భంలో మనం గుర్తుంచుకొంటే, అప్పట్లో వారి అవగాహన నాటి చారిత్రక పరిస్థితులకు అనుగుణంగానే ఉంది. మితవాదులుగా ఉన్నంత మాత్రాన వారిని జాతీయ వాదులుగా, స్వాతంత్రోద్యమంలో ముఖ్యపాత్ర వహించిన వారిగా గుర్తించకుండా ఉండలేము.

ఇక, ఈ ఉద్యమాలు సాధించిన కొన్ని చెప్పుకోదగ్గ ఫలితాలున్నాయి. స్త్రీ సమస్యలను చిత్రించి, వాటిని సమాజ దృష్టికితెచ్చి, వాటి పరిష్కార మార్గంకోసం ఉద్యమాలు నిర్మించి, వీటిలో స్త్రీలను పాల్గొనేటట్లు చేసి, వారిలో ఉన్న జడత్వాన్ని (సమాజ క్రమంలో వారు పొందిన), అజ్ఞానాన్ని పారదోలడం. వారిలో శాస్త్రీయ, తార్కిక దృష్టిని పెంపొందించడం. స్త్రీలను ఉద్యమ కారులుగా తయారుచేయడం. తర్వాత రాబోయే భవిష్యత్ ఉద్యమాలలో వీరిని పాల్గొనేట్లు చేయడం. ఇది మనకు స్పష్టంగా జాతీయోద్యమ కాలంలో కన్పిస్తుంది. పరిమితంగానైనాసరే, ఈ నేపథ్యంలో, ఎందరో స్త్రీలు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. అలాగే ఆ తర్వాత కాలంలో వచ్చిన కమ్యూనిస్టు ఉద్యమంలో కూడ స్త్రీలు పాల్గొన్నారు. దీనికి ఒక

విధంగా ప్రాతిపదిక ఈ సంస్కరణోద్యమాలే అని చెప్పచ్చు. దీనికి తార్కాణం, కమ్యూనిస్టు ఉద్యమం, అప్పటికి విస్మరింపబడిన ఈ సంస్కర్తలను, వారి రచనలను, ఉద్యమ సంప్రదాయాలను పునరుజ్జీవింప చేసి, అసంపూర్తిగా ఉండిపోయిన సాంఘిక విప్లవాన్ని ఫలవంతం చేయాలనుకొంది. ఆవిధమైన భావ విప్లవం ద్వారా, వామపక్ష ఉద్యమాలు సమాజంలో బలమైన పునాదులు ఏర్పరచుకోడాన్ని ప్రయత్నించి కొంత వరకు సఫలం పొందాయి కూడ. అలాగే, ఆ తర్వాత బయలుదేరిన కులనిర్మూలనా, బ్రాహ్మణాధిక్య వ్యతిరేక, నిమ్నజాతి ఉద్ధరణ మొదలగు ఉద్యమాలు, ఎన్నో పరిమితులకు లోబడినా, కొన్ని సమయాల్లో వెర్రితలలు వేసినా, ఈ సంస్కరణోద్యమాల సాంప్రదాయాన్నే పాటించి, వీటికి పాయలుగా బయల్దేరినవనే స్థూలంగా చెప్పుకో వచ్చు. అయితే, నేటికీ స్త్రీ సమస్యలు – వాటి మౌలిక రూపంలో – అలాగే ఉండి పోయాయి. వీటి అంతిమ పరిష్కారం సోషలిస్టు సమాజంలోనే సాధ్యం అన్న విషయాన్ని మనం అంగీకరించినా, ఆ మార్గంవేపు పయనించడానికి, కొత్తరూపాలు ధరించి నేడు చలామణి అవుతున్న అనేక సమస్యలపై స్త్రీలను సమీకరించి ఉద్యమిస్తేనే తప్ప గమ్యంచేరుకోలేమన్న సత్యం గుర్తుంచుకోవాలి.

ఇక్కడిలాగే....?

బాటసారీ!
ఎక్కడి నుంచి వస్తున్నా విక్కడికి?
మీ దేశంలో
ఇక్కడిలాగే
అధికారం మేఘాలు సమయానుకూలంగా
వాగ్దానాల వానలు కురిపిస్తున్నాయా?
నిరుద్యోగం పంటలు
పుష్కలంగా పండుతున్నాయా?
వాటికి
యూనివర్సిటీ డిగ్రీల ఎరువుల్నే
వాడింది వాడకుండా వాడుతున్నారా?
అన్నట్టు....
ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీల
గోదాముల్లో నిండగా
మిగిలిన మీ పంటల్ని
గల్ఫ్ దేశాలకే గదా
ఎగుమతి చేస్తుంట!

– శంకర్

జీవులు, కాళ్లు రేపిన రోడ్డుదుమ్ము
పొలాల చెమటలో తడిపిన జనాల దరిద్రానికి
మన్ను పూస్తాయి–

– ఎ. ఎన్.

షకీలా మృతి రగిలించిన కీలలు :

'రాక్షస రతిలో భయంకర బాధల పాటల పల్లవి'

ప్రజల తీవ్రమైన ఆగ్రహావేశాలకు కారణమైన హైదరాబాదు రమీజాబీ సంఘటన జరిగిన ఒక సంవత్సరం న్నర లోపే మళ్ళీ అలాంటి సంఘటనకే హైదరాబాదుకు యాభై కిలోమీటర్ల దూరంలో వున్న భువనగిరి రంగం అయింది. షకీలా అనే స్త్రీని పోలీసులు చెరిచారనీ, చంపారనీ నమ్మిన ఐదువేలమంది ప్రజలు అక్టోబర్ పదిహేను రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌పై, షకీలా మృతి గురించి న్యాయ విచారణ కోరుతూ విరుచుకు పడ్డారు.

ఈ సంఘటనను విచారించడానికి అక్టోబర్ ఇరవైతొమ్మిదిన ఒక మహిళా బృందం హైదరాబాదు నుంచి భువనగిరికి వెళ్ళింది. ఈ బృందం అక్కడ వివిధ వ్యావృతులలో వున్న ప్రజలను కలిసి, వివరాలు సేకరించింది. వారి నుంచి సేకరించిన సమాచారం కింద ఇస్తున్నాం.

భువనగిరికి తొమ్మిది కి. మీ. దూరంలో వున్న యాత్రాస్థలం యాదగిరి గుట్టలో ఇరవైనాలుగేళ్ళ యువతి షకీలా తన భర్తతో నివసిస్తూ వుండేది. సెప్టెంబర్ ఎనిమిదిన పోలీసులు హెన్రీ (షకీలాభర్త)ని జేబుదొంగ అనే అభియోగంపై నిర్బంధించి భువనగిరి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ ఆయనపై నేరం మోపబడి, దోషిగా నిర్ధారించబడినాడు. కోర్టు ఆయనకు నెలరోజుల సాధారణ జైలుశిక్ష లేక వందరూపాయల జుర్మానా విధించింది. ఈ జుర్మానాను పోలీసులే చెల్లించినట్లు తెలుస్తున్నది. ఇంకా ప్రశ్నించ వలసి వున్నదనే నెపంమీద ఆయన విడుదల ఐనవెంటనే పోలీసులు నిర్బంధించారు.

పోలీసులు సెప్టెంబర్ 22న షకీలాను భువనగిరికి తీసుకొచ్చారనీ, పోలీస్ స్టేషన్ వెనకవైపు వరండాలో వారం రోజులు ఉంచారనీ తెలుస్తున్నది. ఈ వారం రోజుల్లో పోలీస్ స్టేషన్‌కు వెళ్ళిన చాలామంది ఆమెను చూసినట్టు చెపుతున్నారు. దీనితో ఆమెను ప్రజల దృష్టినుంచి తప్పించడానికై పోలీస్ స్టేషన్ నుంచి పంపేయాలని పోలీసులు నిర్ణయించుకున్నారు. స్థానిక ధర్మశాలకు ఆమె వెంట కొందరు కానిస్టేబుళ్ళు వెళ్ళారని తెలుస్తున్నది. అక్కడ గదులేమీ ఖాళీలేవు. పదోనంబరు గదిలోవున్న సురేష్ అనే వ్యక్తిపై ఏవో అభియోగాలు మోపి ఆయనను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారని తెలుస్తున్నది. ఆ గది ఖాళీ అయింతర్వాత సురేష్ చెల్లించవలసిన బాకీలన్నీ చెల్లించి ఆ గదిని షకీలా కప్పించారు. ఈ దశలో, హిందు

వులు కాని వారికి గదులు ఇవ్వడం తమ నిబంధనలకు వ్యతిరేకమని ధర్మశాల మేనేజర్ అభ్యంతరం తెలిపాడు. మేనేజర్ చెప్తున్న ప్రకారం ఎస్. కృష్ణారెడ్డి అనే వ్యక్తిని షకీలాకు (హిందూ) భర్తగా సృష్టించి పోలీసులు ఈ సమస్యను పరిష్కరించారు. ఈ గదిలో షకీలా సెప్టెంబర్ ఇరవైతొమ్మిదిన ప్రవేశించింది. ఆమె చాలా నెమ్మదైన, మంచి యువతి అనీ, రోజూ సాయంత్రం ఐదు గంటలకు టిఫిన్ క్యారియర్ పట్టుకొని బయటకుపోయేదని, మళ్ళీ ఉదయమే వచ్చేదనీ మేనేజర్, ధర్మశాలలోని ఇతరులు చెపుతున్నారు. అక్టోబర్ తొమ్మిదిన షకీలా మేనేజర్‌తో తాను తన తల్లిదండ్రులను చూడడానికి ఊరికి పోతున్నానని, కొన్ని రోజుల వరకు రానని చెప్పినట్టు తెలుస్తున్నది.

డాక్టర్ రావి విజయకుమార్ రెడ్డి చెప్పిన ప్రకారం షకీలా ఆయనను తన అనారోగ్యం గురించి అక్టోబర్ 13న కలుసుకోగా ఆమె హైపరేయాసిడిటీతో బాధ పడుతున్నదని ఆయన చెప్పాడు.

ధర్మశాలలో వుంటున్న ఇతరులు ఆమెను అక్టోబర్ పధ్నాలుగు దాకా చూడనే లేదు. పధ్నాలుగున ఆమె బాధాకర పరిస్థితుల్లో గదికి చేరింది. ఆమె ఈ పరిస్థితిలో వుండగా పోలీసులు మేనేజర్‌తో ఆమెను బయటకు తోసివేయాల్సిందిగా చెప్పారు. మర్నాటి ఉదయానికి ఆమె పరిస్థితి ఇంకా చెడిపోయింది. ఆమె తమ్ముడు బాషా ఆమెను వెంటనే డాక్టర్ రెడ్డి దగ్గరకు తీసుకుపోయాడు. ఆయన ఆమెను పరీక్షించి అపస్మారకంగా వుందని తేల్చి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుపొమ్మని చెప్పాడు. అక్కడ సరియైన సౌకర్యాలు లేనందువల్ల ఆమెను సికిందరాబాదు గాంధీ ఆసుపత్రికి మార్చారు. ఆమెను సికిందరాబాదుకు టాక్సీలో తీసుకుపోయారు. టాక్సీలో ఆమెతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్ళు, తమ్ముడు బాషా, ఒక డాక్టరు వున్నారని తెలుస్తున్నది. గాంధీ ఆసుపత్రిలో ఆమె ఆ రాత్రి తొమ్మిది గంటలకు చనిపోయింది. పోస్ట్ మార్టం నివేదికలో ఆమె నిద్రమాత్రలు ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల చనిపోయిందని తేలింది.

ఆశ్చర్యకరంగా అక్టోబర్ పధ్నాలుగు మధ్యాహ్నం హైదరాబాదు ఉస్మానియా ఆసుపత్రిలో ఒక తెలియని వ్యక్తిగా షకీలా భర్త హెన్రీ అపస్మారక స్థితిలో చేర్చబడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం ఇది ఆత్మహత్యా ప్రయత్నం.

పోలీసుల ప్రవర్తన స్థానికుల్లో అనుమానాలు రేకెత్తించిందనేది ఇక్కడ ముఖ్యమయిన విషయం. పోలీసులు స్త్రీలపై అత్యాచారాలూ హింసలూ సాగించడంలో

ప్రసిద్ధులని భువనగిరి ప్రజలు తెలిపారు. కనుక ఈ సంఘటనను కొందరు యువకులు గమనిస్తూ వచ్చారు. ఈ యువకులు షకీలాను సికింద్రాబాదు ఆసుపత్రికి తీసుకు పోయిన టాక్సీని ఒక టెంపోలో వెంబడించారు. వీరిలో ఒక యువకుడు సెప్టెంబర్ 28 రాత్రి హెన్రీతో కలిసి పోలీస్ లాకప్‌లో వున్నాడు. గాంధీ ఆసుపత్రిలో షకీలా మరణించిందని తెలియగానే వీళ్ళందరూ వెంటనే భువనగిరి బయల్దేరారు. దారిలో బీబీనగర్ వద్ద వీళ్ళ టెంపోను ఒక పోలీసు వ్యాన్ అడ్డగించింది. పోలీసులు యువకులను చుట్టివేసి అందర్నీ పోలీస్ స్టేషన్‌కు తీసుకుపోయారు. వీళ్ళలో నుంచి నలుగురు యువకులు మాత్రం తప్పించుకున్నారు. పోలీసులు కస్టడీలోకి తీసుకున్న వాళ్ళను మర్నాడు ఉదయం పదకొండు గంటలకు వదిలిపెట్టారు. తప్పించుకొని వచ్చిన నలుగురు యువకులు భువనగిరి ప్రజలను షకీలా విచిత్ర మరణం గురించి, ఆమె తమ్ముని అదృశ్యం గురించి హెచ్చరించారు.

ఐదువేల ప్రజా సమూహం భువనగిరిలోని గ్రామీణ, పట్టణ పోలీస్‌స్టేషన్లకు తరలి వెళ్ళింది. అప్పుడు సర్కిల్ ఇనస్పెక్టర్‌గానీ, సబ్ ఇనస్పెక్టర్‌గానీ లేడని తెలిసింది. ప్రజా సమూహంతో సబ్ కలెక్టర్ చాలా అసహ్యంగా ప్రవర్తించాడని తెల్సింది. ఆయన ప్రజా సమూహాన్నుద్దేశించి షకీలా అక్కడున్న ఎవరికైనా చెల్లిగానీ, తల్లిగానీ, కూతురుగానీ అవుతుందా అని ప్రశ్నించి కానప్పుడు ఇట్లా ఉద్రేకపడడం ఎందుకు అని అన్నాడట.

మొత్తం సంఘటన ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తున్నది. అధికారిక కథనంలో ఒకదానికొకటి సంబంధంలేని విషయాలు ఎన్నో ప్రశ్నలకు తావిస్తున్నాయి.

1. పోలీసులు హెన్రీ చెల్లించవలసిన జుర్మానా చెల్లించి మళ్ళీ ఆయనను చట్ట వ్యతిరేకంగా ఎందుకు నిర్బంధించారు ?
2. సెప్టెంబర్ 22 నుంచి 29 వరకు షకీలా పోలీస్ స్టేషన్లో ఎందుకు ఉంచబడింది?
3. పోలీసులు షకీలాకు సెప్టెంబర్ 29న ధర్మశాలలో గది ఇప్పించడానికి అక్టోబర్ 14న ఆమెను ఖాళీచేయించడానికి ఎందుకు శ్రద్ధ తీసుకున్నారు ?
4. అక్టోబర్ తొమ్మిది నుంచి పద్నాలుగు వరకు షకీలా ధర్మశాలలో వుండక పోవడానికి సంజాయిషీ ఏమిటి ?
5. పోలీస్ స్టేషన్ వెనకవైపు వరండాలో హెన్రీ అపస్మారక స్థితిలో ఎందుకు పడివున్నాడు ?

6. డాక్టర్ రెడ్డి షకీలా భర్త గురించి అడిగినప్పుడు షకీలా తమ్ముడు బాషా సందేహిస్తూనే తన బావ పోలీస్ కస్టడిలోవున్నాడని చెప్పాడు. డాక్టర్ మళ్ళీ ఎస్ఐని అడిగినప్పుడు ఈ విషయాన్ని ఎస్ఐ ఎందుకు ఖండించాడు ?

7. సబ్ ఇనస్పెక్టర్ కుటుంబ వైద్యుణ్ణని చెప్పుకుంటున్న డాక్టర్ కిషన్ హెన్రీని చూడవలసిందిగా కోరబడ్డాడు. ఆయన ఊరికే నాడి పరీక్షించాడని స్పృహలో లేదని తెలిపాడని తెలుస్తున్నది. హెన్రీ స్థితిగురించి పోలీసులను ఆయన సంజాయిషీ కూడ అడగలేదు. ఎందువల్ల ? వైద్యవృత్తిలో వున్న ఒక బాధ్య తాయుత వ్యక్తిగా ఆయన హెన్రీపై సాధారణ పరీక్షలన్నీ ఎందుకు జరపలేదు.

8. హెన్రీపై అనేక నేరాభియోగాలు ఉండగా పోలీసులు ఆయనను ఉస్మానియా ఆస్పత్రిలో 'తెలియని వ్యక్తి'గా ఎందుకు చేర్చారు ?

9. ధర్మశాలలో షకీలా గదిలో రెండు వాడబడిన ఇంజెక్షన్ సూదులు, ఒక ఖాళీ సిరెంజ్ డబ్బా వుండడాన్ని ఎవరు ఎట్లా వివరిస్తారు ? పంచనామా ప్రకారం రసాయనిక పరీక్షకు పంపిన వస్తువుల్లో ఇవిలేవు. ఎందువల్ల ?

10. అక్టోబర్ 15 రాత్రి సికిందాబాదు నుంచి వస్తున్న యువకులు బీబీనగర్ పోలీస్ స్టేషన్ వద్ద ఎందుకు నిర్బంధించ బడ్డారు ?

11. టాక్సీలో షకీలా వెంట వెళ్ళినట్టు చెప్పబడుతున్న డాక్టర్ ఎవరు ?

12. షకీలా తీసుకున్న మత్తుమందులకు చుట్టబడి వుండే కాగితం గాని, డబ్బాగాని షకీలా గదిలో కనిపించక పోవడాన్ని ఎట్లావివరిస్తారు?

13. డాక్టర్ చీటీ లేకుండా మత్తుమందులు ఏ దుకాణంలో ఇచ్చారు ?

14. నేర వైద్య విభాగపు నివేదికలు ఎంతవరకు నమ్మదగినవి ?

ఇంకా ఈ సంఘటనకు వింతైన, జవాబు దొరకని కోణాలు ఎన్నో వున్నాయి, ఉదాహరణకు షకీలా మూడువారాల పాటు ప్రతి సాయంత్రమూ పోలీస్ స్టేషన్‌కు ఎందుకు వచ్చేది ? అక్కడ అవమానాలు ఎదుర్కొంటూ కూడ ఇట్లా తప్పనిసరిగా రోజూ రావడానికి ఆమెకు వున్న భయమేమిటి ? అది హెన్రీ ప్రమాదకర పరిస్థితుల్లో వుండడమేనని ఎవరైనా ఊహించొచ్చు. హెన్రీ ఆమెకు మూడవ భర్త అన్న విషయం తెలిస్తే ఈ భయం ఇంకా విశదమౌతుంది. మొదటి భర్త ఆమెను వదిలేశాడు; రెండవ భర్త 1977 ఉప్పెనలో చనిపోయాడు; మూడవ భర్త హెన్రీ - ప్రేమించి?

మతం మార్చుకొని పెళ్ళిచేసుకొన్న భర్త— పోలీసుల చేతుల్లో వున్నాడు. ఈ పరిస్థితిలో వున్న ఇంకే స్త్రీ ఐనా ఎట్లా ప్రవర్తిస్తుంది? ఆమెకు భువనగిరిలో ఎవరూ తెలియదు, హిందూ ధర్మశాలలో ముస్లింస్త్రీని ఉంచుకోలేని ధర్మశాల అధికారులు ఆమెను రోజూ ఖాళీ చేయమని అడుగుతూ వచ్చారు. ఆమె దగ్గర డబ్బేమీ లేదు. ఆమెకున్నదంతా హెన్రీ విడుదల అవుతాడన్న ఆశమాత్రమే.

షకీలా ఎవరైనా నమ్మి ఏమీ చెప్పలేక పోయిందంటేనే స్త్రీగా ఆమె ఎంత అసహాయస్థితిలో వుండిందో తెలుస్తున్నది. మనం కష్టాల్లో వున్నపుడు - ముఖ్యంగా అవి లైంగికమైనవైతే - మౌనంగా వుండడం నేర్పబడ్డాం. ఈ లొంగుబాటు తనం, ఏ విషయాన్నైనా పట్టించుకోకుండా వదిలేయగల శక్తియుక్తులు మన సాంఘిక పురాణాల్లో ఎట్లా కల్పన చేయబడ్డాయంటే, మననెట్లా తయారు చేశాయంటే ఈ విషయాల పట్ల మౌనంగా వుండడంలోని కేవల వ్యర్థతను, అవసరమైన అంశమేదీ లేకపోవడాన్ని మనమింకా గుర్తించనేలేదు.

మాలో రమీజాబీని కలుసుకున్న కొందరికి ఇక్కడ ప్రవర్తనలోని లక్షణాల సారూప్యత కొట్టొచ్చినట్టు కనబడింది. భువనగిరి ప్రజలు షకీలాను సాత్వికమైన, అమాయకమైన, కరుణ కలిగించేట్టుగా, మౌనంగా వుండే యువతిగా వర్ణించారు. ఇవే లక్షణాలు రమీజాబీని అందరూ ఆకర్షించేట్టు చేశాయి. ఒక స్త్రీని 'ఆదర్శ మహిళ'గా మార్చే లక్షణాలే ఆ స్త్రీపై దౌర్జన్య చర్యజరగడానికి దోహద పడ్డాయి.

షకీలా వసతి గురించి, చికిత్స గురించి, అంత్యక్రియల గురించి పోలీసులు అంతశ్రద్ధ తీసుకోవడంలో వాళ్ళ విశాల హృదయాన్ని, మానవతా దృక్పథాన్నీ మనం నమ్మదామా? బాధల్లో వున్న ప్రజలందరూ పోలీసుల నుంచి అలాంటి సాధారణ సేవలు ఊహించవచ్చునా?

స్థానిక ప్రజలు చూపించిన విస్మయకర జాగరూకతయే పోలీసుల చేతుల్లో వాళ్ళెన్ని బాధలు పడ్డారో తెలుసుకోవడానికి గుర్తు. భువనగిరి ప్రజల్లో వచ్చిన ఆకస్మిక ప్రతిఘటన యొక్క స్వభావమూ, బలమూ భువనగిరి ప్రజలకు పోలీసుల పట్ల వున్న అపనమ్మకాన్ని తెలుపుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలీసులచే చెరచబడిన వాళ్ళకు నష్టపరిహారంగా డబ్బు చెల్లించడం ప్రారంభించి ఎన్నో రోజులు కాలేదు. అయినా ఈ చెల్లింపు ఒక సాధారణ ప్రక్రియగా మారిపోయింది.

తీగలాగితే డొంకంతా కదిలిన
రమీజాబీ సంఘటన - ముక్తధార్ కమీషన్ రిపోర్టు

నల్లగొండజిల్లా అంతా ఇప్పటికీ చల్లారని సందోహంలో వున్నా, లెజిస్లేటర్లు మొదలుకొని వేలాది మంది ప్రజలు డిమాండ్ చేసినా చెన్నారెడ్డి ప్రభుత్వం భోనగిది స ఘటనపై, షకీలా మృతిపై న్యాయవిచారణ ఎందుకు జరిపించడం లేదు ? రమీజాబీ సంఘటనపై ముక్తధార్ కమీషన్ మూతికి అంటించిన చురకలు చురుక్కుమంటున్నాయి గనుక. ముక్తధార్ కమీషన్ ముక్తాయింపులు ఏమిటి ?.... చదవండి.

1978 మార్చి ముప్పై తెల్లవారు జామున సందికొట్కూరు (కర్నూలుజిల్లా) గ్రామానికి చెందిన యువతి రమీజాబీని ఇద్దరు బీట్ కానిస్టేబుళ్ళు- జి. రామారావు సయ్యద్ ముర్తుజా హుసేన్ నగర పోలీసు చట్టం కింద నిర్బంధించి హైదరాబాదు నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు తీసుకుపోయారు. రమీజాబీ, ఆమె భర్త అహ్మద్ హుసేన్ ఒక సినిమా చూసి ఇంటికి తిరిగి వస్తున్నారు. హుసేన్ మూత్రం పోయడానికై పక్కకుపోగా రమీజాబీ ఆయన కోసం ఎదురుచూస్తూ రోడ్ మీద నిలబడింది. ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్ళు ఆమెను బలవంతంగా నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు తీసుకుపోయి అక్కడ ఆమెను తెల్లారే దాకా వుంచారు. ఈ మధ్యకాలంలో ఆమెను విపరీతంగా కొట్టారు, చెరిచారు. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ఇద్దరు పోలీసులను తోడు ఇచ్చి ఆమెను అహ్మద్ హుసేన్ మామ ఐన ఇమామ్ సాహెబ్ ఇంటికి

విచారణ కమిటీలు నియమించినపుడు అవి ప్రజల ప్రతిస్పందనను మళ్ళించడానికీ, చల్లబర్చటానికీ వుపయోగపడుతున్నాయి. ఎందుకంటే న్యాయం జరుగుతుందనే ఆశ రేకెత్తించబడుతుంది. ముక్తధార్ కమీషన్ విచారణ పోలీసులకు వ్యతిరేకంగా వచ్చినపుడు - ఆ నివేదికను ప్రజలముందుంచలేదు. పైపెచ్చు రమీజాబీని ఒక వ్యభిచారిణిగా చిత్రించి తర్వాత చాలాకాలం దాకా వేధించారు. ప్రజలకు వ్యతిరేకంగా నిరంతరం అత్యాచారాలను, నేరస్తులకు రక్షణను గ్యారంటీ చేస్తున్న యీ వ్యవస్థలో ఆయా సంఘటనలపై యీ విధంగా ప్రజల ఆగ్రహం వ్యక్తమవుతూ వుండటమే మాకు మిగిలిన ఆశ. ప్రజల యీ కోపం మాకు ఆశగా మిగిలిన మాట నిజమే అయినా, యిది చాలదు. ఎందుకంటే యిందులో కూడా స్త్రీని ప్రైవేటు ఆస్తిగా పరిగణించే సాంప్రదాయక పురుష దృక్పథం యిమిడి వున్నది. స్త్రీలు కూడా చైతన్యవంతులై యిటువంటి సంఘటనల విషయంలో సరిఅయిన దృక్పథంతో పోరాడినప్పుడు కాని యిది మౌలికంగా మానవ విలువలకి విఘాతం అనే సరిఅయిన దృక్పథంతో అర్థంచేసుకోలేము.

— వసంతా కన్నబిరాన్

పంపారు. ఆ ఇద్దరు పోలీసులు అహ్మద్ హుసేన్‌ను, ఇమాంసాహెబ్‌ను, రమీజాబీని తిరిగి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ అహ్మద్ హుసేన్‌ను పోలీసులు బాగా కొట్టారు. వాళ్ళ దగ్గర రు. 400/- గుంజుకొని ఇంటికి పంపేశారు. అహ్మద్ హుసేన్‌ను ఇమాం సాహెబ్ ఇంటికి తీసుకొచ్చిన కొద్దిసేపటికే ఆయన తనకు గుండెలోనూ, శరీరమంతటా నొప్పివస్తుందని చెప్పాడు. కొంతసేపటికి కుప్పకూలిపోయాడు. వెంటనే ఆయనను దగ్గరేవున్న కోరంటి దవాఖానా (ఫివర్ హాస్పిటల్)కు తీసుకుపోగా అక్కడ ఆయన చనిపోయాడని ధృవీకరించారు. శవాన్ని ఇంటికి తీసుకొచ్చారు. స్త్రీల ఏడ్పుల వల్ల ఇంటిముందు జనం పోగయ్యారు. ఆ తర్వాత శవాన్ని తీసుకుపోయి పోలీస్ స్టేషన్ వరండాలో వుంచారు. అక్కడ ఎంతో మంది కోపోద్రిక్తులయిన ప్రజలు గుమిగూడారు. సహజంగానే ఈ పరిస్థితి ఆవేశానికి కారణమై, చాలా కొద్ది సేపట్లోనే నగరమంతటా ఉద్రిక్తతలు చెలరేగాయి........

దీంట్లో ఇమిడి వున్న అంశాలు మామూలు క్రిమినల్ నేరానికి సంబంధించినవే కాదు, ఇవి పౌరసౌఖ్యాలకు, చట్టాన్ని అమలు చేయవలసిన వ్యవస్థ చేసే చట్టవ్యతిరేక చర్యలకు సంబంధించినవి. సంఘటన జరిగిన నాటినుంచి పోలీసులు సంఘటనలో ఇమిడివున్న అంశాలు మరుగుపర్చడానికి రమీజాబీని ఒక వేశ్యగా చిత్రిస్తున్నారు. ఆమెను వేశ్యగా నిరూపించి ఆమెకు వచ్చిన ప్రాముఖ్యతను దెబ్బదీయ దల్చుకున్నారు పోలీసులు. రమీజాబీ తమకు తెల్సని చెప్పడానికి పోలీసుశాఖ కొందరు వేశ్యలను సాక్షులుగా వాడుకున్నది. దీనివల్ల రమీజాబీని వేశ్యగా నిర్ధారించడమేమోగానీ పోలీసు స్టేషన్లకూ, వేశ్యలకూ సంబంధాలున్నాయనే విషయాన్ని మాత్రం నిర్ధారించింది పోలీసుశాఖ... ఈ సాక్షులందర్నీ నియోగించడానికి రమీజాబీ గురించి వివరాలు సేకరించమని పంచాయతీ బోర్డ్ సభ్యుడు అలీసాహెబ్‌కు రాష్ట్రవాణిజ్యశాఖా మంత్రి ఫోన్ చేశాడు. స్థానిక ఎస్. ఐ. ని రమీజాబీ ఏదైనా వ్యభిచార నేరంలో ఎప్పుడైనా విచారించబడ్డదో కనుక్కోమని ఆదేశించారు. ఆ ఎస్. ఐ. విచారణలో ఆమె ఎన్నడూ, ఏ విషయంలో కూడా పోలీసులచే విచారణ చేయబడలేదని తెల్సింది. రమీజాబీకి వ్యతిరేకంగా నందికొట్కూరులోనూ, హైదరాబాదులోనూ సాక్ష్యాలను సేకరించే పని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (క్రైమ్స్) వీరభద్రరావుకు ఒప్పగించారు. కమీషన్‌కు నిజనిరూపణలో సాయపడే బదులు పోలీసు ఉన్నతాధికారులందరూ దొంగసాక్ష్యాలు సేకరించడంలో మునిగిపోయారు.

వేశ్యలు గౌసియా, రజియాల సాక్షాల ప్రకారం వాళ్ళకు ఒక బేరం దొరకగానే వాళ్ళకొచ్చిన దాంట్లోనుంచి పదిరూపాయలు పోలీస్ స్టేషన్‌కివ్వాలి, పోలీసులు

తార్పుడుగాళ్ళని సాక్షులుగా ప్రవేశపెట్టి పోలీస్‌స్టేషన్లకూ, తార్పుడు గాళ్ళకూ, వేశ్యలకూ వ్యాపార సంబంధమున్నదని నిరూపించుకున్నారు. ఇది పోలీసులు అవినీతి చర్యల నిరోధక చట్టాన్ని ఎంత నిజాయితీతో ఎంత తాదాత్మ్యంతో అమలు చేస్తున్నారో తెలుపుతుంది. రమీజాబీని వేశ్యగా నిర్ధారించేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు ప్రజలకు పోలీసుల 'నీతి'నీ, చట్టాల అమలు వెనకవున్న ప్రయోజనాన్నీ తెల్పినయి. పోలీసులు అహ్మద్ హుసేన్ మృతికి రమీజాబీ మానభంగానికి సంబంధించిన వైద్యపరీక్షల్లో కూడా జోక్యం కలిగించుకున్నారు.

ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఖండేల్కార్ అహ్మద్ హుసేన్ శవ పరీక్ష చేశాడు. మానభంగం గురించి రమీజాబీని పరీక్షించాడు....

డాక్టర్ ఖండేల్కార్ సాక్ష్యం ప్రకారం మార్చ్ 30 రాత్రి డిఐజి విజయ రామరావు, హోమ్‌శాఖ మంత్రి ఆయన ఇంటికి వచ్చారని తెల్సింది. ఆ తర్వాతనే డాక్టర్ ఖండేల్కర్ పోస్ట్ మార్టమ్ చేయడానికి, రమీజాబీని పరీక్ష చేయడానికిపోయాడు.

ఆస్పత్రిలో ఖండేల్కార్ చుట్టూ పోలీసు అధికారులేవున్నారు. పోస్ట్ మార్టమ్ గురించి ప్రాథమిక నివేదిక రాయిస్తున్నప్పుడు ఆయన గదిలో ఎసిపి వీరభద్రరావు ఇంకొక అధికారి వున్నారు. ఈ విషయాన్ని ఆయన సహాయకుడు డాక్టర్ నాగరాజు ధృవీకరించాడు. అహ్మద్‌హుసేన్ గుండె నొప్పివల్ల చనిపోయాడని ప్రొఫెసర్ చెప్పినప్పటికీ ఆయన నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో తిన్న దెబ్బల వల్లనే మర ణించాడని కమీషన్ ముందు తేటతెల్లమయింది. అహ్మద్‌హుసేన్‌కు తగిలిన గాయాలు ప్రాణాంతకమైనవికావని తేల్చేందుకు రాష్ట్ర పోలీస్ వ్యవస్థ డాక్టర్‌తో పోస్ట్ మార్టం నివేదికలో మార్పులు చేయించింది....

ఎసిపి (డివిజన్ 6), కమీషనర్ ఆఫ్ పోలీస్, డిఐజి (క్రైమ్స్), ఐజిపి మొదలైన పోలీసు ఉన్నతాధికారుల సమావేశమొకటి ఏప్రిల్ ఆరున జరిగింది. దీని తర్వాతనే రిమాండ్ డైరీ తయారుచేయబడింది. రమీజాబీ వాఙ్మూలం రికార్డ్ చేసే ముందు పరిశోధనాధికారి ఎసిపి నుండి ఐజిపివరకు అందరు అధికారులను కలుసుకున్నా నన్న విషయం దాచాడు. రేప్ చాలా పెద్ద నేరమైనప్పటికీ ఆ రేప్ గురించి వెంటనే ప్రాథమిక సమూహ నివేదిక (ఎఫ్ఐఆర్) తయారుచేయబడలేదు. రమీజాబీ నుంచి పోలీసులు అనేక సార్లు వాఙ్మూలాలు తీసుకున్నారు ; ఒక సారి చెప్పిందానికి ఇంకో సారి చెప్పిందానికి ఏమైనా తేడా వుంటుందేమో, అది పోలీసులకు లాభం కలిగించ వచ్చేమో అనే ఆశతో ముక్తధార్ కమీషన్ తన నివేదికలో ఈ కేసులో సంబంధ

మున్న పోలీసు అధికారులు భారతీయ శిక్షాస్మృతి ప్రకారం ఎన్నో నేరాల కింద శిక్షలకు అర్హులనే నిర్ణయానికి వచ్చినప్పటికీ ఇందులో ప్రధానంగా గమనించవలసింది ఈ విచారణ సందర్భంలో కూడ మొత్తం పోలీసుశాఖ వ్యవహరించనతీరు.

ఉదాహరణకు ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ ప్రవర్తనను కమీషన్ చాలా తీవ్రంగా విమర్శించింది.

"మానవుల పట్ల సేవాభావంతో అకుంఠిత దీక్షతో విధులు నిర్వర్తించవలసి వున్న ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగపు అధికారులు- తమకున్న అధికారబలంతో, ఎదుటి వ్యక్తుల నిస్సహాయతను, పరిస్థితిని ఆసరాగా తీసుకొని పరమ దుర్మార్గమైన పనులు బహిరంగంగా చేసినవారి ఒళ్ళు కాపాడడం కోసం అంత నీచ స్థితికి దిగజారడం శోచనీయం. న్యాయాన్ని వెలికి తీయవలసిన వ్యవస్థ- నేరస్తుల రక్షణ కోసం న్యాయాన్ని తలకిందులు జేసే, సందేహాస్పదమైన న్యాయబుద్ధిగల కొందరు అధికారుల చేతుల్లోకి పోవడం చాలా విచారకరం. ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం ఎంత తొందరగా ఇలాంటి అధికారులను వదిలించుకుంటే అంత తొందరగా అది భారత పౌరులకు ఉపయోగపడుతుంది."

కమీషన్ చెప్పిన విషయాల ప్రకారం అధికారులను లొంగదీసుకోవడానికి పోలీసుశాఖ తన అధికారాన్ని ఎట్లా దుర్వినియోగ పరుస్తున్నదో తెలుసుకోవచ్చు.

మంత్రుల ప్రవర్తనపై, పోలీసు వ్యవస్థపై తన పరిశీలనలను వెల్లడించే వీలు లేకుండా కమిషన్ విచారణకు పరిమితులు (terms of reference) ముందే విధించబడ్డాయి. కాని మొత్తం పోలీసు వ్యవస్థ ఎట్లా ప్రవర్తించిందో నిజాన్ని తలకిందులు చేయడానికి పోలీసులు మంత్రులనెట్లా ఉపయోగించుకున్నారో విచారణలో తెలిసిపోయింది.

సాక్ష్యం ఇచ్చిన ముగ్గురు పోలీసు అధికారులు ప్రమాణంచేసి అబద్ధాన్ని చెప్పారని కమీషన్ విస్పష్టంగా వివరించింది. వీళ్ళిచ్చిన సాక్ష్యాలకు రాష్ట్రంలోని పోలీసు ఉన్నతాధికారుల దీవనలున్నాయని రుజువైంది.

పాలకవర్గ పార్టీ అండతో మొత్తం పోలీసువ్యవస్థ ఒక వ్యాజ్యంలోని మామూలు వ్యక్తి ఎట్లా ప్రవర్తిస్తాడో అట్లా ప్రవర్తించింది. రాజ్యాంగ బద్ధమైన, చట్టబద్ధమైన పరిధుల్లో పోలీసులు ఏ విధులు నిర్వహించాలని సమాజం ఆశిస్తుందో అవి ఖాకీదుస్తుల

వేసుకోవడం, అదుపూ అడ్డూ లేకుండా మారణాయుధాలు వైర్‌లెస్ సెట్లూ, ఇతర ఆధునిక సౌకర్యాలు ఉపయోగించడం కాదు, ప్రజల విశ్వాసాన్ని పొందడం.

బలప్రదర్శన ద్వారానో, పత్రికల ద్వారానో, నేరాలకు ప్రాముఖ్యత ఇచ్చి ప్రజల్లో భయాన్ని, భద్రతలేదనే భావాన్ని కలిగించడం ద్వారానో ఈ విశ్వాసం పొందలేరు. ఇలాంటి ఎత్తుగడలు తాత్కాలికంగా ఉపయోగపడతాయేమో ! కాని ప్రజలు ఆ ఎత్తుగడలను పరీక్షిస్తారు. న్యాయవిచారణల గొంతునొక్కడం ద్వారానో, దొంగ సాక్ష్యాలిప్పించడం ద్వారానో, విశ్వాసమూ, గౌరవమూ పొందలేరు. పోలీసుల ప్రతిష్ఠను సెమినార్‌లు పెంచలేవు- అధికారులకు, నేరస్తులకు రక్షణ ఇస్తూ పోలీసు వ్యవస్థను పునర్నిర్మించడం వల్ల 'నీతి'ని ఉద్ధరించలేం.

షా కమీషన్ కూడ పోలీసుల అనవసర జోక్యాలు, జనరల్ డైరీలను సరిగా ఉపయోగించకపోవడం, బాలికలపై స్త్రీలపై అత్యాచారాలు ఇళ్ళలోకి అక్రమంగా ప్రవేశించి లూటీలు చేయడం లాంటి ఎన్నో విషయాలు బయట పెట్టింది. ఈ పరిశీలనలను బట్టి తెలిసేదేమంటే ప్రజలచే విచారణ చేయబడకుండా వుండే చట్టబద్ధమైన రక్షణ పోలీసులకు ఉపయోగపడడం అర్థంలేదు. శాసన రక్షణ వెనక వున్న ప్రయోజనాలు పెద్దమొత్తంలో దుర్వినియోగపరచబడ్డాయి. అలాంటి రక్షణ ఇవ్వడం అవసరమా అనేది ఇప్పుడు ఆలోచించాలి.

పోలీసు కస్టడీలో మరణం

పోలీసుల ఆధీనంలో వుండగా ఏ వ్యక్తి అయినా మరణించడం సంభవిస్తే భారత శిక్షాస్మృతి, సెక్షన్ 167 ప్రకారం మేజిస్ట్రేటు విచారణ జరుపుతాడు. ఇట్టి విచారణ న్యాయాధికారాలు కలిగిన ఒక కార్యనిర్వహణాధికారికి - సాధారణంగా తహసీల్‌దారుకు- కొన్ని ప్రత్యేకాధికారాలతో అప్పగించబడుతుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో - గిరాయిపల్లి సంఘటనలకు సంబంధించి- భార్గవ కమిషన్ న్యాయవిచారణ జరిపిన కాలంలో, ఇలాంటి విచారణలు వట్టి బూటకమనీ, ఇవి కేవలం పోలీసుల కథనాలకు అనువుగా మదింపుచేయబడేవేననీ చాలా స్పష్టంగా తేలిపోయింది. ముక్తధార్ కమిషన్ ఎదుట పోలీసు వ్యవస్థ నిజస్వరూపం పూర్తిగా బట్టబయలయింది. నిజానిజాలు తెలుసుకోవటానికి అవసరమైన సమాచారాన్ని ముక్తధార్ ముందుంచటానికి ఐ. జి. పి గాన్ని, హోంశాఖ కార్యదర్శిగాని పోలీసు అధికారులకు అనుమతి లేదా ఆజ్ఞలు యిచ్చిన దాఖలాలేవీ లేవని కమిషన్ ముందు స్పష్టమైంది.

ముక్తధార్ కమిషన్ ఎదుట రమీజాబీ వ్యభిచారిణి అని నిరూపించటానికి పోలీసులు తార్పుడు గాళ్ళనుంచీ, వ్యభిచారిణిల నుంచీ సాక్ష్యధారాలను సంపాదించారు. నిస్సహాయులైన యీ పీడితుల మీద పోలీసుల యమపాశం ఆ విధంగా బిగుసుకుని పోలీసు నీతిని బట్టబయలు చేస్తున్నది. ముక్తధార్ ముందున్నది రమీజాబీ వ్యభిచారిణా, కాదా అన్న అంశం కాదు. కాని యీ తతంగమంతా 'చూశారా ! ఒక వ్యభిచారిణిని చెరిచినందుకే ఎంత గగ్గోలు పెడుతున్నారో' అని ప్రజల ముందు విన్నవించుకోటానికి. రమీజాబీ భర్త హుస్సేన్ పోలీసుల ఆధీనంలో వుండగా తీవ్రమైన గుండెపోటులో మరణించాడనీ మేజిస్ట్రేటు విచారణలో తేలింది. కాని వైద్యపరీక్షలు, మెడికల్ రిపోర్టును డాక్టర్లు మార్చారన్న విషయం కమిషన్ ఎదుట బట్టబయలయింది. ఫోరెన్సిక్ వైద్య విభాగం కూడా పోలీసుల తొత్తేనని నిరూపించబడింది. ప్రభుత్వం ఇరుక్కున్న ప్రతి మెడికో - లీగల్ కేసులోనూ వైద్య సర్టిఫికేట్లు విలువలేని కాగితాలని తేలిపోయింది ఇంటిలిజెన్స్, పోలీసుల అధికారానికి లొంగి వుంటూ, ఏ విషయాలూ సరిగా తెలియని వ్యక్తులచే మేజిస్ట్రేటు న్యాయవిచారణ జరిపించబడి, అది ఒక పనికిమాలిన పనిగా తయారైంది. భారత శిక్షాస్మృతిలోని 176వ సెక్షన్ ఒకే ఒక విధంగా వుపయోగపడుతూంది. అది- పోలీసు అధీనంలో వున్న నేరస్తులను కాపుకాస్తూనే వారిచేత ఏ అడ్డంకీ లేకుండా నేరాలను చేయించడానికి.

మరణం అనేది అనుమానాస్పదమైన పరిస్థితుల్లో సంభవించినప్పుడు పోలీసులు ఆ నేరాన్ని పరిశోధించి దగ్గరలోవున్న మేజిస్ట్రేటు ముందు చార్జిషీటు దాఖలుచేస్తారు. భారత శిక్షాస్మృతి ననుసరించి హత్యకు సంబంధించిన కేసును సెషన్స్ కోర్టే విచారించాలి- కాబట్టి హంతకులను విచారించే బాధ్యతను సెషన్స్ న్యాయస్థానానికి బదిలీ చేయడం తప్ప మేజిస్ట్రేట్ చేసేదేమీలేదు.

కాని- పోలీసుల అధీనంలో వుండగా మరణం సంభవిస్తే, ఆ కేసును విచారించేందుకే కాదు- నేరస్తులైన పోలీసు అధికారులను పడిచిపెట్టేందుకు కూడా కార్యనిర్వాహక మేజిస్ట్రేటుకే (తహసీల్‌దారు) అధికారాలు యిస్తారు.

ఈ తరహా న్యాయవిచారణే, స్వాభావికంగా ఒక కార్య నిర్వాహణచర్య కాబట్టి అటు తర్వాత మరే చర్యా తీసుకునే అవకాశం శూన్యం.

అయితే, యిక్కడ తలెత్తే ప్రశ్న –

ఒక వ్యక్తి పోలీసు ఆధీనంలోగాని, లేదా పోలీసుస్టేషన్‌లోగాని చనిపోయినపుడు మేజిస్ట్రేటు అధికారాలు యివ్వబడ్డ ఒక కార్య నిర్వహణాధికారి న్యాయ విచారణ జరపటమనేది భారత రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్ ప్రకారం సమంజసమేనా ? సబబేనా ? అనేది.

పోలీసుస్టేషన్‌లోగాని పోలీసుల ఆధీనంలోగాని ఎప్పుడు మరణం సంభవించినా యీ పోలీసు అధికారులను విచారించేందుకు సెషన్స్ న్యాయస్థానం ముందుకు ఎందుకు తీసుకుపోరు ?

ప్రజల ముందు, నిండు న్యాయస్థానంలో ఈ అధికారులు తమ నేరాలను కడి గేసుకోవడం సరియైన పద్ధతి కాదా ?

భారత శిక్షా స్మృతిలోని 176వ సెక్షన్‌లో పేర్కొన్న పద్ధతి పక్షపాత పద్ధతే కాక రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్‌ను త్రోసిపుచ్చడం కాదా ?

అధికారం ముసుగులో నేరాల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నకొద్దీ యీ ప్రశ్నల అవసరం ఎంతో కలుగుతుంది. న్యాయవిచారణకు సంబంధించిన ఆటంకాల గురించో, ఇతర అసౌకర్యాల గురించో చెప్పే సాకులు లేవనెత్తిన సమస్యలకు సమాధానాలు కాజాలవు.

ఏ వ్యక్తి అయినా ఫిర్యాదుచేసి చట్టాన్ని కదుపాలనుకోవడం కేవలం ఒట్టి మాటలు. అట్లాంటి పనిని మట్టుపెట్టటానికి పోలీసు వ్యవస్థ చాలా దృఢమైన పద్ధతులు అవలంబిస్తుంది.

పోలీసుల చేతుల్లో ప్రజలు మానాల్ని ప్రాణాల్ని పోగొట్టుకోవడం అనేవి రాజకీయపక్షాలకు, రాజకీయ వాదులకు అసలు ఏ మాత్రమూ పట్టనివి. ఒకవేళ అలాంటి విషయాలేవైనా పట్టించుకున్నా అవి వాళ్ళ వ్యక్తిగత రాజకీయావసరాలకో లేదా పార్టీ రాజకీయాలకో ఎంతవరకు వుపయోగపడితే అంతవరకే పట్టించుకుంటారు. షకీలా విషయాన్నే తీసుకోండి. కొందరు శాసన సభ్యులతో కూడిన ఒక టీము షకీలా చనిపోయిన చోటికి వెళ్ళి విలువైన సమాచారాన్నే సేకరించింది. కాని హైదరాబాదు తిరిగొచ్చి వాళ్ళు చేసిన డిమాండు, హోంమంత్రి ఎం. ఏ హషీమ్ రాజీనామా ! ఇలాంటి విషయాలు ఎల్లప్పుడూ చెత్తరాజకీయాల్లో భాగంగానే వినియోగించుకోబడుతున్నాయి. ఈ రాజకీయ నాయకులకు అసలు విషయం అంత ప్రాముఖ్యమైంది కాదు. అన్యాయన్నెదిరించాలనే వారి అరుపులు మామూలే. అధికారంలో వున్న ముఠాని గద్దె దించడానికి చచ్చిన శవాలను వుపయోగించుకుంటారు వీళ్ళు. ఈ శాసన సభ్యులు ఏ కోర్టులోనో ఫిర్యాదు చేయాల్సింది. ఒక సముచితమైన మెజిస్టీరియల్ విచారణా జరిగేది వీళ్ళ రాజకీయ ప్రయోజనాలకూ బలంచేకూరేది.

విషాదకరమైన షకీలా కేసు శాంతి - భద్రతలనేవి కేవలం ఒక భ్రమేననీ, ఈ రెండూ నిజానికి ఒకదాని కొకటి ఎదురెదురు అనే చారిత్రక సత్యాన్ని చాటుతూంది.

మన సంస్కృతి

కొడవటిగంటి కుటుంబరావు

సంస్కృతి కృత్రిమమైనది. ఏ మనిషీ ఒకానొక సంస్కృతితో పుట్టడు. దాన్ని తన చుట్టూ ఉన్న సమాజం నుంచి, తనకు సాధ్యమైన మట్టుకూ, ఇష్టమైన మట్టుకూ అంది పుచ్చుకుంటాడు. సంస్కృతి సామూహికమైనదీ, పరిణామక్రమంలో ఏర్పడినదీ, బాహ్యపరిస్థితులలో మార్పులకు ప్రతిస్పందించేదీనూ. అందులో జాతి లక్షణాలూ, ప్రాంతీయ లక్షణాలూ ఉంటాయి. కాని ఒక జాతికీ, ఒక ప్రాంతానికీ చెందిన వ్యక్తులందరూ ఒకేరకం సంస్కృతి ప్రదర్శించరు. కొందరు వ్యక్తులలో సంస్కృతి చాలా దుర్బలంగా కనిపిస్తుంది. మరి కొందరు తమ సంస్కృతితో సాటి వారినీ, ఇతర జాతుల వారిని సైతం ప్రభావితులను చేయగలిగినట్టు కనబడతారు. రష్యను టాల్‌స్టాయ్, ఇంగ్లీషు షేక్‌స్పియర్, భారతీయ టాగోర్, క్రీస్తూ, బుద్ధుడూ, మహమ్మద్ - ఇలాటి వాళ్ళు తమ సంస్కృతితో దాదాపు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల వాళ్ళనూ ప్రభావితులను చేసినట్టు కనబడ్డారు. అయితే అందరి ప్రభావమూ ఒకే యుగానికి, లేక ఒకే మానవ సమాజ పరిణామ దశకు సంబంధించినది కాదు. ఈనాడు మత ప్రభావం చాలా తక్కువ; మత సంస్కృతి కూడానూ. ఈనాడు కార్ల్ మార్క్స్, లెనిన్, మావోల ప్రభావం హెచ్చుగా వున్నది. వాళ్ళ ప్రభావం పూర్తిగా ఆధునిక యుగానికి చెందినది. ఈనాడు కూడా అన్ని దేశాలలోనూ తమ మత భావాలతో ఇతరులను ప్రభావితులను చేయగలవారున్నారు. మన భారత దేశంలోని బాబాలకు దేశాంతరాలలో కూడా భక్తులున్నారు. అయితే వీరి ప్రభావం విస్తృతమైన మానవ జీవిత పరిణామానికి తోడ్పడదు. ప్రపంచానికి మత యుగం అయిపోయింది. అలాగే, ఇవాళ టాగోర్‌కన్న గొప్ప కవులు మనదేశంలో ఉండవచ్చు. కాని వారికి ఖండాంతర ఖ్యాతిరాదు. సాహిత్య సంస్కృతి ఈనాటి విశాల మానవ జీవితాన్ని ప్రభావితం చెయ్యలేదు. ఈనాటి విశాల మానవ జీవితాన్ని ముందుకు నడపగలది ఆర్థిక - రాజకీయ సంస్కృతి. దాన్ని అధునాతనంగా చేసుకొన్న జాతులు పురోగమిస్తాయి; ప్రాచీన ఆర్థిక - రాజకీయ సంస్కృతులను పట్టుకు వేళ్లాడే జాతులు వెనకబడిపోతాయి.

సంస్కృతి అనేది మానవుడి అవసరాలలో, ముఖ్యావసరాలలో ఒకటి. జీవిత సమస్యలను ఒక వ్యక్తిగాని, ఒక సమాజంగాని, ఎలా ఎదుర్కొనేదీ ఎలా పరిష్కరించుకొనేదీ ఆ జాతియొక్క, లేక వ్యక్తియొక్క సంస్కారం నిర్ణయిస్తుంది. సంస్కృతిలో యుగధర్మం ఉంటుందన్నది మనం స్పష్టంగా గుర్తించాలి. ఉదాహరణకు, ఇంకా మత యుగం

లోనే నివసిస్తున్నామనుకునే వాళ్లు ప్రపంచంలో ఉన్నారు. మనిషి దోషి అవునా, కాదా అనే నిర్ణయించటానికి మన పూర్వులు అగ్ని పరీక్షల లాటివి పెట్టేవారు – ఎర్రగా కాల్చిన కర్రులు నాకటమూ, నిప్పులు చేత్తో పట్టుకోవటమూ వగైరాలు. ఇలాటి న్యాయ నిర్ణయాలను ఈనాడు ఉత్తమ సంస్కారంగా భావించం. కాని మత ప్రాతిపదిక మీద రాజ్యాంగాన్ని నడపటానికి పూనుకున్న దేశాలలో, దొంగతనం చేసిన వాళ్ళ చేతులు నరకటమూ, రంకుతనం చేసిన స్త్రీలను రాళ్ళతో కొట్టి చంపటమూ లాటి శిక్షలను పునరుద్ధరించటం జరుగుతున్నది।

విజ్ఞానం సోకని వ్యక్తులలోనూ, జాతులలోనూ మూఢ విశ్వాసాలు కనిపిస్తాయి. వాళ్లు వైజ్ఞానికంగా ఏ యుగంలో ఉన్నదీ సులువుగా అంచనా కట్టవచ్చు. అలాగే ఆర్థిక, రాజకీయ భావాలలో వ్యక్తులుగాని, దేశాలుగాని ఎంత వెనకపడి ఉన్నదీ ఆరంగాలలో వ్యక్తుల ప్రవర్తనను బట్టి తేలికగా తెలుసుకోవచ్చు. "ప్రజాస్వామ్యం" మంత్రం ఎవరైనా జపించవచ్చు, కాని ఈనాడు మన రాజకీయ నాయకులు రాజకీయ రంగంలోనూ, ఆర్థిక విషయాలలోనూ అవలంబించే వైఖరులు చూస్తే వారికి ప్రజాస్వామ్యం గురించి ఓనమాలు కూడా రావని స్పష్టంగా తెలుస్తున్నది. ఖరీదైన కార్లూ, టీవీసెట్లూ, అణుఇంధనాలు లాగే ఆధునిక యుగపు రాజకీయ ఆర్థిక భావాలు – ఆర్థిక అసమానతలు తగ్గించటమూ, అందరికీ పనులు చూపించటమూ వగైరా – మనకన్న ముందుకు పోయిన దేశాల నుంచి అరువు తెచ్చుకున్నాం. "ప్రజాస్వామ్యం", "సోషలిజం" అన్న మాటలు చిలుకలకు కూడా నేర్పవచ్చు. వాటి అర్థం తెలియటం మాట వేరు।

ఈనాడు మనం కొత్తగా సంస్కృతిని కష్టపడి సృష్టించుకోనవసరంలేదు. ఆర్థిక అసమానతలను తగ్గించుకుని, ప్రజలందరిలోనూ రాజకీయ చైతన్యం సాంఘిక చైతన్యం ప్రమాణానికి పెంచుకున్న దేశాలున్నాయి. వాటిలో దారిద్ర్యం లేదు. దారిద్ర్యానికీ, అందరికీ పనులుండటానికి మధ్య వైరుధ్యంలేదు. ఈ యుగానికి అవి ముందున్న దేశాలు. అంటే మానవ సమస్యలను పరిష్కరించుకోవటానికి హెచ్చు సమర్థత కలిగి ఉన్నాయి. ఒకవంక ధాన్యం నిలవచేసే సదుపాయాలు లేక ఆరుబయట కుళ్లుతూంటే, ఇంకో వంక ఆకలితో చస్తున్నవాళ్లు అదే జాతిలో ఉండటంలాటి చచ్చు వైరుధ్యాలతో సతమతమయే దేశాలు వాటి నుంచి ఆధునికయుగానికి కావలసిన సంస్కృతి అంది పుచ్చుకోవాలి.

అంతేగాని భయంకరమైన సామాజిక దురన్యాయాల మధ్య, హరిజనుల హత్యాకాండ మధ్య, రాజకీయ దుర్గంధాల మధ్య మనం అభివృద్ధి చేసిన ఆటవికపు సినిమా

ప్రేమ్‌చంద్ గాంధేయుడా?

రామ్‌విలాస్ శర్మ

ప్రేమ్‌చంద్ డికెన్సు, మొపాసా, బాల్జాక్‌ల రచనలు చదివినవాడే. అయితే గోర్కీని మెచ్చుకున్నంతగా మరెవర్నీ మెచ్చుకోలేదు. జనానికి చదువు అబ్బితే గోర్కీని తమ సొంత రచయితగా ఎంచుకొనే రోజొకటి వస్తుందని శివరాణిదేవితో ఒకమారన్నాడట.

సత్యాగ్రహోద్యమ కాలంలో తన మిత్రుడికో వుత్తరం రాస్తూ, "నే నేపార్టీతో వున్నానో చెప్పమని మీరడిగారు; ఏ పార్టీతోనూ లేను. ఎందుచేతనంటారా, ప్రస్తుతం రెండు పార్టీలలో ఏ వొకటీ అసలు చెయ్యాల్సిన పని చెయ్యడంలేదు. ప్రజాకోటికి రాజకీయ వుత్తేజం కలిగించడమే లక్ష్యం చేసుకునే భవిష్యత్ పార్టీ "సభ్యుణ్ణి అన్నాడు 1923లో. జనాన్ని పక్కదోవలు పట్టిస్తున్నాడని గాంధీని విమర్శించడాని క్కూడా ప్రేమ్‌చంద్ తటపటాయించలేదు. ప్రజల పాపాలకు దేవుడు చెప్పిన శిక్ష అని బీహారు భూకంపాన్ని గాంధీ వర్ణించినప్పుడు, ప్రేమ్‌చంద్ మండిపడ్డాడు. హరిజనులను సవర్ణులు అనాదరిస్తున్నారనేది 'పాపం' గాంధీ దృష్టికి, 'వర్ణాశ్రమ స్వరాజ్య సంఘం' పేరిటి కరుడుగట్టిన సనాతన ధర్మవాదులు, గాంధీ హరిజనులచేత దేవాలయ ప్రవేశం చేయించాడు గనక దేవు డిలా శిక్షించాడనడంలేదూ, గాంధీని తిట్టి పొయ్యడంలేమా, అని తన 'హన్స్' పత్రిక సంపాదకీయంలో (1934) ఎదురు సవాలు వేశాడు గాంధీకి. భూకంపంవల్ల మరణించిన వాళ్ళంతా పాపకర్మలేనంటాడా,

---

కళను గురించీ, ఊసుపోక సాహిత్యాలను గురించీ రొమ్ము బాదుకుని, "మన సంస్కృతి" అనుకోవటం చాలా హాస్యాస్పదం అని తోస్తుంది. ఇవాళ కూడా ప్రపంచంలో శిలాయుగ "నాగరికత"లో జీవిస్తున్న జాతులున్నాయి గనక, ఎక్కడికక్కడ ప్రతి వ్యక్తీ, ప్రతి జాతీ తాను సంస్కృతి విషయంలో పురోగమించినట్టు ఆత్మవంచన చేసుకోవచ్చు. కాని శిలాయుగపు సంస్కృతి మన "నాగరిక" జీవితపు అన్ని రంగా లలోనూ ఇంకా సజీవంగా ఉన్నదన్న సంగతి గ్రహించటం మన సంస్కృతి ముందుకు పోవటానికి మొదటి మెట్టేమో? హత్యా రాజకీయాలూ, కట్నాలకోసం హత్యలూ, నేరస్థులకు ఉన్నతవర్గాల నుంచి రక్షణా, రాజకీయ పార్టీలకు కుమ్మక్కుగా గుండాలూ, నిరుపయోగమైన పోలీసు రక్షణశాఖ, ప్రజల నెత్తురు పీల్చే అధికార భక్షణశాఖ– వీటి మధ్య వ్యక్తి సంస్కృతిగాని, జాతి సంస్కృతిగాని ఎలా సజీవంగా ఉంటుందో ఊహించటం సాధ్యం కాకుండా ఉన్నది.

గాంధీ ? "నొసట బొట్లో రేఖలో తీర్చిదిద్దుకున్న నేరస్థులూ, రక్తపిపాసులూ, బాన కడుపుల ఆత్మవంచక శిఖామణులూ — వీళ్ళని చూశ్లేనంత కబోదా దేవుడు ?" మరణ శయ్య మీది నుంచి, తనకు దేవుడిలో విశ్వాసం లేదని జైనేంద్రకుమార్‌తో తెగేసి చెప్పాడు ప్రేమ్‌చంద్.

"ఎన్నికల్లో నిలిచి గెలుస్తున్న దేశనాయకుల్ని సవినయంగా అడుగుతున్నాను : మాన్యులారా, ఇలాంటి ఎన్నికలు పదులూ వందలూ వస్తాయి, వెళ్తాయి. ఒకొకప్పుడు మీరు గెలుస్తారు, మరొకప్పుడు మన్నుగరుస్తారు ; కాని మీకూ స్వర్గానికీ ఎంత దూరమో, స్వరాజ్యానికీ మీకూ అంతే దూరం" అన్నాడు (1934) దక్షిణ భారత హిందీ ప్రచార్ సభలో ప్రసంగిస్తూ. అంటే, గాంధీతత్వం ప్రేమ్‌చంద్‌కు ఎలా నచ్చలేదో, యీ ఎన్నిక మన్నికల స్వరాజ్‌పార్టీతత్వమూ అంతే మింగుడుపడలేదని అర్థం. ఇంతమాత్రన్నే ప్రేమ్‌చంద్ విప్లవకారుడనుకోవడం పొరబాటు. ప్రథమ అభ్యుదయ రచయితల మహాసభలో అధ్యక్షోపన్యాసం చేస్తూ, అభ్యుదయ రచయితల సంఘమనే పేరు అక్కర్లేదని, రచయిత ప్రతివొక్కడూ సహజంగానే అభ్యుదయవాది అని అన్నాడు. అంటే, ఆయనకు 'అభ్యుదయం' అనే మాటకుగల రాజకీయమైన విశిష్టతే బోధపడలేదనుకోవాలి. ఆయన దృక్పథమే సమగ్రం, శాస్త్రీయం కాలేదను కోవాలి.

గమనించడానికేమో ప్రజల క్షోభను బాగానే గమనించాడు ప్రేమ్‌చంద్. వారి రాజకీయ చైతన్యాన్నీ గమనించాడు. బూర్జువా - ప్రజాస్వామిక నాయకత్వం ప్రజల రాజకీయ కార్యాచరణకి ఎప్పటికప్పుడు అడ్డంకులు కలిగిస్తూ 'సత్యాగ్రహ' పోరాటానికి 'నైతిక' ప్రమాణాలు విధిస్తూ వచ్చిన రోజుల్లో ప్రేమ్‌చంద్ రచనలు విమర్శాత్మక వాస్తవవాద పద్ధతికి మేలినమూనాలై సమకాలిక వాస్తవాన్ని చిత్రించాయి. ముఖ్యంగా గమనించదగింది, అనాటికింగా కార్మికవర్గం రాజకీయంగా బలీయమైన శక్తి కాలేదు. తాను పుట్టి పెరిగిన గ్రామీణ జీవిత ప్రభావం నుంచి ప్రేమ్‌చంద్ పూర్తిగా బయట పడక, రైతాంగ మనస్తత్వాన్ని పూర్తిగా విడిచెయ్యక, రష్యాలో టాల్‌స్టాయి చేసినట్టే, సన్యాసాన్నో సేవాధర్మాన్నో నిస్పృహనో వూహాస్వర్గాన్నో శరణుజొచ్చుతూ వచ్చాడు. కథనానికీ పరిష్కారానికీ మధ్య ప్రేమ్‌చంద్ రచనల్లో కనిపించే వైరుధ్యానికి మూల కారణం యిదే.

భూస్వామిక సమాజంలోని అక్రమాల్నీ చెడుగుల్నీ చీల్చి చెండాడుతూనే, చితికిపోయిన రైతులెలా చివరికి తమ వర్గశత్రువుల నిరంకుశ క్రౌర్యానికి గత్యంతరం

లేక తలవంచుతారో 'ప్రేమాశ్రమ్'లోని కాదిర్ పాత్రలో చూపాడు. ఈ క్రౌర్యాన్ని ఎదిరించడంలో సత్యాగ్రహ పద్ధతి విఫలమైనట్టు నిరూపించిన ప్రేమ్‌చందే, ప్రేమ్ శంకర్ స్వార్థత్యాగ ఫలితంగా ఆనందమయమైన శ్రమజీవన స్వర్గ మొకటి విప్పారినట్లు వర్ణించాడు కూడా. అలాగే, స్త్రీ స్వాతంత్ర్య సమస్య విషయంలోనూ, ప్రేమ్‌చంద్ వప్పులో కాలేశాడనాలి. 'సేవాసదన్'లో సుమన్ ప్రశ్న— తన శరీరాన్ని అమ్ము కునే స్వేచ్ఛ సాధించుకుంటే తప్ప యీ సమాజంలో స్త్రీ ఎందుచేత గౌరవం పొంద కుండా వుంటూంది?— పురుషాధిపత్యానికి సవాలే. అయితే దీనికి పరిష్కారం? స్వేచ్ఛ సేవాసదనంలోనే లభిస్తుంది గాని మరోచోట కాదు. ఇదేం పరిష్కారం? అంటే, స్త్రీ స్వాతంత్ర్యాన్ని అభిలషించినంత బలంగా ప్రేమ్‌చంద్ స్వాతంత్ర్య మార్గాన్ని చూసి, చూపలేక పోయాడన్న మాట.

జాతీయ బూర్జువా వర్గానికి భావప్రతినిధి అయిన కాంగ్రెసులో ఆ వర్గంలో లాగానే అభివృద్ధిని కోరే దొకటి, అమ్ముడై రాజీపడే దొకటిగా రెండు విభాగాలు తలెత్తసాగాయి. పర్యవసానంలో గాంధీతత్వం రెండోదానికే ఉనికి వచ్చింది. సత్యాగ్రహపోరాటాలన్నీ కొద్దిపాటి రాయితీలతో అంతం కావడం యిందుచేతనే. ప్రేమ్‌చంద్ గొప్పనవల 'రంగభూమి'లో రాజామహేంద్రప్రతాప్‌సింగ్ బడాభూస్వామి, అయినా మాపెద్ద మనిషిలా కనిపిస్తూ, ఎంతో దొడ్డభావాలతో మరెంతో సరళ జీవనంతో జనాన్ని బురిడీకొడ్తూ, మునిసిపల్ చైర్మనై పోతాడు. ఈ మహాశయుడు కమ్యూనిజాన్ని కూడా అభిమానించగలనంటాడు గాని, గుడ్డివాడైన సూర్‌దాస్ శాంతికి భంగం కలిగి స్తున్నాడంటూ అతణ్ణి తిప్పలు పెట్టడానికి వెనుదియ్యడు. వినయ్‌సింగ్ అని మరో 'దేశభక్తుడు' రాజస్తాన్‌లోగల అధికారులందరి తలదన్నేంతగా జనాన్ని భయ బీభత్సాల పాలు జేసే ఘనుడు. 'కాయకల్ప' అనే రచనలో, 'అస్పృశ్యులు' కొందరు బ్రిటిష్ సిపాయీల చేతుల్లోంచి రైఫిళ్ళు గుంజుకోబోతుంటే, వాళ్ళ దాడిని పక్కదోవకు తిప్పుతాడు. పాపం పుణ్యం తెలీని అమాయక రైతు ధిక్కరించాడని వాణ్ని చంపిన ప్రబుద్ధుడు చక్రధర్. 'గబన్'లో రామానాథ్ చేసిన ఘనకార్యం నమ్మకద్రోహిగా మారి పోలీసు ఏజంటై టెర్రరిస్టుల్ని కొందర్ని పట్టించేందుకు తోడ్పడతాడు. కలకత్తా ఈ రామ్‌నాథ్‌కు ఆశ్రయ మిచ్చిన దేవీదీన్ ఇద్దరు బిడ్డల్ని పోలీసులకు బలియిచ్చి కూడా గుండె ధైర్యం సడలని వృద్ధుడు. రామ్‌నాథ్ మొగం వాచేలా చీవాట్లు పెట్టడమే గాక, జాతీయోద్యమ నాయకులను దుయ్యబట్టుతాడు: "గొప్ప వాళ్ళో తక్కువవాళ్ళో ఎవళ్ళైనా, అందరూ అంగరంగ వైభోగాలలో మునిగిపోయినోళ్ళే. అయినా దేశ దాస్యం వదలగొడుతామనే పగ్గెలకు మాత్రం కొదవలేదు. దాస్యం వదలగొడుతారు,

చూడమూ ? ముందుగా మీ దాస్యం నుంచి బయటపడండి. పేదల నోళ్ళుగొట్టి బ్రిటిషోడి జేబులు నింపే వృత్తి మీది. ఈ దేశంలో మీరు అవతారమెత్తడానికి కారణమిదే. కానీండి, విదేశీ సారా మస్తుగా తాగండి, విదేశీ కార్లలో జోరుగా పొండి, విదేశీ మిఠాయిలూ వూరగాయలు బాగా చవిజూడండి, విదేశీ ప్లేట్లలో ఆర గించండి, విదేశీ మందులు సేవించండి, యింతా చేస్తూ, దేశం కోసం మీ కన్నీరు కాలవలు గట్టించండి. అయితే యీ యేడుపులవల్ల వొరిగేదేమీ లేదు. చంటిబిడ్డ గుక్కబెట్టితే కన్నతల్లి చన్ను గుడుపుతుంది, గాని సింహం తన బలిజంతువుపట్ల జాలి చూపదు. జాలిగుండె ధర్మబుద్ధిగలవాడి వద్ద యేడవండి మీరేడ్చే యేడ్పులన్నీ. బెదిరించీ అదిరించీ మీరు పూడబొడిచేదేవిఁటి ? బలంలేని బెదిరింపులను ఖాతరుచేసే వాడెవడు ? ఇక్కడే ఒక పెద్ద మీటింగు జరిగింది వెనకెప్పుడో. పెద్దమనిషెవరో గాని, యిటు గెంతీ అటు యెగిరీ హంగామా చేశాడు. దిగివచ్చాక, నేనడిగానతన్ని- 'స్వామీ' నిజం చెప్పండి, తమరు స్వరాజ్యం గురించి మాట్టాడేప్పుడు మీ కంటికి కనిపించేదేమిటి ? తమరూ పెద్దపెద్ద జీతాలు తీస్తారు, తమరూ యింగ్లీషోళ్ళలా పెద్ద పెద్ద బంగళాలలో వుంటారు, ఇక్కడ వేడి ఎక్కువైతే కొండలకెడుతారు; యీ స్వరాజ్యంవల్ల దేశానికేంలాభం ? తమర్తూ తమవంటోరూ హాయిగా బతుకులు వెళ్ళ బుచ్చుకుంటారు గాని దేశానికేమీ వొరిగేదుండదు. ఈ మాటలు విని అతగాడు దిక్కు తోచక తల యిటూ అటూ తిప్పాడు. రోజుకైదుసార్లు తిన్నాలని- అందుట్లోనూ రాజ భోజనం తినాలని- మీకుంటుంది; ఒక్క రైతుకి రోజుకొక్కమారైనా బొరుగులు కూడా దొరకవ్. వాడి నెత్తురూటి గొర్మెంటు మీకు సౌకర్లు చూపుతూంది. అతగాడి విషయం యెన్నడైనా ఆలోచిస్తారా మీరు ? ఈ రాజ్యం యింకా మీది కాలేదు గనక జల్సాల కోసం ఖుషీకోసం యింతగా ఆరాటపడుతున్నారు. మీ రాజ్యమే వస్తేనా, పేదసాదల్ని దుమ్మూ ధూళిగా మార్చబోతారు."

సత్యాగ్రహోద్యమాల పేరిట తంతులా సాగుతూ వచ్చిన జాతీయోద్యమం ప్రజాసామాన్యంలో ఎంతగా నిరాశ కలిగించిందో, అంతగా దాని నాయకుల వర్గ స్వభావం గురించి కళ్లు తెరిపించింది. అప్పటికే ప్రేమ్‌చంద్ కళ్లు తెరుచుకో సాగాయి. తన తొలినవలలో వూహాలోక పరిష్కారాల పట్ల తనకే మొహం మొత్త సాగింది. ఇలాంటి నాయకులే గనక రేపట మాపట రాజ్యాధినేతలైతే జనంగతి యేంగాను ? 'కర్మభూమి'లో అమర్‌కాంత్ పైకేమో రైతాంగ పక్షపాతి గాని, తనతో కలిసి పనిజేస్తున్న ఆత్మానంద్‌కు ద్రోహం చేస్తాడు. 'గోదాన్'లో రాయిసాహెబ్

గొప్ప ఆసామీ, అయినా జిత్తులమారి, రెండునాలికల మనిషి, ఘాతుకుడు. మెహతా వంటి పాత్రల ద్వారా యీ పురానా మనుషుల అసలు రూపును చూపెట్టినా, రైతులు సంఘటిత మౌతున్నట్టుగాని, తమ కోర్కెల సాధనకు క్రమబద్ధమైన పోరాటపద్ధతి పట్టుతున్నట్టుగాని కనిపించరు.

కార్మికోద్యమం రంగంమీదికి వచ్చి పోరాటాలు జరపసాగిన కాలంలోనైనా ప్రేమ్‌చంద్ రచనలు యీ వాస్తవాంశను చూపెట్టక పోవడం యాదృచ్ఛికమేనా? కాదు. సన్నకారు రైతాంగ దృక్పథం నుంచే ఆయన 1920 - 1930ల జీవిత వాస్తవాన్ని పరిశీలించాడు, విమర్శించాడు. తన చివరి వ్యాసాలలో ముఖ్యమైన 'మహాజనీ సభ్యత' (బూర్జువా నాగరికత)లో వెనక నాళ్ల విలువల గురించి తపన చెందుతున్నట్టు తోస్తుంది. ప్రేమ్‌చంద్ చివరి నవల 'గోదాన్'లో నాయకుడైన హోరీ, బాధలు పడుతూ కష్టాలకు నష్టాలకు తలవంచడానికే పుట్టాడా అనిపిస్తాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం మూలాన ధ్వంసమైపోయిన సమిష్టి కుటుంబం గురించే హోరీ ఆలోచిస్తాడు. ప్రేమ్‌చంద్ రచనల్లోని 'అస్పృశ్యులూ' యింతే. 'అగ్ర'కులాల జబర్దస్తీకీ వడ్డీవ్యాపారుల దోపిడీకీ ఎదురుతిరగడంగాక, తలలు అప్పగిస్తారు. ప్రతిఘటన కనిపించదు. 'కఫన్' (శవాచ్ఛాదన)లో పనిదొంగలుగా కనిపించే అబ్బా కొడుకుల పాత్రలు యీ క్రియా శూన్యతనే చూపుతాయి.

సాహిత్యపరంగా, రచయిత తాను నమ్మిందాన్ని తన రచనల్లో నిండుగా నిబ్బరంతో ప్రదర్శించాలని చాటిన ప్రేమ్‌చంద్, భూస్వామిక విలువల్నీ బూర్జువా కపటత్వాన్నీ ఎండగట్టి, రైతాంగం తాలూకు దైన్యాన్నీ అలసత్వాన్నీ చూపెట్టాడు. కార్మికవర్గ నాయకత్వంలో తప్ప రైతాంగ పోరాటాలు వ్యావసాయిక విప్లవానికి దారి తియ్యవని తాను గ్రహించలేదు. ఇదే ప్రేమ్‌చంద్ రచనలలో పెద్ద బలహీనత. ఆ కాలానికి దాన్ని మీరి పోవడం కూడా కష్టమే.

('ఇండియన్ లిటరేచర్' నవంబర్ 2, 1952లోని
వ్యాసానికి సంక్షిప్త, స్వేచ్ఛానువాదం)

బీరు, బ్రాంది విదేశీ పానీయాల్ల రుచికీ
కన్నీటి వగరు అందనిది—

— ఎ. ఎన్.

"గూండా ఆర్డినెన్సు"

జుగాష్విలి

గూండాలు తెచ్చినారు
గూండా ఆర్డినెన్సు
గూండాలను వదిలిపెట్టి
నిన్నూ నన్నూ ఖైదుచేయ ॥గూండాలు॥

పల్లెల్లో రైతుకూలి
కూలి పెంచమనరాదు
అడిగిన ప్రతివాడూ
గూండాయే అవుతాడు
ఫ్యాక్టరీలో కార్మికుడు
సమ్మెచేయ వీలులేదు
న్యాయమడిగిన చాలు
గూండాయే అవుతాడు ॥గూండాలు॥

ప్రగతిశీల ఉద్యమాల్లో
పాల్గొన్న విద్యార్థీ
ప్రజల గూర్చి చెప్పేటి
ప్రజాతంత్ర మేధావీ
గూండాయే అవుతాడు
రిక్షా తొక్కే రాజన్న
రాళ్ళు మోసే రాములన్న
సోడా కొట్టు సాంబన్న
గూండాయే అవుతాడు ॥గూండాలు॥

గొంతెత్తి నినదించే
ప్రతి గొంతూ నులిమేసి
పిడికిలెత్తి పోరాడే
ప్రతి చేయీ నరికేసి
చిన్న పెద్ద ఉద్యమాల
అన్నిటిని అణిచివేసి
మిలిటెంటూ లీడర్లను
మట్టుపెట్ట దలచి ॥గూండాలు॥

గూండాలకు నాయకుడా
కలవారికి బానిసోడా
మీ అన్నా హిట్లరయ్య
మీ అక్కా యిందిరమ్మ
ఏమయ్యేను వారిబతుకు
వారికంటె మేటికావు
వారిలోనే చేరతావు ॥గూండాలు॥

ప్రజా శత్రువులంత
కాగితాల పులులే
పోరాడే జనమంతా
కదనరంగ యోధులే
పీడితులూ తాడితులూ
ఒక్కటిగా నిలుస్తారు
పీడకులను పాలకులను
తరిమి తరిమి కొడతారు ॥పీడకులగు॥

బండ కింది బతుకులు

హుస్సేన్

సింగారేణి సీటీ వీని
సలీ కూడు సగం దీని
తట్టా చెమ్మ చేసూ కోని
తలకు టోపి పెట్టు కోని
బాయీ పనికి నువ్వు బోతివో....
ఓ లాడీసన్న
బండా కిందికి నువ్వు బోతివో....
ఓ లాడీసన్న ॥సింగా॥

గర్మిఉన్న ఫేసీలోన
మందువాసన పొగాలోన
భగ్గా భగ్గ పెయ్యి మండ
ఖాదా నంత ఓర్సూకోని
బొగ్గూతట్ట నువ్వు మోస్తివో....
ఓ లాడీసన్న
టబ్బాలన్ని నింపుతుంటివో....
ఓ లాడీసన్న ॥సింగా॥

తాగానీకి నీల్లు లేక
రేసు ఎక్కొ ఓసల్లేక
బరువూ తట్ట మోసూడయ్యె
బాదాపడుట ఎక్కువయ్యె
నేలా జారి కూల బడితివో....
ఓ లాడీసన్న
నెర్రి బాడి కూల బడితివో....
ఓ లాడీసన్న ॥సింగా॥

గ్రేడీయంటు బాయీలోన
వంగూ తట్ట సీమూలోన
బొగ్గూతట్ట ఎత్తూకోని
వంగూకొంట మోతా మోస్తు
వీపు మీద తట్ట మోస్తివో....
ఓ లాడీసన్న
ఈడ్సూకుంట తట్టమోస్తి వో....
ఓ లాడీసన్న ॥సింగా॥

కండాలన్ని కరుగుతుండ
పెయ్యంతా వనుకుతుండ
రక్తమంత సెమటకాంగ
బొగ్గూదుమ్ము మింగుకుంట
డ్రిల్లా మిషను నువ్వుబడ్తివో....
ఓ కమానన్న
బొగ్గూ పొక్క లేయుచుంటివో....
ఓ కమానన్న ॥సింగా॥

బొగ్గూ బిల్లు తెగక పాయె
బండా బిల్లు లేక పాయె
బండా కట్టు తెగక పోతె
బత్తి ఏగి పడకపోతె
బాయీ దొర నిన్నే తిట్టెనో....
ఓ కమానన్న
నాగాబెట్టి ఏడిపించెనో....
ఓ కమానన్న ॥సింగా॥

ఊపిరేమొ ఆడాకుండ
బుజం తోలు ఊడుతుండ
ఇనుపరోల్లు మోసూకుంట
రేసూలెన్నో ఎక్కి మోస్తె
యాక్టింగూ దొరుకదాయరో....
ఓ మజ్దూరన్న
బాంచెబతుకు బతుకుడాయరో....
ఓ మజ్దూరన్న ॥సింగా॥

రోల్లూ మోసి – రాల్లూ మోసి
తుంటా మోసి – పెంటా మోసి
మలువ మోసి – మట్టీ మోసి
ఇసుకా మోసి – సున్నం మోసి
సపాయోల్ల పనూలాయరో....
ఓ మజ్దూరన్న
సచ్చూకుంట చేసుడాయరో....
ఓ మజ్దూరన్న ॥సింగా॥

కాళ్ళ బూట్లు లేకాపాయె
కాలీటబ్బులు కరూవాయె
బాయి పనీ బతుకులన్నీ
బాంచె బతుకు లైయీపాయె
ఏ లీడరోడు అడుగడాయెరో....
ఓ కార్మికన్న
బాయీ దొరలు బలిసీపోయిరో....
ఓ కార్మికన్న ॥సింగా॥

ఊరీ దొర – బాయీ దొర
లీడారోడు – సర్కారోడు
దోసూకొనె దొంగలంత
ఏడావున్న ఒక్కటేను
దోపిడోళ్ల రాజ్యమాయరో....
ఓ కార్మికన్న
దోపిడోడు తోడురాడురో....
ఓ కార్మికన్న ॥సింగా॥

ఊరూకుంటె ఏమీరాదు
పోరాకుంటె మారాబోదు
కూలీలంత కూడూకోని
పోరూలోన చేరూకోని
కూలీరాజ్య మెచ్చుకొరకురో....
ఓ కార్మికన్న
దోపిడోళ్ళ మట్టూబెట్టరో....
ఓ కార్మికన్న
దండూలోన జెండా ఎత్తరో....
ఓ కార్మికన్న
దమ్మూజూపి దుమ్మూదులుపరో....
ఓ కార్మికన్న
ఎరుపూ జెండా ఎత్తిబట్టరో....
ఓ కార్మికన్న
పోరూబాట మరిచీపోకురో....
ఓ కార్మికన్న
రణమూతోనె రాజ్యమొచ్చురో....
ఓ కార్మికన్న

టబ్బులు : లాడీసులు, రేసు : పైకి, నెర్రిబాడి: అలిసిపోయి, గ్రేడియంటు : ఎక్కువ ఎత్తువంపు, డ్రిల్‌మిషన్: కోల్ కట్టింగ్‌మిషన్, కమానన్న: కోల్‌కట్టర్, రోల్లు : (రేల్స్) లైనుపట్టాలు.

ప్రగతి పాట

రేగులపాటి కిషన్‌రావు

ప్రజల ప్రగతికుపకరించు
పాట మనం పాడుదాం ॥
నేలదున్ని నాటువేసి
పంటలు పండించువారు,
యంత్రాల్లా పనులుచేసి
ఉత్పత్తులు పెంచువారు
దోపిడీకి గురియవుతూ
దరిద్రులుగ వున్నారని ॥ప్ర॥

కర్షకులకు, కార్మికులకు
కూలిచేయు ప్రజావళికి
తగినకూడు, గుడ్డలేక
బాధలు పడుతున్నారని ॥ప్ర॥

ఒళ్ళువంచి పనులుచేయు
కర్షకులకు పొలాలు;
వస్తువులను సృష్టించే
పనివారికి పరికరాలు;
చెందాలని అందాలని
ప్రగతివాదు పొందాలని
ప్రజల ప్రగతికుపకరించు
ఈ పాటే పాడుదాం
పాడుదాం పోర్లాడుదాం.

తూరుపు

ట్రిగ్గర్

జీతం పెంచమని అడిగినందుకు
మా యజమాని
పనిలోంచి తీసేశాడు
చీదరించుకొని
పైగా, అంటాడూ
తూరుపు తిరిగి దణ్ణం పెట్టమని
వెర్రి వెధవ,
వేళాకోళంగా అన్నా
మంచి మాటే చెప్పాడు
వాడి అంతు తేల్చడానికి
వాడే నాకో మార్గం చూపించాడు.

పేగుల అరుపు

కె. విజయలక్ష్మి

కూలి పెరిగిందోయి
కొదవేమి నీకని
ఆసాములంటారు
రూక కొచ్చేదెంత చిలుకా ?!
కడుపు నిండేదెట్ల చిలుకా!
రూపాయిలో శక్తి
మా బతుకులా మారె
ఎంత కష్టం జేసినా చిలుకా!
నిత్తె పస్తులు గాదె చిలుకా!
ఉన్న రోజున తింటావు
లేని రోజున పంటావు
నీకేమి బాధనీ దొరగార్లు అంటారు
పేగులరిసే అరుపు చిలుకా!
వారికే మెరికెలే చిలుకా!

ధరలు పెరిగాయని
సౌకారి అంటాడు
ధరలు తగ్గాయని
సర్కారు అంటదీ
ఈ మాయగాళ్ళ మద్దె చిలుకా!
నలిగి చస్తున్నామె చిలుకా!

మేము జేసే మంచి
మీ కంద కుండాను
మధ్యనున్న వోళ్ళు
అడ్డు తుండారనీ
సర్కారు అంటదీ చిలుకా!
సర్కారుకేమడ్డు చిలుకా ?!
ఇట్టి సర్కారు మనకేల చిలుకా!

మాయగాళ్ళా మాయకు
మోసపోవద్దనీ
కూలోళ్ళు పేదోళ్ళు
కలిసి మెలిసీ వుండి
పోరు జెయ్యాకుంటే
కష్టాలు పోవనీ చిలుకా!
పేట పేటకు జెప్పు చిలుకా!

ఆకాశపు మూసల్లో

జగన్మోహన్

ఆకాశం
దానిమ్మ పండులా పగిలి
అందులోంచి
ఎఱ్ఱగా
భవిష్యద్బీజాలు-

కరుగ్రి కొన
కారు కొన
కోన కోనలా
రంగు రుచి వాసన
ధ్వని స్పర్శల కొత్తప్రపంచం-

అజ్ఞాతం లోంచి
అంధ దేముణ్ణి కాక
ఆశల ఇంద్రధనుసుల్ని
అందుకోగల
ఎఱ్ఱకణాల వెలుగు ప్రపంచం-

గుండు గుండుకూ
చుక్కల్లా
నేల కొరుగుతూ
పీడితులకై
జ్వలిస్తూ
కరిగి
ఆకాశపు మూసల్లో
రూపు దిద్దుకుంటున్న
బావుటాలు!
తూటాలు!

స్ట్రైక్

బి. టి. రామానుజం

రోజూ దుమ్ము రేపుకొంటూ, గుడిసెను దాటిపోయే లారీలు ఇవాళింకా రాలేదు. "ఏటయినాదో-" అనుకొంటూ నీలి బయట పడేసున్న నులకమంచం మీద కూర్చొంది.

దూరంగా కొండ కనబడుతోంది చిన్నచిన్న అగ్గిపెట్టెల్లా కనబడుతున్నాయి లారీలు. మధ్యాన్నం పన్నెండు గంటలయింది. ఎండ విపరీతంగా ఉంది. కొంచెం లోటాతో నీళ్ళు తాగి- 'అయ్యేటయినాడో సూడాల- అంత దూరవెళ్తే ఏటంటాడో-' అని ఓక్షణం ఆలోచించింది. 'లేపోతే ఆళ్ళంతా కలిసి లారీలెక్కి ఎళ్లిపోతారేటో ?'

ఆరేళ్ళ చిన్న పిల్లకు అర్థం అయే విషయాలు తక్కువే అయినా మూడు నాలుగు రోజుల్నుంచి ఏదో గోలగోలగా అన్పిస్తోంది సొమ్ములు చాల వంటున్నాడు అయ్య. మిగతా వాళ్ల అగ్గయిపోతున్నారు.

నడుస్తుంటే కాళ్లు కాలిపోతున్నాయి, నిప్పుకు కాళ్లు అంటుకు పోయినట్లుగా. కళ్లుతిరిగి పడిపోయేది. పరుగు పరుగున వెళ్లింది.

కొండ పక్కన ఒక పక్కంతా తవ్వేసి వుంది. పక్కనే పెద్ద షెడ్డు లాంటిది ఒకటి వేశారు. మిషను మోత హోరుమని. కొండ తవ్విన రాయి షెడ్డులోకి వెళ్తుంది. అక్కడ మిషను వాటిని కావల్సిన సైజులోకి మారుస్తుంది. తయారయిన రాళ్ళముక్కలు లారీల్లోకి ఎత్తుతారు. అవి లారీల్లో ఐదుమైళ్ల వతలున్న చోటకు వెళ్తాయి. అక్కడ వాటినేం చేస్తారో నీలికయితే తెలీదు. అక్కడేదో పెద్దది కడుతున్నారట- అని మాత్రం ఆపిల్లకెరుక.

తట్టలన్నీ కింద పడేసున్నాయి.

జనాలంతా ఓవారన కూర్చుని వున్నారు. ఎండకి ఒళ్ళంతా చెమటలు పట్టేసి నల్లగా మెరుస్తూ కనబడుతున్నాయి. వాళ్ల దెచ్చుకొన్న చద్దిమూటలు ఇంకా విప్పకుండా అలానే వున్నాయి. నీలి గభాల్న పోలయ్య దగ్గరకు పరిగెత్తింది.

"ఏటయింది-" అని చిరాగ్గా అరిచేడు పోలయ్య.

"ఇయాల లారీల కదల్లేదని...." భయం భయంగా గొణిగింది నీలి.

"ఆ ఎల్తాయి, ఎల్తాయి. అద్దరూపాయి కాడ బేరం కుదిరి సావటం నేదు గానీ...." పోలయ్య కూడా గొణుక్కున్నాడు. అతనిప్పటి దాకా లారీలో కూర్చుని కూర్చుని విసుగెత్తి కిందకు దిగి చార్మినార్ సిగరెట్టు వెలిగించాడు. ఆకలికి కాబోలు నాలుగుదమ్ములు లాగేసరికి తల దిమ్మెక్కింది కడుపులో తిప్పింది.

ఎప్పుడో ఒక్కసారి కాబోలు పోలయ్య సీలిని లారీలో కూర్చోపెట్టి తీసికెళ్లాడు. దారి పొడుగునా రాళ్ళగుట్టలు, దారి మహా అయోమయం-ఇరుకు, అక్కడ లారీ తోలటం చాల కష్టం. వెళ్తూవెళ్తూ గొయ్యిలో పడి సగం తిరగబడింది. ఆ తర్వాత ఎప్పుడూ ఆ పిల్లను లారీలో తీసికెళ్ళ లేదతను.

కంటాక్టరు కనకారావు ఇందాకణ్నుంచి అరిచి అరిచి లాభం లేదనుకున్నాడు. "అయితే ఏం చేస్తారో చావండి" అన్నాడు.

"సమ్మె –" అన్నారు.

అలా అన్న తర్వాత అతనికి దిగులు పట్టుకొంది. ఐదుమైళ్ళవతలకు లారీల్లో రాళ్ళు చేర్చడం ఓ పెద్ద తలనొప్పి వ్యవహారం. దీనికి తోడు కట్టబోయే ప్రాజెక్టు పదేళ్ళలో పూర్తయిపోవాలి. లేకపోతే ఎంత నష్టమో లెక్కకట్టుకొని మరీ చూశాడు.

పొద్దున్నుంచీ లారీలు కదల్లేదు. రాళ్లు కొట్టలేదు. మిషన్లు ఆడలేదు. పనికి పనీ పాడయింది. జనాలు మొండిగా కూర్చుని రేటు పెంచమంటున్నారు. కనకా రావుకు ఇవాళ అనుకోకుండా కొత్తగా నెత్తిమీద కొచ్చింది కాదిది. అయితే ఏం చెయ్యాలో అతనికి తెలీకపోవటం వల్ల చిరాకుగా వుంది.

అక్కడంతా కలిసి ఓ నూటయాభై మంది ఉన్నారు. కొంతకాలం పోయి పని ఎక్కువయితే ఇంకో రెండొందల మంది కావల్సి వుంటారు. వీళ్ళందరికీ రేటు పెంచి పారేస్తే ముందు ముందు ఏమవుతుందో?

ఇదివాళుండి రేపు అయిపోయే పనయినా బావుండును, పెదవరి నాలుగ్రాయలు పోయాయి అనుకోడానికి. పెట్టుకొన్న కంటాక్టే ఇలాంటిది. ఐదుమైళ్ళ దూరం రోడ్డు బావుండి చచ్చినా అదోదారి. కొట్టిన రాళ్ళను కొట్టాలి. తయారయినవి గంపల్లో ఎత్తించి లారీలోపోసి మళ్ళీ అక్కడ దింపాలి. మెయిన్ రోడ్డు దాకా వెళ్ళి పోతే ఆ తర్వాత ఎలాగయినా లారీలు వెళ్ళిపోతాయి అయితే చిక్కంతా రాయి ఇక్కణ్నుంచి అక్కడి కెళ్ళేదాకానే. ఈ ప్రాజెక్టు పదేళ్ళనుకొంటే ఇంకా ఇంకా సప్లైచెయ్యాల్సిన టెండర్లు పెరిగిపోతున్నాయి.

కారేజీ తినేసి కూర్చున్నాడతను. పాకలో చల్లగానే వుందిగానీ బయటనుంచి వేడిగాలి వీస్తోంది.

పెద్దగా హారన్ వాయించుకొంటూ వచ్చి ఆగింది జీపు.

చిట్టబ్బాయి కూలింగ్ గ్లాసులు తుడుచుకొంటూ దిగాడు.

"ఏంటయింది పెండరు?" అన్నాడు కనకారావు.

"పెండరు రాకే మవుతుంది_"

"అవును మన బొక్క బద్దలయిపోతోంది. చూసిచూసి దీల్లే కెవడు దిగుతాడునో"

చిట్టబ్బాయి చుట్టూ చూశాడు.

"ఏం మనుషులు బొమ్మల్లా కూర్చున్నారు?" అన్నాడు చివరికి.

"నా బొంద స్ట్రయికంట. వాళ్ళ రేట్లు పెంచక పోతే రారుట_ ఇదో పెద్ద నరకం అయికూర్చుంది నాకు_"

"సర్లే నువ్వింటికిపో ఇవ్వాల్టికి_"

"నువ్వేం చేస్తావు?" అన్నాడు కనకారావు.

తమ్ముడు ఇంజనీరు. ఇద్దరూ కలిసి కంట్రాక్టులు చేస్తున్నారు.

"అదేనేనూ చూస్తున్నాను. ఈ గొడవేదో పర్మినెంటుగా తీరిపోయే మార్గం కోసం చూస్తున్నాను. దాంట్లో లాభమే గానీ నష్టం వుండ కూడదుగా, అందుకే జంకుతున్నాను"

కనకారావు జీపుఎక్కి వెళ్లి పోయాడు.

చిట్టబ్బాయి తాపీగా సిగరెట్ తాగుతూ రెస్ట్‌తీసుకొంటూ కూర్చున్నాడు. కాసేపటికి ఎవరో వచ్చారు.

"అయితే సెలవు తీసుకోమంటారా అయ్యగారూ_" అంటూ_

"మాకూ కొంచెం ఆలోచించుకోవాలా? వెళ్ళండి ఇవాళిలుకి పనీలేదు పాడూలేదు"

పోలయ్య నీలిని భుజాన ఎత్తుకుబయల్దేరాడు.

ఆవేళ జనాలంతా ఇళ్ళకెళ్లి పోతున్నారని మాత్రమే అర్థమయింది నీలికి. ఆ తర్వాత ఇంకో రెండు రోజులు రోడ్డుమీద లారీలు వెళ్ళలేదు. చిట్టబ్బాయి జీపు మాత్రం రోజుకు మూడు నాలుగు సార్లు వెళ్తూ కన్పించేది.

పొద్దున్నే తెలతెలవారుతుంటే బళ్ళ చప్పుడు వినిపించింది. లేచి చూస్తే పక్కలు లేని లారీలు భారంగా కదులుతున్నాయి, వాటిమీద ఇనప సామాన్లు నిండా వున్నట్లు కన్పిస్తున్నాయి.

పోలయ్య కూడా మళ్లీ వెళ్లాడు. "కంట్రాక్టరు బాబు కొత్త పనేదో మొద లెట్టాడు" అన్నాడు ఎవర్తోనో.

నెల రోజులు జోరుగా మనుషులు లారీలు ఇనపసామాన్లు. కరెంటు స్థంబాలు పాతినట్లు పెద్దపెద్ద స్థంబాల్లాంటివి వేస్తున్నారు. బారుగా రోడ్డున్నంత బారూను. మిషనున్న దగ్గిర పెద్దటాంకు కట్టినట్లు ఏదో కడుతున్నారు.

ఇంకోనెల అయింది.

రాత్రియే సరికి వచ్చాడు పోలయ్య. వస్తూనే బయటున్న నులక మంచాన్ని గట్టిగా తోసేస్తూ;

"లంజకొడుకులు" అన్నాడు.

ఏమయిందో నీలికి తెలీదు. మర్నాటి నుంచీ లారీలు తిరిగినట్లు కన్పించలేదు. ఆ రోజు పొద్దున్నుంచీ తండ్రి రాలేదు. మంచం మీద పడుకొని ఆకాశంలోకి చూస్తోంది. కొంచెం దూరం నుంచి పైన అంతా పెద్ద గొట్టంలా కట్టారు. అలా అది తీగలా కొండల దారి నుంచి బయటకి ఎక్కడికో వెళ్తోంది. అదెందుకు కట్టారో నీలికయితే తెలీదు.

సాయంత్రం అవుతుంటే పైనుంచి ధూళి నెమ్మదిగా కిందకు పడింది. కళ్ళు నులుముకు చూస్తే గొట్టంలో నీలికి కన్పిస్తున్న బెల్టు చప్పుడు చేస్తోంది. కంకర రాళ్ళు వేగంగా ప్రవాహంలా వెళ్ళిపోతున్నాయి. మిషను దగ్గిర లోడింగ్ అయిన రాళ్ళు ఐదుమైళ్ళ అవతలకి కన్వేయర్ బెల్ట్ మీద ప్రయాణం చేసి వెళ్తున్నాయి. చిట్టిబాబు పీడ వొదిలించుకోడానికి ఖర్చయినా ఓ పద్ధతి తయారు చేసాడు- ఏళ్ళ తరబడి మనుషుల ఖర్చు లేకుండా.

పోలయ్య రెండు మూడు రోజులకోసారి వచ్చేవాడు.

నీలికి చెవులు పగలూ - రాత్రి చప్పుడుతో నిండిపోతున్నాయి. అంతకాలం వున్న జనాలందరి బదులూ పైన కట్టిన యంత్రం లాంటిది సమస్య తీర్చేసిందన్న విషయం లీలగా అర్థమయిందామెకు. మూడు నాలురోజులకు గానీ ఇంటికి రాలేక పోతున్న తండ్రి స్థితికి ఈ ఘాతమే కారణం అన్న విషయం తోస్తే ఆమెకి పిచ్చి పట్టినట్లయింది.

ఎప్పుడయినా హోరున వానపడితే ఉరుములు చప్పుడు వినిపించినప్పుడు, పిడుగులు పడినట్లు చెవులు బద్దలయితే ఆ పిడుగులు ఆ బెల్టుమీద పడి విరిగిపోతే- మళ్ళీ అయ్యకి ఇక్కడే పనొస్తుందని దేవుణ్ణి బతిమాలుకునేది. మెరుపుల వెలుగులో ఆ కన్వేయర్ బెల్టు తళుక్కున కనిపిస్తే గుండె ఝల్లుమనేది.

రోజూ ఖాకీబట్టలు వేసుకొన్న వాళ్ళు వెళ్తొండే వాళ్ళు. నలుగురు. దార్లో నీలి గుడిసె దగ్గిరకొచ్చినప్పుడు,

"ఏయ్ గుంటా, కసింత నీళ్ళిస్తావేటి?" అని దాహం తీర్చుకొనే వాళ్ళు. వాళ్ళు మొదట్లో ఉత్సాహంగా పలకరించే వాళ్ళు గానీ రాను రానూ నీరసంగా అన్పించేరు. ఒకోసారి నీలే ఆటయింకి లోటాతో నీళ్లు పట్టుకొని వుండేది. అయితే చప్పుడూ ధూళీ ఎప్పుడూ ఉండేదే.

ఆవేళ మధ్యాన్నం మూడు దాటింది.
ఎండ ఇంకా తగ్గనేలేదు.

'మిషనెట్లా ఉంటదో' అంటే 'సూపిస్తా' నన్నడు కర్రి అప్పారావు. పైకి చూస్తే కళ్ళల్లో దుమ్ము పడుతోంది. స్తంబాల వారన నడుచుకుంటూ వెళ్తొంది.

కొంచెం దూరంలో ఉందనగా,
చప్పుడు ఆగిపోయింది.
పైన రాళ్ళు ఎక్కడివక్కడే వున్నాయి.
ఇంతకాలంలో ఆగటం ఇదే మొదలు.
"మిషను సూపించటానికాపేసారేటో –" అనుకొని పరిగెత్తింది.

వాళ్ళు నలుగురూ ఖాకీబట్టలు వాళ్ల గుడ్డల్తో ముఖాలు తుడుచుకుంటూ ఆ గది లోంచి బయటకు వస్తున్నారు.

"ఏటయింది?" ఆత్రంగా అడిగింది.

"నీకేం తెలుస్తుందిలే, యీళ్ళిచ్చే సొమ్ములకు ఈ బెల్టు ఆపరేషన్ కిట్టదు. స్ట్రయికు" అన్నాడు కర్రి అప్పారావు.

"అంటే ఏటి?"

"అంటే– పైన వెళ్తొంది కదా, అది అలానే బూంపట్టు పట్టిన సిసిండ్రీలా ఉంటుంది–"

"మరయితే ఇప్పుడాళ్ళు ఏటి సేస్తారు?" అంది నీలి షెడ్డు పక్కనున్న ఆఫీసు గదివైపు వేలు చూపిస్తూ.

వచ్చే సంచికలో....

భూమయ్య కిష్టాగౌడ్ సంస్మరణ సంఘం, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుచేసిన భూమయ్య కిష్టాగౌడ్ సంస్మరణ ఉపన్యాసాల్లో మొదటిది, సుప్రసిద్ధ పత్రికా రచయిత సుమంతో బెనర్జీ ప్రసంగవ్యాసం 'మరణశిక్ష, న్యాయ, రాజకీయ, మానవతా విలువలు' ప్రచురించబడుతుంది.

'ప్రజాసాహితి' యువరచయితలవేదిక నిజామాబాద్ కవితాసంకలనాలు రెండు.

కాలం కదలికలు

యువరచయితల వేదిక ప్రజాసాహితి వారు వెలువరించిన ఐదవ ప్రచురణ యం. రాములుగారి 'కాలం కదలికలు'.

సలంద్రి వేసిన ముఖచిత్రం కొత్తరకంగా, ఆహ్వానించ దగ్గట్టు ఉన్నా, భావ గర్భితంగా లేదు.

నిమ్నజాతుల సముద్ధరణకు పాటుపడి, అస్పృశ్యతా నాగుబాము కోరలు పీక డానికి జీవితాంతం కృషి చేసిన డా॥ అంబేడ్కర్ జన్మదినం అణగారిన జాతులకు ఉత్తేజమేగాని, కవి అనుకొంటున్నట్టు 'అస్పృశ్యత గిట్టినరోజు'; 'ఝంఝూప్రభంజనం సృష్టించిన రోజూ' కాదు. అస్పృశ్యత పూర్తిగా గిట్టేరోజు నూతన ప్రజాతంత్ర విప్లవ విజయానంతరం ప్రజలు పాల్గొనే సాంస్కృతిక విప్లవం సిద్ధించిన్నాడే.

"సంఘర్షణ" కవిత అస్పష్టంగా ఉంది.

శిల్పంలేని చోట భావం, భావంలేని చోట శిల్పం ఉన్నాయని ప్రకాశకులు చెబుతోన్న కవితల్లో కొన్నింటిలో అవి రెండూ లేవు. "....దటీజ్ భారత్"లో ఉదహరించిన సంఘటనలు వ్యవస్థ నిజస్వరూపాన్ని తెలిపేవికావు. "నిప్పురవ్వ" లాంటి కవితల్లో పాతవర్ణనలు కనిపిస్తున్నాయి.

'శవాల్ని తినే మానవ గబ్బిలాలు' అనే చరణంలో పోలిక కుదరలేదు.

కొత్తగా కలంపట్టిన యువరచయిత సాధారణంగా ఎదుర్కొనే అంతస్సంఘర్షణ నుంచి కవి యింకో బయటపడ లేదనడానికి "పిలుపు" లాంటి కవితలూ;

'అన్న వస్త్రంబు పెట్టుచున్నందులకు'

'ఉదరం నిండక అధరం ఎండి' వంటి చరణాలు తార్కాణాలు.

"తిరస్కృతి" "భయం వద్దు" అనే మంచి కవితలను జాగ్రత్తగా అనువదిస్తే బావుండేది.

Economy of words & thoughts పట్ల కవి శ్రద్ధవహించలేదు. తన కవితల్ని మళ్ళీ ఓసారి ఎడిట్ చేసుకున్నట్టు తోచదు.

'దుర్మార్గం', 'ఆర్తనాథం', 'అస్పృష్యత', 'నాషనం' లాంటి పదాలు అచ్చుతప్పులు కావేమోనన్నంత ఘోరంగా ఉన్నాయి.

"స్వతంత్రం పంచుతారట" కవితలో చివరికి

"రా చెల్లీ అలస్యం చేయకు
పోయి స్వాతంత్ర్యం తెచ్చుకుందాం
లేదా తేల్చుకుందాం" అని పీడితుల్ని పిలుస్తున్నాడు.

"విమోచన గీతిక పాడు"లో కవికి నిజాయితీ ఉంది.

"ఈ రాత్రులు" కవితకు న్యాయం చేకూర్చారు.

పరిచయకర్త శ్రీ జ్వాలా తారకం వినమంటూన్న ఈ 'కాలం కదలికల' చప్పుళ్ళని ఎం. రాములుగారు సరిగ్గా రికార్డు చేయలేదేమో ననిపిస్తోంది. 'ఇదే ప్రజా కవిత్వం' అని శ్రీ సి.హెచ్. మధు అనడం అతిశయోక్తిగా వుంది.

జీవితంలో కన్నీళ్ళనూ, కడగండ్లనూ అడుగడుగునా ఎదుర్కొని తన 'స్వకీయాలాపన'ని కవిత్వంలో పొందుపరచ యత్నించిన రాములుగారిలో తపన, తహతహ, ఆవేదన, క్షోభ ఉన్నాయి.

'కూలివాడి కడగండ్లలో
బీదవాడి బెదురు మూలుగులో
కార్మికుడి కన్నీటి బిందువులో
నా కలాన్ని ముంచి, వారి కన్నీటితో
జ్యోతిని వెలిగిస్తా'

అంటోన్న ఈ యువకవి యింకా స్పష్టమైన సామాజిక, రాజకీయ, సాహిత్య అవగాహన పెంచుకోవాలని ఆశిద్దాం.

– డి. నిశిత

కాలం కదలికలు - కవితా సంపుటి - రచయిత ఎం. రాములు - వెల 2 రూపాయలు

చావు గీతం

'చావు చొక్కా తొడుక్కుంటున్నా, చావడానికి కాదు పోరాడడానికి' అంటూ సలంద్రి పాడుతున్నాడు 'చావుగీతం'.

మూర్ఖులు పన్నిన కుట్రలతో విశ్రాంతి లేక పోరిన (మిత్రుని) తీరు 'రేపు'ను గూర్చి ఆలోచింపజేస్తే పర్వాలేదు. కాని 'కన్నీళ్లతాగి యితరులకు సుధలు పంచడం, కన్నీటి చరిత్రలు మాత్రం తిని వాటి మాటున దాగివున్న 'సమానత్వపు' వెలుగుల కోసం ఎందరికో ధైర్యం తినిపించడం 'దారి' చూపితే (సలంద్రికు) ప్రమాదమే. కన్నీళ్ళను తాగి యితరులకు సుధలు పంచడం ఆదర్శవాదమే అవుతుంది. కన్నీటి

చరిత్రల మాటున 'సమానత్వపు' వెలుగుల్ని చూడటం ఎలా? పీడకులు, పీడితులుగా విడిపోయిన సమాజంలో సమానత్వం వెలుగులు ఎక్కడ దాగివున్నయ్. 'ఏడిచే కళ్లూ- కన్నీళ్లు అన్నీ' తనవే అంటూ సలందర్రి ప్రకటించాడు. ఆ తర్వాత కన్నీళ్లు ఎవరికి పుట్టినా ; ఏ రూపంలో పుట్టినా 'కన్నీళ్ళు - కన్నీళ్లే' అని నిర్ణయం చేస్తున్నాడు. కన్నీళ్ళు ఎవరికి పుట్టినా ఏ రూపంలో పుట్టినా ఒకటే ఎట్లవుతాయి. దోపిడీకి గురవు తున్న కోట్లాది కష్టజీవులుకార్చే కన్నీళ్ళున్నయి. శ్రమజీవుల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్న దోపిడీదారులు కారుస్తున్న 'మొసలికన్నీళ్లూ' వున్నయి. వర్గ సమాజంలో ఏదీ వర్గాలకు అతీతంగా వుండబోదు. 'భావవాద' ప్రభావం వల్లనే 'కన్నీటిని మొత్తంగా' తనది చేసుకోవటం జరిగింది. వర్గ దృష్టి నుంచి తప్పిపోవటం వల్లనే 'కన్నీటికి ఎల్లలూ- భాషా- వాతావరణం' అక్కర్లేదని అనిపించింది. సమానత్వాల వెలుగులు సమసమాజంలోనే. అందాక, సమసమాజం రానంతవరకు 'సమానత' మానవత లాటివి వొట్టి ఆదర్శాలుగానే మిగిలిపోతయి.

లేనివాళ్ల గురించి మాట్లాడతాను, మాట్లాడటమేకాదు మాటలకు రూపం కలిగించటానికి సాగిపోతాను, అంటున్న కవి నిన్నను, నేటిని గతితార్కిక చారిత్రిక భౌతికవాద దృష్టితో చూడాలి. ఆ దృష్టే లేకుంటే 'నిన్నను, నేటిని మొత్తంగా నిరాకరించటమో లేక స్వీకరించటమో చేస్తాడు. అభివృద్ధికరమైన 'సజీవాంశాలను' స్వీకరించి అభివృద్ధి పర్చడమే శాస్త్రీయ పద్ధతి.

వర్గదృష్టి, మార్క్సిస్టు అవగాహన వున్నట్లయితే 'తుఫాను కవిత' అట్లుండేది కాదు. తుఫానులో తన జనాన్ని వెదుక్కుంటాడుకవి. వాళ్ళ కష్టాలు, కన్నీళ్ల బేరీజు వేస్తాడు. ఈ దోపిడీపాలన వున్నదనుకా ఈ కష్టాలు మనకు తప్పవంటాడు. ఈ తుఫాను వల్ల కలిగిన కన్నీటిని తుడుచుకొమ్మంటాడు. కన్నీళ్ళను 'తుఫాను'గా మార్చమంటాడు. దోపిడీపునాదుల్ని పెకల్చమంటాడు. తానూ వాళ్ళ గొంతుల్లో గొంతుకైతాడు. కవి శాస్త్రజ్ఞుల పరిశోధనా వైఫల్యాన్ని 'తుఫానుకవిత'లో చెబుతూ 'మనిషీ నువ్వోడిపోయావ్,..... చచ్చిపోయావ్.... నీ ఆలోచనల్లు వ్యభిచరిస్తున్నాయి.... కంపుగొట్టిగాలు కొడుతున్నాయి.... విశ్వాన్నే మార్చేశాననుకుంటున్నావ్, కొంతవరకు గెలిచినా 'నిన్ను నువ్వే మార్చుకోలేకపోయావ్' ఓటమిపొందిన ప్రతిసారి భయాన్ని పూజిస్తవ్' అంటూ శాస్త్రజ్ఞుని తిట్టటం "వాళ్ళ కన్నీళ్ళ భాష అర్థంకాలేదంటూ 'నేతల' తిట్టటం, 'భయంనుండి బయటపడి పోరాటం చెయ్యమనీ, ప్రకృతిమీద విజయ పతాకం తప్పక ఎగరేస్తావని' చెప్పటం 'శోష'గానే మిగిలిపోతుంది. భూస్వామ్య

వ్యవస్థ కళలూ - శాస్త్రాల అభివృద్ధికి ఆటంకం. శాస్త్రీయ పరిశోధనాఫలితాలు అందరికీ నిజంగా అందేది 'సమసమాజ' దశలోనే.

'ఒంటరిపోరాటాలు' సమాజాన్ని మార్చలేవు. తారకమైన మిత్రుడు 'ఒంటరిగా కూడా ఎలాసాగిపోవాలో నేర్పింది. ప్రయోజనం లేంది. ఒంటరిగానే సాగిపోరా' అన్నసూక్తి సినీమా హీరోలకి, సినీమాకవులిచ్చే సందేశం. దీనికి పునాది బూర్జువా భావజాలం. వ్యక్తిచైతన్యం సామాజిక సంబంధాల ఫలితమే. వ్యక్తిని సమాజంనుంచి వేరుగా చూడరాదు.

రాజకీయవ్యభిచారుల గురించి రాస్తూ 'వీళ్ల కర్పూరంలా కాల్తేనే, జ్వాలల్లా మండితేనే' అంటూ ముగింపు. రాజకీయవ్యభిచారులు కర్పూరంలాకాలరు. జ్వాలల్లా మండరు. కర్పూరం బూర్జువా త్యాగానికి, జ్వాల విప్లవ చైతన్యానికి ప్రతీకలుగా తీసుకుంటారు గదా! రాజకీయవ్యభిచారులు బూర్జువా విలువలను (ఆదర్శాలను) కూడా పాటించరుకదా!

సలంద్రి ఉత్సాహం చైతన్యం మెరుపు, ఈ కవితా సంపుటంలో అక్కడక్కడ ఆపెలుగువుంది.

'నపుంసకత్వం, షండత్వం' లాటి ప్రయోగాలను పరిహరిస్తేయేం?

ప్రసవవేదన లేకుండా శిశువుపుట్టదనీ, పాముని మంత్రాలతో కాదు కర్రతోనే చంపాలనీ, బ్యాలెట్ బాక్సులు అదృష్ట రేఖల్ని మార్చలేవని, తెలుసు. పడమట కాదు సూర్యుడు తూర్పున వుదయిస్తాడనీ తెలుసు. ఇన్నీ తెలిసిన కవికి 'తల్లిగర్భానికి, స్మశానానికి మధ్యన జరిగేది ఊరేగింపు' కాదు ఉనికి కొరకు పోరాటం. పురోగమనం అని తెలియాలిగదా.

కన్నీటికి- కళ్ళు తెరవడానికి మధ్య జరుగుతున్న సంఘర్షణ యిది. ఈ సంఘర్షణ నుంచి పూర్తిగా బయట పడనంతకాలం బూర్జువా భావజాలం పనిచేస్తూనే వుంటుంది. ఉద్దేశాల్లో ప్రజల తరపున నిలిచినా, ఆచరణలో ఆదర్శవాదంగానో, అస్పష్ట భావవాదంగానో మిగులుతుంది. కష్టజీవులదిక్కు నిలిచి, వారికి ఉపయోగ పడాలనుకున్న వారికి 'మార్క్సిజం - లెనినిజం- మావో ఆలోచనావిధానం శస్త్రమూ- శాస్త్రము. 'ప్రజలనుంచి ప్రజలవద్దకు' ఈసూత్రం కళలకూ - సాహిత్యానికీ వర్తిస్తుంది.

— జ్వాల

చావుగీతం – కవితా సంపుటి – రచయిత సలంద్రి – 42+IV పేజీలు – వెల 2.00

పైరెండు పుస్తకాలకూ కేకలు, తెలుగు వారపత్రిక, నిజామాబాదు 503001 కిరాయాలి.

విరసం మహాసభలు

దేవవ్రత పాండా

తిరుపతిలో సెప్టెంబరు 29 నుండి అక్టోబరు 1 వరకు జరిగిన విరసం మహాసభలు తలనెరిసిన మేధావుల సభలు కావు. అవి మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానాన్ని నమ్ముతున్న 450 మంది విప్లవ సాహిత్యాభిమానుల సమావేశాలు. కొద్ది మంది సభ్యులతో జూలై 4, 1970న ఆవిర్భవించిన విరసం యివ్వాళ యావదాంధ్ర దేశంలోనూ ఒక బలమైన సంస్థగా వృద్ధి చెందింది. విరసం నాయకులను కేసుల్లో యిరికించడంతో తొమ్మిదేళ్ళ కాలంలో యీ సంస్థ ఉన్నత సాంప్రదాయాల్ని నిలుపుకుంది. ఈ మహాసభలకి దేశంలోని యితర ప్రాంతాలనుంచి వచ్చిన సౌహార్దప్రతినిధులు విరసం వెలిగించిన జ్యోతి ఆరిపోకుండా కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

మహాసభల కార్యక్రమాలు కవిత్వం, కథ - నవల - సాహిత్యం, నాటికలు - నాటకాలు, సాహిత్యవిమర్శ, పత్రికారచన - రేడియో - టి. వి., సినిమా అనే ఆరు విభాగాలుగా ఏర్పాటుచేయబడినాయి. శ్రీశ్రీ, మధుసూదనరావు, కె.వి. రమణారెడ్డి, వరవరరావు, కాశీపతి, ఎం.టి. ఖాన్, చలసానిప్రసాద్ లాంటి ప్రసిద్ధ రచయితలే కాకుండా చాలా మంది రచయితలు, సాహిత్యాభిమానులు యీ సభల్లో పాల్గొని సాహిత్య ప్రసంగాలు, కవితలు, తామే స్వయంగా రాసిన గీతాలు వినిపించారు. వీళ్ళలో కొందరు నవయువకులు, సమర్థులైన, సరియైన అవగాహనతోవున్న రచయితలు. అనారోగ్యం వల్ల ప్రముఖ రచయితలు చెరబండరాజు, కుటుంబరావు మహాసభలకు రాలేకపోయారు. మహాసభల్లో కొందరు రైతులు, కార్మికులు సాహిత్య చర్చల్లోనూ సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ఉత్సాహంగా పాల్గొనడం మమ్మల్నెంతో ఆకర్షించింది. మధ్యాహ్నం, రాత్రి భోజన వేళల్లో విరామం తప్ప సమావేశాలు ప్రతిరోజూ అర్ధ రాత్రిదాకా సాగిపోయేవి. అమరవీరులకు జోహార్లర్పించే పాటలతో పాటు అనేక విప్లవగీతాలు మహాసభలనెప్పుడూ సజీవంగా వుంచాయి. సుబ్బారావు పాణిగ్రాహి సరోజ్‌దత్తా మొదలయిన అమరవీరుల పేర్లు వినిపిస్తే చాలు ప్రతినిధుల జోహార్లతో సభాస్థలం మారుమ్రోగేది. ప్రసంగానికీ ప్రసంగానికీ మధ్య వైవిధ్యం కోసం అనేక విప్లవగీతాలు వినిపించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులకు కార్యక్రమ వివరాలు అర్థం కావడంలో చాలామంది సమర్థులైన అనువాదకులు తోడ్పడ్డారు. పాటలకు కూడా స్వేచ్ఛానువాదాలు వినిపించారు. మార్క్స్, లెనిన్, మావో తైలవర్ణ చిత్రాలతోపాటు 'రెవల్యూషన్ కంటిన్యూస్' అనే పోస్టర్‌ను కూడా ప్రదర్శించారు. ఇవి విప్లవ కళాకారుల నిపుణతను ప్రదర్శించాయి. మహాసభలు చివరి

రోజు బహిరంగసభతో ముగిశాయి. రచయితలతో పాటు వేలాదిమంది రైతులు, విప్లవ కార్మికులు విప్లవ నినాదాలతో బహిరంగసభా స్థలానికి బ్రహ్మాండమైన ఊరేగింపులో వెళ్ళారు.

మహాసభల గురించి వ్యాఖ్యానించమని అడిగినప్పుడు విరసం ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి వారి అంచనాప్రకారం యిప్పటివరకు జరిగిన మహాసభల్లో ఇది మంచిగా జరిగిన రెండో మహాసభ అనీ, ఎమర్జెన్సీకి ఆరునెలల క్రితం అనంతపూర్‌లో జరిగిన మహాసభ చాలా నిరుత్సాహకరంగా జరిగిందనీ, ఆ సభల్లోనే సంస్థలో చీలిక ఏర్పడిందనీ అన్నారు. కొందరు కామ్రేడ్స్ కటకటాల వెనక్కి 1971-72లో తోసివేయబడినప్పుడు జరిగిన రెండవ మహాసభలు చాలా గొప్పగా జరిగినాయని చెప్పుకోవచ్చు. కాని సభ్యులను సాహిత్య విమర్శకులుగా వారి ప్రతిభను మలచడంలోనూ, కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేట్టు చెయ్యడంలోనూ రచయితలుగా సాంస్కృతిక సైనికులుగా వారికి ఒక సరియైన అవగాహనను అందివ్వడంలోనూ తిరుపతిలో జరిగిన మహాసభలు ఉత్సాహకరంగా జరిగాయి.

రైంతాంగం లోనూ శ్రామికవర్గం లోనూ క్రమక్రమంగా ప్రతిభావంతులైన రచయితలు, గాయకులు తయారవుతున్నారని మహాసభలో పాల్గొన్న కొంతమంది విశ్వవిద్యాలయ అధ్యాపకులు, కళాశాల అధ్యాపకులు, పత్రికా రచయితలు నాతో అన్నారు. అల్లం రాజయ్య ఒక ఫ్యాక్టరీలో టైంకీపర్. ఈయన చాలా ప్రతిభగల యువకథారచయిత. ఆయన ఇటీవలనే రాసిన "కొలిమంటుకున్నది" నవల కరీంనగర్ ప్రజల జీవితాన్ని వారి పోరాటాల్ని ఆధారంగా చేసుకుని రాయబడింది. ఇది వ్యావహారిక భాషను ఉపయోగించకుండా తెలంగాణ మాండలీకంలో చేసిన ఒక మంచి ప్రయోగం. దీనితో పాటుగా వి.బి. గద్దర్, వంగపండు ప్రసాదరావు, రామారావుల "ప్రజల పాటలు - మా అనుభవాలు", మధుసూదనరావు "మార్క్సిజం - సాహిత్యం"; హైదరాబాదు విరసం యూనిట్ వారి పాటల సంకలనం, దామెర రాములు కవితా సంకలనం "కోరస్", జాక్‌లండన్ నవల ఐరన్‌హీల్‌కు తెలుగు అనువాదం "ఉక్కుపాదం" మొదలైన విరసం ప్రచురణలు ఈ మహాసభల్లో ఆవిష్కరించబడ్డాయి. వచ్చే సంవత్సరం మధుసూదనరావు పుస్తకానికి ఆంగ్లానువాదం వెలువడుతుంది.

విరసంకు అనుబంధంగా వుంటున్న ఆర్.వై.ఎల్., జననాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక దళాలు నాటకాలు, నృత్య నాటికలు ప్రదర్శించాయి. వారు విప్లవగీతాలు కూడా వినిపించారు. వేదికపైకి హరిజనుని వేషంలో గద్దర్

ప్రివేశము ప్రేక్షకుల్లో విద్యుదుత్తేజాన్ని కలిగించింది. హరిజనుల, యితర పీడిత ప్రజల బాధలను, పోరాట గాథలను ఆయన పాడి వినిపించినప్పుడు శ్రోతలు ఆనందోత్సాహాలతో మైమరిచిపోయారు. రామారావు పాడిన పాటలు, ముఖ్యంగా సంఘర్షణల పేరుతో కాల్చివేయబడిన సి.పి.ఐ. (ఎమ్ ఎల్) రాష్ట్రకమిటీ మాజీ కార్యదర్శి రామనర్సయ్యకు జోహార్లు అర్పిస్తూ పాడిన పాట మాత్రం మరిచిపోలేనిది. అలాగే ఎమర్జెన్సీలో కాల్చివేయబడిన తిరుపతి కళాశాల విద్యార్థి నాగరాజును సంస్మరిస్తూ పాడిన ఎన్. కె పాట, సిరిసిల్లా - జగిత్యాల పోరాటాల గురించిన హెచ్చార్కె పాట, గద్దర్ "సాయిబాబా", "కంపిని కూలోడా" కూడా వినిపించారు. ఇట్లా పేర్కొంటూ పోవడం అక్కడి చాలా మంది యువగాయకులను చిన్నచూపు చూడడం ఎంత మాత్రమూ కాదు. అందరూ జానపద రూపాలను సంతరించుకుని వాటికి విప్లవాశయాన్ని జోడించారు. రాయలసీమ, తెలంగాణ, కోస్తా ఆంధ్ర ప్రాంతాల జానపద గీతాలకు విభిన్నమైన బాణీలున్నాయి.

మహాసభల్లోనూ, బహిరంగసభలోనూ ఉత్సాహంగా పాల్గొనడంలో ఆంధ్ర ప్రజలు చూపిన ఆసక్తి, క్రమశిక్షణా అక్కడ ఒక బెంగాలీ అతిథిని ఆశ్చర్యచకితుణ్ణి చేశాయి. వేదికపై టాగోర్ రాసిన బెంగాలీ పాటను పాడడంతోనే ప్రేక్షకుల నుంచి "ఇది టాగోర్ గీతం - విప్లవ గీతం కాదు" అనే వ్యాఖ్యానం వినిపించింది. సభల్లో పాల్గొన్న ప్రతినిధులు ఒక్క క్షణమైనా పిచ్చాపాటీ సంభాషణల్లో వున్నట్టుగానీ, కునికిపాట్లు పడ్తున్నట్టుగానీ అనిపించలేదు. అక్కడా యిక్కడా వలంటీర్ల పరిగెత్తడాలూ, హడావుడీ కనిపించలేదు. రణగొణ ధ్వనులుగానీ సందడిగానీ లేదు. కార్యక్రమాలు సజావుగా సాగిపోయాయి. ఆహ్వానసంఘం కార్యదర్శి, యువ న్యాయవాది అయిన శివారెడ్డి రోజంతా మహాసభల పనులు చూస్తూనే వున్నాడు. ఆయనతోపాటు యితర వలంటీర్లు విధినిర్వహణలో లోపాలపట్ల ఎవరినీ నిందించకుండా ఎప్పుడూ చిరునవ్వు ముఖాలతో కనిపించారు. కొందరు ప్రతినిధులు రాత్రుళ్ళు నిద్రపోకుండా ఆ మరుసటి రోజు తాము చదివే ప్రసంగ వ్యాసాలకు కొసమెరుగులు దిద్దుతూ గడిపేవారు. మరి కొందరు దేశం యితర ప్రాంతాల్లోని సాహిత్యోద్యమాల గురించి అమితాసక్తితో చర్చిస్తూ వుండేవారు. చాలా మంది ప్రతినిధులు రాత్రుళ్ళు నిద్రపోలేదు. వారి మధ్య అభిప్రాయ భేదాలెన్నివున్నా విరసం ప్రతినిధులంతా ఐక్యంగా వున్నారు. అట్లాంటి ఐక్యత ఈ రోజుల్లో బెంగాల్‌లో చాలా అరుదు. భారతదేశం నూతన ప్రజాస్వామిక దేశంగా రూపుదిద్దుకోవడానికి అతి ప్రధానమైన భావవిప్లవాన్ని సాధించడానికి వాళ్ళు కృషి చేస్తున్నారు. వాళ్ళు నిరాశా నిస్పృహలతో గెలవలేక ఆదర్శాలను గాలికి వదిలేసే మేధావులలాంటి వాళ్ళు కారు. వాళ్ళు అణచివేతలెన్నయినా లెక్కచేయకుండా జీవితసత్యాలను స్వేచ్ఛగా, ఉన్నతంగా పాడాలనుకుంటున్న వాళ్ళు.

మాండలీకం గురించి !

ప్రజా సాహిత్యంలో తీసుకున్న విషయం ప్రజలకు అనుకూలించేదిగా వుండటం ఒక్కటే కాదు కావల్సింది. రాసే పద్ధతి కూడా ప్రజలకు అర్థమయ్యేదిగా వుండాలి. లేకపోతే ఆ రచనలో ఎంత మంచి విషయాలున్నా ప్రజలందరికీ అందవు. ఆ రచయిత చేసిన కృషి కొంతగాకపోతే కొంతైనా వ్యర్థమవుతుంది.

ఇందుకు మనం మాండలీకాల్ని గూర్చి చెప్పుకోవచ్చు. మాండలీకం వలన ప్రయోజనముంటుందని నేను నిన్న మొన్నటి వరకు అనుకున్నాను కానీ, కొంత మందితో ఈ విషయమై చర్చిస్తూ ఉదాహరణకు మన సృజనలో సీరియల్‌గా వచ్చిన 'కొలిమంటుకున్నది' నవల్ని ఎంత మంది చదివారో చిన్న పరిశీలన చేస్తే ఊహించ లేనంత ఆశ్చర్యం వేసింది. నేను దాదాపుగా సృజన చదువుతున్న పదిమంది పాఠకుల్ని ఈ విషయంపై ప్రశ్నించాను. వాళ్ళంతా అప్పుడప్పుడు గాకుండ రెగ్యులర్‌గా సృజన చదువుతున్న వాళ్ళే. వాళ్ళంతా విప్లవ సాహిత్యాభిమానం కలిగినవాళ్ళే కాని - ఆశ్చర్యం, వాళ్ళెవరూ ఈ నవల్ని చదవలేదు. పోనీ - వాళ్ళ కెవరికీ సీరియల్స్ చదివే అలవాటు లేదా అంటే - అదేమి కాదు. మాండలీకం వలన మంచి ప్రయోజనముంటుందని, ఆ భాష కొత్త ప్రాంతాల వారికి పరిచయమవుతుందని నేను మనస్ఫూర్తిగా నమ్మటమే గాకుండా ఆ విషయంపై సృజనలో జరుగుతున్న చర్చలో పాల్గొన్నాను కూడా. మామూలు భాషలో వ్రాస్తేనే ఎక్కువ మంది చదువు తున్నారు గానీ, మాండలీకంలో వ్రాసినందు వలన పాఠకులు బద్ధకం చూపిస్తున్నారు. ఇది చాలా విచారించాల్సిన విషయం. మాండలీకం ఇతర ప్రాంతాల వారికి అర్థం కానంత క్లిష్టమైన మాండలీక పదాలేం లేవు. ఎందుకో పాఠకులు, మాండలీక మంటే చాలా నిరుత్సాహం చూపిస్తున్నారు. ఇది చాలా చెడ్డ పరిణామం. శ్రీ రావి శాస్త్రిగారి రత్తాలు - రాంబాబు ఆంధ్రజ్యోతిలో సీరియల్‌గా వస్తున్నప్పుడు చాలా మంది పాఠకులు అత్యుత్సాహంగా ఆ నవల్ని చదివేరు. బహుశ, ఆ నవలకు అంత గొప్ప ఆదరణ లభించటానికి రావిశాస్త్రిగారి హాస్యప్రియత్వం, సునిశిత జీవిత పరిశీలన కారణం కావచ్చు.

- మొలకలపల్లి కోటేశ్వరరావు
పమిడిపాడు.

రాగల సంచికలలో....

'సమానతా నువ్వెక్కడ ?', 'జనగీతం' -
'కోరస్', 'ఇన్ క్రెడిబుల్ గాడెస్' - సమీక్షలు వస్తాయి.

సాహిత్య లేఖలు :

ప్రియమైన కామ్రేడ్,

దోపిడీ సమాజంలో తలెత్తుతున్న సమస్యలన్నిటికి విప్లవం మాత్రమే సవ్యమైన పరిష్కారం. "కళలూ, సాహిత్యం ప్రజల కోసమే"- విప్లవాభిమానులంతా అంగీకరించే విషయమే ఇది. ఇవ్వాళ తెలుగులో వస్తున్న విప్లవ సాహిత్యంలో 'భాష' ప్రధాన చర్చనీయాంశం అయింది.

అందులో మాండలీక రచనల విషయమై చర్చలు సాగుతున్న ఈ తరుణంలో దానికొక సమగ్ర దృక్పథంతో ఆలోచించి ఆచరణలో పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది.

చాలా రోజులుగా సాగుతున్న చర్చోపచర్చల వల్ల దాని ప్రయోజనం ఇసుమంత కూడా దెబ్బతినకూడదనే ఉద్దేశ్యంతో జంటనగరాల సాహితీ సర్కిల్ వారు కొందరు కలసి గద్దర్, అల్లం రాజయ్యలతో ఇష్టాగోష్ఠి చర్చలు జరిపారు.

సాహిత్య నిర్మాతలు ప్రజలే. ఇది ఎలా ఉండాలో సూచించే హక్కుదారులూ వాళ్లే. ఏ కొందరో దబుక్కున నిర్ణయించాల్సింది కాదు, అందుకే ఈ విషయంలో వాళ్ళ అభిప్రాయాలు తీసుకోడానికి వీలుగా చర్చించిన విషయాలను 'ప్రశ్నావళి'గా రూపొందించి మీముందుంచడం జరిగింది.

మీ అభిప్రాయాలను, సూచనలను జనవరి ఒకటో తేదీకి ముందే ఈ కింది చిరునామాకు పంపితే ఒక సమగ్ర అవగాహనను నలుగురితో పంచుకోవటం సాధ్యమవుతుంది- అని ఆర్. కె. రాస్తున్నారు.

ఆర్. కె. C/o 2-1-561
నల్లకుంట, హైదరాబాదు - 44

- ప్రశ్నావళి -

1) మాండలీకంలో వస్తున్న విప్లవ సాహిత్యం మీకు సులభంగా అర్థమవుతున్నదా ?
2) మాండలీకాన్ని అర్థంచేసుకోవడంలో వున్న యిబ్బందులేమిటి ?
3) ఆ రచనలు అర్థం కాకపోతే అది మాండలీక రచనా వైఫల్యమా ? పాఠకుని వైఫల్యమా ?
4) మాండలీకంలో వస్తున్న సాహిత్యం యితర ప్రాంతాలకు వ్యాప్తిచెందుతుందా ?
5) వ్యాప్తిచెందకపోతే గల కారణాలేమిటి ?
6) పాఠకులే ప్రయాసతోనైనా ఆ సాహిత్యాన్ని అవగాహన చేసుకోవాలంటారా ?
7) ఎందుచేత ?

8) విస్తృత ప్రచారలక్ష్యంతో మాండలిక రచనలను ఏ విధంగా సులభతరం చేయాలంటారు ?

9) పదాలకు అర్థవివరణలు (Foot notes) యిస్తే అర్థం చేసుకోవడంలోని యిబ్బందిని అధిగమించ గలరా ?

10) మాండలీకంలో వున్న నవలలూ కథలూ చదివి వినిపించినపుడు అర్థం చేసుకోడంలోని క్లిష్టతపోతుందా ?

11) మాండలీకంలో వున్న పాటతో సమైకం అయినట్లుగా కథ, నవలల్లో లీనం అవుతున్నారా ? కాకపోతే ఎందువల్ల ?

12) ఒక మాండలీకంలో వచ్చిన రచనను ఇతర మాండలీకాల్లోకి అనువదిస్తే ఎలా వుంటుంది ?

13) మాండలీకంలో సినిమాతీస్తే, నాటకంరాస్తే ఎలావుంటుంది ?

స్త్రీల సమస్యలు : పోరాటాలు (నవంబర్) సంచికపై విజయవాడ (1), విశాఖపట్నం (2), మంచిర్యాల (3), న్యూఢిల్లీ (4)ల నుంచి వచ్చిన సాహితీ మిత్రుల అభిప్రాయాలు కింద ఇస్తున్నాం.

1 సృజన మంచి informative గా వుంది. అన్నిటిని మించి 'ఆత్మవిమర్శ' సంపాదకీయం చాలా బావుంది. కమ్యూనిస్టు మగవాళ్ళందరు భుజాలు తడుముకోవలసిన అవసరం ఎంతైనావుంది. మీ తప్పుని 'ప్రజాసాహితి' ద్వారానైనా తెలుసుకుని దిద్దుకున్నందుకు అభినందనలు.

32వ పేజీలో 2వ పేరా 'కాలంచెల్లిన శాసనాల పూర్తి బరువునుమోయవలసింది కార్మికవర్గ మహిళే' నన్న వాక్యం clarity కాలేదు.

2 సృజన స్త్రీల ప్రత్యేక సంచిక చూశాం. ఆ theme కు సంబంధించి కొన్ని మంచి మంచి కథలు కూడా వేస్తే బాగుండేదేమో ! II world warలో టాన్యా వగయిరా కథలు, తెలంగాణా పోరాటంలో కొన్ని కథలు, అలా –

'ఉద్యోగపుబుద్ధి' – కవికొండల వెంకటారావు కథ – తప్పకుండా ఈ సంచికలో వుండి తీరవలసిన కథ. స్త్రీ సమానత్వం మీద అంతమంచి కథ నేను విశ్వ సాహిత్యంలో చదవలేదు. కవి కొండలకు Marxism తెలుసోలేదో నాకు తెలీదు. కాని it is really a Master-Piece.

ఈ issue లో fiction part లోపించి dry గా Bulletin లాగా వుందనిపించింది.

సంపాదకీయంలో చాదస్తం, ఆదర్శవాదం కనిపించాయి. చివరకు మనం జైనుల్లాగా తయారవుతామేమో : పొట్టిబావ, మరుగుజ్జు, మూగవాడి ముందు ముక్కుగోక్కోవడం, బట్టతలకు మోకాలికి ముడి వెయ్యడం, పిలకరాయుళ్ళు - నిత్య జీవితంలో ఇలా ఎన్నో వాడతాం. అలాంటప్పుడు మాచకమ్మ, రంకు లాంటి మాటలు వాడ్డంలో తప్పేమిటి ?

పోయిన కాంగ్రెసు ప్రతిష్ఠ
పుంజుకునే దెప్పుడు ?
సరదాపడి మాచకమ్మ
సమర్తాడినప్పుడు ?

– శ్రీశ్రీ (1954)

సంపాదకీయంలోని వాదంతో నేను convince కాలేక పోతున్నా. గాంధీగారి లాగా వ్యక్తిగత ఆదర్శవాదంవల్ల మనం గొప్పవాళ్ళ మనిపించుకోవచ్చు. కాని అందు వల్ల జనానికి ఒరిగిందేమిటి ? మనది మాస్‌లైన్. మర్చిపోవద్దు.

3 నవంబర్ సృజనలో మీ ఆత్మవిమర్శ (స్వేచ్ఛ గురించి) చదివాను. స్త్రీల ఉద్యమాల గురించి చాలా విషయాలు నేర్చుకున్నాను. మన కళ్ళముందు అనేక సంస్థల్లో, ఫ్యాక్టరీల్లో పొలాల్లో స్త్రీలు ఏ విధంగా అన్నిరకాలుగా దోపిడీ చేయబడు తున్నారో బాగా విషయసేకరణ చేశారు వ్యాసకర్తలు. ఆ పని ఆపద్ధతిలో అన్నిరకాల ప్రజల గురించి సేకరిస్తే బావుంటుంది. మనమే చేయాలి. ఈ విధంగా ఆలోచిస్తే మన కళ్ళ ముందు జరుగుతున్న అతిసాధారణ విషయాల గురించి కూడా శాస్త్రీయంగా తెలియకపోవడం కనిపిస్తుంది. అన్ని సంగతులను శాస్త్రీయంగా ఎట్లా అధ్యయనం చేయాలో 'సృజన' వ్యాసాలు గైడ్ లైన్‌గా అనిపించినాయి.

4 సృజన పైనా Immediate reaction mixed feelings. అనుకున్నంత సమగ్రంగా లేదు.... తెలుగు వామపక్ష సాహిత్యంలో ఒకకొత్త ప్రయోగాన్ని మనం పరిచయం చేసాం. అంతమేరకు మనది విజయమే........ సంచికకు హైలెట్ "ఆత్మవిమర్శ" పేరుతో వెలువడ్డ మీ సంపాదకీయం. Please accept my tributes.

నేతలు

వీళ్ళు
నేతలు
చట్టాల్ని
చేస్తారు
ఏడాదికి
రెండుసార్లు
లోవర్ సభలో
బ్రాంచాఫీసుల్లో
ఐందా! ఇక
రాష్ట్రపతి
మొహర్ వొత్తి
దేశానికి
కట్టబెడ్తారు
(దేశమంటే
బురత్రికాదోయ్
దేశమంటే
గొర్రెలోయ్)

వీళ్ళే
ఐదేళ్ళు
జనం ముందర
అడ్డంగా
నిలువుగా
అందంగా
ఉపన్యాసాల
ముగ్గులేస్తారు
సమస్యలమీద
సవతిపజాలమీద
చిందులేస్తారు.

వీళ్ళే నేనన్నది
దొన్నాళ్ళుగా
నల్లనోట్లకు
రిబ్బన్లు కత్తిరించి
బ్లాక్ మార్కెట్లకు
పునాదిరాళ్ళేసి
పోషలిజానికి
మైలురాళ్ళయ్యారని

వీళ్ళేగా నేనన్నది
గబ్బిలాలని
అందిన పీఠాల
చూర్లుపట్టుకొని
శంకర్ మఠాల
కాళ్ళుపట్టుకొని
వేళ్ళాడ్తారని

స్వయంగా
వస్తున్నారు
పేగులమీద
ఆకలిగోళ్ళ
రక్కుల్ని చూపెట్టండి
భయమెందుకు!
వీధివీధినా
వీళ్ళుచేసిన
దోపిడీల తోరణాలు
వేళ్ళాడగట్టండి

ఓట్లను, నోట్లను
వాళ్ళతోనే
పూడ్చిపెట్టి
తుడుచుకోండిక
నెత్తురు చేతుల్ని

— ఎస్. మౌలాలి

మళ్లీ వస్తున్నాయి మన ఊరికి

మళ్ళీ వస్తున్నాయి మన ఊరికి
చిలుక పలుకుల దేగలు
రక్తం తాగే రాబందుల మూకలు

కలల కరివేపాకు చెట్లూ
కళ్ళలోగిళ్ళలోని ఆశాప్రసూనాలు
పాపలూ కనుపాపలూ జాగ్రత్త

రెండు దశాబ్దాల గాయాల నొప్పులతో
విసిగి వేసారిన సూర్యుడు
రాజీలేని ఎర్రని మంటలతో
ఇప్పుడిపుడే ఇంటింటి తలుపు
తడుతున్నాడు
ఉషస్సులూ మనస్సులూ జాగ్రత్త

మొత్తంగా రెక్కలిప్పి
ఇనపముక్కులకూ ఉక్కుగోళ్ళకూ
లేచిగుళ్ళ కవచాలు కప్పి
దేశం ఆకాశం నిండా
దోపిడీ దేశభక్తి గీతాలు పాడుకుంటూ
పుక్కిటినిండా పుచ్చు వాగ్దానాల గింజల్ని
నములుకుంటూ
వలల వలయాల్ని అల్లుకుంటూ
వస్తున్నాయి దేగలు
రక్తం తాగే రాబందుల మూకలు

పరమ కిరాతకంగా
ప్రజల ప్రాణాల్ని పొట్టన పెట్టుకుంటూ
పైదోడు వంతపాటల్లో
గుండెల్ని అమ్ముకుంటూ
కాలాన్ని వెనక్కినెట్టే
తలపాళ్ళకూ రాళ్ళకూ బాకాతట్టే
రకరకాల జనద్రోహపు సంఘాల
చిలుకపలుకుల దేగలు
మళ్ళీవస్తున్నాయి మన ఊరికి
రక్తం తాగే రాబందుల మూకలు

ఊళ్లో వాటికి గూళ్ళున్నాయి గుళ్ళున్నాయి
అంతశ్శత్రువుల పళ్ళమధ్య
మనయిండ్లూ నలిగే ఉన్నాయి
అయినా మిత్రులారా పుత్రులారా
శత్రు శిబిరాల శిఖరాగ్రాల మీదికి
దోపిడీ గుండెల పాదాలమీదికి పోరాటం
బండల్ని దొర్లించి
ఊరూరికి ప్రాకుతున్న
ఎరుపుండగ వెరపేటికి
అవని మనది ఆకాశం మనది
ఊరు మనది పేరు మనది
మనపేదల ఎదల మెదళ్ళలోని ఎరుపును
ఏశక్తీ చెరపలేదు
కష్టజీవి కడుపుకొట్టే
ప్రతివ్యక్తిని కాల్చుతుంది
ఈ మూకల కుతంత్రాల్ని
బట్టబయలు చేస్తోంది.

మళ్ళీ వస్తున్నాయి మన ఊరికి
చిలుక పలుకుల దేగలు
రక్తం తాగే రాబందుల మూకలు
ఉషస్సులూ మనస్సులూ జాగ్రత్త
పాపలూ కనుపాపలూ జాగ్రత్త

— చెరబండరాజు

అహింసా గుండాలు

గుండాలెప్పుడూ పంటలు పండించలేరు
పొలాల్లో నాగలి చేబట్టలేరు
నాట్లు వేయలేరు
రైళ్ళు నడపలేరు
తలమీద తట్టపెట్టుకుని వేగన్‌కి బొగ్గు ఎక్కించలేరు
ప్రజల భుజాలతో భుజాలు కలిపి నడువలేరు

గుండాలెప్పుడూ సోడాసీసాలతో దాక్కుంటారు.
ప్రజల గుడిసెలకి నిప్పెట్టే పెట్రోలు వాళ్ళు
ప్రజా శత్రువుల కాపలా కుక్కలువాళ్ళు
హోటళ్ళలో, అంసెంబ్లీల్లో; కౌన్సిల్‌లో గుండాలు
ఆ గుండాలకితోడు లైసెన్స్‌డ్ కాకీయునీఫామ్ గుండాలు
ప్రజల ఆస్తుల్ని వీధుల్లోకి విసిరేసి తగలెట్టే గుండాలు

ఇరవై యేళ్ళు నిండాయి
దోచుకున్నంతా దోచుకున్నారు
ఈ దోపిడీ దొంగలమధ్య పంపకాలు కుదురలేదు

సర్దుబాటు జరుగలేదు
పంపకాల్లో హెచ్చు తగ్గులొచ్చేసరికి
వీధుల్లో పడ్డాయి కుక్కలు
విస్తరి చించాయి కుక్కలు
కుక్కలుకావు పురుగులుకావు పాములుకావు పశువులుకావు
ఇవి గుండాలు
ఇవి కాంగ్రెసులు

వల్లకాటికి పోయేదారి ట్రాఫిక్ పోలీసులతో సిద్ధంగావుంది
ద్రోహులను పాడెమీదికెక్కిస్తున్నారు ప్రజలు
తలా ఒకచేయివేసి పాడె నడిపించండి
చచ్చిందని డాక్టర్ రిపోర్ట్ ఇచ్చినా
బతికేవుందని పార్లమెంటులూ, ప్రెస్సులూ, రేడియోలు
ప్రకటించవచ్చు

టెలివిజన్‌లో చూపించనూవచ్చు
శవాన్ని కాల్చిందే ఋజువని మీకళ్ళతో చూడందే వాదులొద్దు
జాగరణ చేయండి
జాగ్రత్త పడండి

ఏ భాషా ఏ ప్రాంతమూ ఏ ప్రజలూ ఏ దేశమూ,
ఏ పూలూ ఏ చెట్లూ ఏ నదులూ ఏ అరణ్యాలూ
ఏ సముద్రాలూ ఏ ఎడారులూ ఏ అరణ్యాలూ
మనుషులమధ్య మంచితనంమధ్య శత్రుత్వపు గోడలు నిలుపవు
దోపిడీ దొంగల కుట్రలూ కుళ్ళూ తప్ప
గుండాల ముఠాల దురహంకారాలమధ్య తప్ప
బానిస మనస్తత్వాల వాళ్ళకాపలా కుక్కల మధ్య తప్ప

లాఠీలతో బులెట్లతో పాశవికంగా హింసించిన, చంపిన
గుండాలను కూకటివేళ్ళతో పీకిపారేయండి
మళ్ళీ ఈ పందులమీద పన్నీరుపోసి వేడుకలు చేసుకోకండి
గుండాల పత్రికల పతాక శీర్షికలకు మోసపోకండి
పేదతల్లుల తండ్రుల కడుపుశోకాన్ని
వాళ్ళ ఆకలి అరుపుల్ని మరిచిపోకండి
కొత్తమేకప్‌లో మారుపేర్లతో
ఆ శవం వారసులు అటూఇటూ పొంచి చూస్తున్నారు.

మళ్ళీ వొచ్చారా
మన చిన్న పిల్లలమీద లాఠీలు తప్పవు
బుల్లెట్లు తప్పవు
వీధుల్లో నెత్తుటి మడుగులు తప్పవు
ఇళ్ళల్లో కన్నీటి చినుకులు తప్పవు
ఈ కసాయి సంకరజాతి పిచ్చికుక్కల్ని కాల్చండి
దీర్ఘకాల సాయుధ సమరాన్ని సాగించండి.

– చలపతి

(పై మూడు కవితలు సృజన 30, మార్చి 1972 సంచిక నుంచి పునర్ముద్రితం)

"ఎలచ్చన్లు" (మొదటి కవర్ లోపలిపేజీ తరువాయి)

దొరలమద్దె కూకొని
పెజలమనిసి నంటున్నడు
మరిగిన్నాల్లుగ మంత్రిగుంటె
మాకేటి జరిగిందో
మల్లి మల్లి ఎలచ్చన్లు ॥మల్లొ॥

రైతుమనిసి నంటాడు
రైతురాజె మంటాడు
భూసాముల తోనేమొ
మంతనాలు సేత్తాడు
నాగలి పట్టనిరైతు
రైతులకేం సేత్తాడో
తెలవక మేం సత్తుంటే
ఎలచ్చన్లు ఎలచ్చన్లు ॥మల్లొ॥

మతతత్వం అంటాడు
నియంతృత్వ మంటాడు
వాటితో పోరాడనీకి
వామపచ్చ మంటాడు
పెజాసామ్య తాపనమే
పరమార్థం అంటాడు
కమ్మునిజం అంటాడు
సోసలిజం అంటాడు
భూసాముల బిడ్డలతో
చెట్టపట్ట లేత్తాడు
మరి భూసామ్యం పోకుండ
మతమేడకి పోతుందో
ఇప్లవమే జరక్కుండ
పెజాసామ్యమేడుందో
తెలవక మేం సత్తుంటె
ఎలచ్చన్లు ఎలచ్చన్లు ॥మల్లొ॥

కాంగ్రెసోల్లు జనతవోల్లు
రివిజనిష్టులు సోసలిష్టులు
వాల్లెవీల్లు వీల్లెవాల్లు
వీల్లంత వొక్కటెలె
రష్యనోల్ల అమెరికోల్ల
నమ్మిన బంటులువీల్లె
ఒకే గూటి పచ్చులంత
ఒకే నీటి కొంగలంత
శాన ఏల్లనుండి యీల్లు
శానశాన సెప్పతన్నరు
మావోటులు గెలుసుకొని
దొరలసేవ సేత్తన్నరు
మాబతుకులు రోజురోజు
మసిబొగ్గుల గైతుంటె
మాకడుపులు సల్లబడక
మావు సమ్మె సేత్తంటే
తూటాలతో మాకడుపులు
దండిగ నింపేత్తన్నరు
పోలీసులు మా సెల్లెల
మానాలను దోత్తుంటె
అడ్డొచ్చిన మాతమ్ముల
అంతం సూపేత్తన్నరు
మా బతుకులు మండిపోను
ఎవరు గెలిసినొక్కటే
మా కొద్దీ ఎలచ్చన్లు
మాయదారి ఎలచ్చన్లు
దగాకోరు ఎలచ్చన్లు
దగుల్బాజి ఎలచ్చన్లు ॥మల్లొ॥

— (మిగతా కవరు ఆఖరుపేజీలో....

SRJANA Telugu Monthly Dec. '79 H/WL-
Regd. No. with Registrar of News Papers 10953/67



ఎలచ్చన్లు గిలచ్చన్లు
మన బతుకులు మార్చలేవు
మన బతుకులు మారాలంటె
భూసామ్యం పోవాలంట
భూసామ్యం పోవాలంటె
దొరల కెదురు తిరగాలంట
దొరల కెదురు తిరిగి మనం
పోరాటం సెయ్యాలంట
అమెరికోల్ల రష్యవోల్ల
బంట్లరంగు తేల్చాలంట
మనబోటివోల్ల కొరకె
నక్సల్‌బరి నడిసిందట

మన బతుకుల కోసమే
సీకాకులం నిలిసిందట
అన్నలెందరో మనకై
పానాలె యిచ్చిరంట
అక్కలెందరో మనకై
రత్తాలె కార్చిరంట
నక్సలైటులంట వాల్లు
రాడికలోల్లంట వాల్లు
రైతు రాజ్జమొచ్చేదనుక
కూలి రాజ్జమొచ్చేదనుక
వాల్లతోనె నడుద్దాము
పోరాటం సేద్దాము ॥మల్లె

[.... ఎంత బలిసినావురో ఓరోరి .... ట్యూన్‌లో పాడుకోవచ్చు]